# ఐక్య ఉపాధ్యాయ

విద్యా విషయక మాసపత్రిక

**నవంబర్ - 2016**

సంపుటి- 42 సంచిక : 11



**సంపాదక వర్గం**

**ఎన్.కుమార్ రాజా**

ప్రధాన సంపాదకులు

**ఐ.వెంకటేశ్వరరావు**

**పి.బాబురెడ్డి**

**టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు**

**సిహెచ్.శ్రీహరి**

**జి.ప్రభాకరవర్మ**


**ఈ సంచికలో...**


| | |
|---|---|
| జాతీయం అంతర్జాతీయం | -04 |
| బాలల హక్కులు కాపాడుకుందాం | -05 |
| ఛలో పార్లమెంట్ | -07 |
| సమస్యలకు పరిష్కార మార్గం... | -08 |
| చిన్న దేశం - పెద్ద సందేశం | -09 |
| ప్రత్యామ్నాయ విద్యా విధానం | -11 |
| మౌలిక వసతుల అభివృద్ధి.... | -13 |
| టీచర్‌కు కంప్యూటర్ ... | -15 |
| ముఖ్యమైన ప్రాతినిధ్యాలు- | -17 |
| ఆహ్వాన సంఘం ఏర్పాటు... | -18 |
| ప్రశ్నోత్తరాలు | -19 |
| సదస్సులు - సమావేశాలు | -20 |
| మండల కౌన్సిల్ సమావేశాలు | -24 |
| ప్రాతినిధ్యాలు | -30 |
| ప్రభుత్వ ఉత్తర్వులు | -34 |



| | | | |
|---|---|---|---|
| దశాబ్దిచందా | : | ₹ | 1250-00 |
| 5 సం॥ చందా | : | ₹ | 650-00 |
| సం॥ చందా | : | ₹ | 150-00 |
| విడిప్రతి | : | ₹ | 15-00 |

**Union Bank Online**

**A/c No. 346402010025027**

**IFSC Code : UBINO534641**



**ఐక్య ఉపాధ్యాయ**

యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారి వీధి,

గవర్నర్‌పేట, విజయవాడ-520002

Ph.No. : 0866-2573763

Website: www.aputf.org

E-mail: ikyopadhyaya1975@gmail.com


# భావి పౌరుల సంక్షేమంపై దృష్టి సారించాలి

ప్రతి సంవత్సరం నవంబర్ 14 బాలల దినోత్సవం, నవంబర్ 20న బాలల హక్కుల దినోత్సవం జరుపుకుంటున్నాము. దేశవ్యాపితంగా సభలు, సమావేశాలు, బాలల వారోత్సవాలూ ఘనంగా నిర్వహిస్తున్నాము. అయినా బాలల సంక్షేమం కోసం రూపొందించిన ఈ దినోత్సవాల లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. పిల్లల హక్కుల గురించి తగినంత ప్రచారం కాని, చైతన్యం గాని కల్పించబడటం లేదు. బాలల హక్కుల పై రూపొందించిన చట్టాల అమలూ అంతం మాత్రంగానే ఉంది.

ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ బాలల హక్కుల ఒప్పందం జరిగి సంవత్సరాలు గడుస్తున్నా వైద్య ఆరోగ్యం, పౌష్టికాహారం లభ్యత తదితర ప్రాథమిక సౌకర్యాల కొంత పిల్లలను యింకా పట్టిపీడిస్తున్నది. 3వ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం మన దేశంలో 47% మంది పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. 5 సం॥ల లోపు పిల్లలలో ప్రతి ఇద్దరిలో ఒకరు పౌష్టికాహార లోపంతో ఉన్నారు.

బడులకు దూరమై బాల కార్మికులుగా మారిన బాలల హక్కుల ఉల్లంఘన నిత్యం కళ్ళముందు కనిపిస్తూనే ఉంది. ప్రపంచంలో దాదాపు 12 కోట్లమంది బాలకార్మికులు ఉన్నారని అంతర్జాతీయ కార్మిక సమాఖ్య తన నివేదికలో పేర్కొంది. మన దేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 43 లక్షలకు పైగా బాలలు బాల కార్మికులుగా పనులలో ఉన్నారు.పలు స్వచ్ఛంద సంస్థలు, వివిధ సర్వేలు అంచనా దీనికి చాలా రెట్లు ఎక్కువగానే ఉంది.

మన రాష్ట్రంలో 88వేలమంది బాలల్లో 3 లక్షలమందిపైగా బాల కార్మికులు ఉన్నట్లు పలు సర్వేలు తెలుపుతున్నాయి. వీరిలో సగంమంది పూర్తి కాలం బాలకార్మికులుగా పనిచేస్తుంటే మిగిలిన వారు అప్పుడప్పుడు బాలకార్మికులుగా ఉంటారు. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ బాల కార్మిక నిషేధ చట్టం చేసినప్పటికి అమలు నామమాత్రంగానే ఉన్నది. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కేవలం ఉచిత నిర్బంధ విద్య ద్వారానే సాధ్యమని పలు దేశాలు ఋజువు చేస్తున్నాయి.

భారత రాజ్యాంగం ఆర్టికల్-21 సవరణ ద్వారా 6 నుండి 14 సం॥ల బాలలందరికీ ఉచిత నిర్బంధ విద్య అందించడం ప్రాథమిక హక్కుగా గుర్తించారు. అయితే 2009లో తెచ్చిన విద్యాహక్కు చట్టం అమలు నేటికి బాలలకు ప్రోత్సహకరంగా లేదని జాతీయ విద్యా హక్కు ఫోరమ్ నివేదికలు తెలుపుతున్నాయి. విద్యారంగంలో ప్రతి 100 మంది పిల్లల్లో 19మంది బడిబయట ఉంటుందన్నారు. బడిలో చేరిన 100మందిలో 70మంది మాధ్యమిక స్థాయిలో డ్రాపవుట్ అవుతున్నారు. మన రాష్ట్రంలో 10వ తరగతికి చేరే సరికి 26% డ్రాపవుట్స్ మిగులుతున్నారు. అక్షరాస్యతలో ఆంధ్రప్రదేశ్ 31వ స్థానంలో ఉంది. విద్య వ్యాపారంగా మారడం, బాలల హక్కుల ఉల్లంఘన ప్రభావం పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది.

ఈ దశలో బాలల హక్కుల పట్ల బాలల హక్కుల సంఘాలు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు, పౌరసమాజం బాధ్యత తీసుకోవాలి. కేంద్ర, ప్రభుత్వాలు బాల కార్మిక చట్టం, విద్యాహక్కు చట్టం వంటి బాలల సంబంధిత చట్టాలు సక్రమంగా అమలు అయ్యేలా చూడాలి. నేటి బాలలే రేపటి భవిష్యత్తుగా భావించాలి. భావి పౌరుల సంక్షేమంపై దృష్టి సారించాలి.

# జాతీయం అంతర్జాతీయం

### కారు చీకట్లో కాంతి రేఖ - సుప్రీంకోర్టు తీర్పు

కేసులు వేసిన తాత్కాలిక ఉద్యోగులందరూ అతితక్కువ గ్రేడ్‌వద్ద రెగ్యులర్ స్కేలులోని కనీసవేతనానికి అర్హులని సుప్రీంకోర్టు డివిజన్ బెంచి తీర్పునిచ్చింది. 2016 అక్టోబర్ 26న సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు వర్క్‌చార్జ్డ్, డెయిలీవేజ్, క్యాజువల్, అడహాక్, కాంట్రాక్ట్ తరహా తాత్కాలిక ఉద్యోగులకు కారుచీకట్లో కాంతి రేఖ. "ఒకే పనికి పెట్టబడిన ఉద్యోగికి వేరొక వ్యక్తికంటే తక్కువ వేతనం ఇవ్వరాదు. సంక్షేమ రాజ్యంలో ఆ పని అసలే చేయకూడదు. అలా చేస్తే అవమాన పర్చడమే కాదు, మానవత్వపు పునాదుల్నే అది పెకిలిస్తుంది. పరిస్థితుల వల్ల నెట్టబడితే తప్ప స్వతహాగా ఎవరూ తక్కువ వేతనానికి పనిచేయరు. అదే పనిలో ఉన్నవారితో పోల్చినప్పుడు తక్కువ వేతనం ఇవ్వడం బానిస దోపిడీ చర్యకిందికి వస్తుంది. ఇది క్రూరమైన పద్ధతి" అంటూ తీర్పులో వ్యాఖ్యానించింది. ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన డివిజన్ బెంచ్ ఇచ్చిన ఈ తీర్పును అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలది.

### స్త్రీ పురుష ఆర్థిక సమానత్వానికి మరో 170 ఏళ్ళు

పనుల్లో పాల్గొనడం, జీతాలు, చదువు, రాజకీయాల్లో పాత్ర లాంటి విషయాల్లో స్త్రీ పురుష సమానత్వం కోసం ప్రయత్నాలు జరుగుతున్నా సంపూర్ణ ఆర్థిక సమానత్వం రావడానికి మరో 170ఏళ్ళు పడుతుందని "వరల్డ్ ఎకనామిక్ ఫోరం" తెలిపింది. తన 391 పేజీల రిపోర్టులో WEF "ప్రపంచవ్యాప్తంగా స్త్రీ పురుష అసమానతలు క్రమంగా తగ్గుతున్నాయని అయితే 2008 ఆర్థిక సంక్షోభం ఇంకా వీడని నేపథ్యంలో గత సంవత్సరం వీరి మధ్య ఆర్థిక అసమానతలు పెరగడం కనిపిస్తోంద"ని తెలిపింది. 144 దేశాల్లో జరిపిన ఈ సర్వే విద్య, ఆరోగ్యం, ఆర్థిక అవకాశాలు, రాజకీయ సాధికారికత తదితర అంశాల ఆధారంగా జరిగింది. ప్రపంచంలో అత్యుత్తమ విద్యావ్యవస్థ కల్గిన ఫిన్‌లాండ్ స్త్రీ పురుష సమానత్వంలో మొదటి స్థానంలో వుంది. తరువాతి స్థానాల్లో ఐస్‌లాండ్, నార్వే, స్వీడన్, రువాండా తదితర దేశాలు వున్నాయి. చివరన యెమెన్, సిరియా, సౌదీ అరేబియా, ఇరాన్‌లు వున్నాయి.

"సంపాదించే పని" వైపునుంచి చూస్తే ప్రపంచవ్యాప్తంగా మహిళలు 54% వుండగా పురుషులు 81% వున్నారు. సగటు సంవత్సరం ఆదాయం మహిళలకు 10,778 డాలర్లు వుండగా పురుషులకు 19,873 డాలర్లుగా వుంది. అయితే విద్యలో ఈ అంతరం తగ్గిపోతూ రాబోయే 10 ఏళ్ళలో సమానస్థాయికి చేరుకొంటారని, అదే రాజకీయ రంగంలో మరో 82 ఏళ్ళు పడుతుందని WEF విశ్లేషించింది.

### ప్రభుత్వ రంగమే చోదక శక్తి - చైనా అధ్యక్షుడు

సోషలిజానికి అతి ముఖ్యమైన పాదార్థిక, రాజకీయ ప్రాతిపదిక ప్రభుత్వరంగ సంస్థలేనని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పేర్కొన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు విశ్వసనీయమైనవిగా, నమ్మదగినవిగా వుండా లంటే వాటిల్లో కమ్యూనిస్టు పార్టీ పాత్ర మరింత దృఢంగా వుండాలని నొక్కి చెప్పారు. పార్టీ నాయకత్వానికి, పార్టీ నిర్మాణానికి మూలం, ఆత్మ అంతా ప్రభుత్వరంగ సంస్థలేనని చెప్పారు. భారత దేశంలో పాలక పార్టీలు ఈ రకంగా ఆలోచన చేస్తే ఎంత బాగుణ్ణో కదా! అభివృద్ధి అభివృద్ధి అంటారేగానీ ఆ అభివృద్ధికి, మానవ వికాసానికి ప్రాతిపదిక ప్రభుత్వ రంగమేనని పాలకపక్షం (ప్రతిపక్షం కూడా) చెప్పదే? మనదెంత దౌర్భాగ్యం!!

### అమెరికాను ఎదిరిస్తున్న మరో ధీరుడు డ్యూటెర్టె

అమెరికా ఆధిపత్యాన్ని సవాలుచేస్తూ ఐక్య రాజ్య సమితి సమావేశంలో అమెరికా అధ్యక్షుడ్ని దయ్యంతో పోలుస్తూ "నిన్న ఇక్కడ ఒక దయ్యం సంచరించి వెళ్ళింది. గంధకం వాసన ఇంకా వస్తోందం"టూ వెనుజులా దివంగత అధ్యక్షుడు చావెజ్ చేసిన గర్జనలు ఇప్పటికీ మార్మోగుతున్నాయి. ఇప్పుడు తాజాగా ఫిలిప్పైన్ అధ్యక్షుడు డ్యూటెర్టె అమెరికాపై తొడలు చరిచి సవాలు విసురు తున్నాడు. "ఇకపై అమెరికా ఆటలు చెల్లవు. నా బొందిలో ప్రాణం వుండగా అమెరికాతో ఎలాంటి రక్షణ భాగస్వామ్యాన్ని అంగీకరించేది లేదు. అమెరికా తన బలగాల్ని ఫిలిప్పైన్స్ నుండి వెంటనే వెనక్కు తీసుకోవాలి" అని హెచ్చరించాడు. గత యేడాది జూన్‌లో అధ్యక్షుడుగా పదవీ బాధ్యతలు చేపట్టిన డ్యూటెర్టె మాదక ద్రవ్యాల భారిన పడి వేలాది యువత మృతి చెందుతుండడంపై కలతచెంది మాదకద్రవ్య ముఠాలపై ఉక్కుపాదం మోపాడు. యాంటీడ్రగ్స్ ఫోర్స్ నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో గత నెల నాటికి 3వేలమంది మృతిచెందారు. దీనిపై మానవ హక్కుల ఉల్లంఘన అంటూ ఒబామా తీవ్ర విమర్శలు చేయడంతో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతిన్నాయి.

### విద్యావ్యవస్థ భవిష్యత్‌కు ఉపాధ్యాయ సంఘాలు సిద్ధపడాలి

"మారుతున్న కాలంలో సంఘాల పాత్ర" అనే అంశంపై నాటింగ్ హామ్ యూనివర్శిటీ రీసెర్చ్ డైరెక్టరు హొవార్డు సివెన్స్ మాట్లాడుతూ "విద్యా భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి, టీచర్లు ఎదుర్కొంటున్న సవాళ్ళను పరిష్కరించడానికి ఉపాధ్యాయ సంఘాలు సిద్ధపడాలి" అన్నారు.

టీచర్ల పనివత్తిడి, అసంబద్ధమైన పాఠ్య ప్రణాళిక, విరామం లేని పరీక్షల నిర్వహణ లాంటి విషయాల్ని ఉపాధ్యాయ సంఘాలు మాత్రమే ఎదుర్కొని పరిష్కరించగలవు. సంఘాలు బోధన, అభ్యసనం పట్ల ఆశావహ దృక్పథం కల్గివుండాలి. టీచర్లు తమ సంఘాలతో కలిసి నడవాలి. సంఘాల్ని తమ సామూహిక శక్తిగా భావించి సంఘాల్ని బలోపేతం చేసుకోవాలని టీచర్లకు పిలుపునిచ్చారు. సంఘాలు మాత్రమే తరగతి గదికి, పాఠశాలకు, ప్రభుత్వానికి సంధానంగా వుంటూ ఉపాధ్యాయుల్ని క్రియాశీలక భాగస్వాములుగా మలిచేపని చేయగల వన్నారు.

### పోలిష్ విద్యా సంస్కరణలు హానికరం

పోలెండ్ ప్రభుత్వం తలపెట్టిన విద్యా సంస్కరణల్ని వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఉద్యోగులు, శాస్త్రవేత్తలు, స్థానిక రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి దేశవ్యాప్తంగా 17 నగరాల్లో 25వేలమంది నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ప్రస్తుతం వున్న విద్యావ్యవస్థను ప్రాథమిక, ఉన్నత, టెక్నికల్స్ స్కూళ్ళుగా ముక్కలు చేయడమేకాక ప్రాథమికోన్నత స్కూళ్ళను మూసేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మన రాష్ట్రంలో లాగా పోలెండ్‌లో కూడా ప్రాథమికోన్నత పాఠశాలల్ని మూసేయాలనుకోవడం యాధృచ్ఛికమేమీ కాదు. ప్రపంచ వ్యాప్తంగా GATS ఒప్పందంలో భాగంగా ప్రభుత్వ స్కూళ్ళ పట్ల ప్రభుత్వాల వైఖరిలో వస్తున్న మార్పులో భాగంగా దీన్ని అర్థం చేసుకోవాలి.

# బాలల హక్కులు కాపాడుకుందాం



నవంబర్ 20 బాలల హక్కుల దినోత్సవం. పిల్లలు తమ భావాలను, సమాచారాన్ని పంచుకోవడాన్ని, పరస్పర అవగాహన పెంచుకోవడాన్ని ప్రోత్సహించేం దుకుగాను ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభ బాలల దినోత్సవానికి రూపకల్పన చేసింది. ప్రపంచమంతట పిల్లల సంక్షేమాన్ని ప్రోత్సహిం చేందుకు పలు చర్యలు చేపట్టడం ఈ దినోత్సవ లక్ష్యం. అయితే నేటికి పిల్లల హక్కుల గురించి తగినంత ప్రచారం కాని, చైతన్యంగాని ప్రజలకు కల్పించబడలేదు. ఈ నేపథ్యంలో బాలల హక్కులు గురించి, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత గురించి తెలుసుకుందాం.

20వ శతాబ్దంలో మానవ హక్కుల చట్టబద్ధత ప్రస్తావనలో బాలల హక్కులకు ప్రత్యేక స్థానం కల్పించుటకై "ఎగ్‌లెంటిన్ జెగ్" అనే ఉపా ధ్యాయురాలు ఐక్యరాజ్య సమితిలో ప్రత్యేక చర్చకు చొరవ చూపింది. ఫలితంగా 1989 నవంబర్ 20న ఐరాస బాలల హక్కుల ఒడంబడికలో 180 దేశాలు సంతకం చేసి ప్రకటన చేశాయి. ఫలితంగా అనేక ప్రయత్నాల మూలంగా ఐక్యరాజ్య సమితి సర్వప్రతి నిధి సభ బాలల హక్కుల ఒప్పందను (కన్వన్షన్ ఆన్ ది రైట్ ఆఫ్ ది చైల్డ్) 20 నవంబర్ 1989న ఆమోదించింది. 31 డిసెంబర్ 1995 నాటికి 185 దేశాలు ఈ ఒప్పందానికి ఆమోదాన్ని తెలుపుతూ సంతకాలు చేశాయి. నవంబర్ 20వ తేదీని "బాలల హక్కుల పరిరక్షణ దినం"గా గుర్తించారు. భారత ప్రభుత్వం 1992 డిసెంబర్ 11న సంతకం చేసి బాలల హక్కుల ప్రకటన జారీ చేసింది.



ఎస్.కుమార్ రాజా
ఐక్యఉపాధ్యాయ
ప్రధానసంపాదకులు

ఈ ఒడంబడిక విశిష్టమైనది. సమగ్రమైనది. ఇది పిల్లల ఆర్థిక, సాంఘీక, సాంస్కృతిక, రాజకీయ హక్కుల పరిరక్షణకు పూను కున్న ఏకైక ఒప్పందం. ఈ తీర్మానంలో పేర్కొన్న బాలల హక్కుల్ని సంరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. అలాగే పిల్లల హక్కులని పరి రక్షించడానికి ఎవరికైనా ఈ తీర్మానం హక్కునిస్తుంది.

బాలలంటే యునైటెడ్ నేషన్స్ చైల్డ్ రైట్స్ కమ్యునికేషన్ (యుఎన్‌సి ఆర్‌సి) ప్రకారం 18 సం11రాలలోపు వారందరూ బాలలే. బాలలకు పుట్టుకతో సంక్రమించిన న్యాయమైన అవసరాలన్నీ వారి హక్కులే. అంతర్జాతీయ ఒడంబడిక ప్రకారం 18 సం11లోపు వారంతా 40 రకాల హక్కుల్ని కలిగి ఉంటారు. ఆ హక్కులే బాలల హక్కులు. వీటిని స్థూలంగా 4 రకాలుగా వర్గీకరించవచ్చు. అవి...

1. జీవించే హక్కు 2. రక్షణపొందే హక్కు 3. అభివృద్ధి చెందే హక్కు 4. భాగస్వామ్య హక్కు

ఈ నాల్గు హక్కుల్లో బాలల అవసరాలను వివిధ హక్కులుగా పరిగణించవచ్చు.

**జీవించే హక్కు (మనుగడ హక్కు) :**

మంచి విద్యను పొందడం, ఆరోగ్యంగా జీవించడం, రక్షిత మంచి నీరు పొందదరం, ఆరోగ్యకర వాతావరణంలో జీవించడం, తల్లి దండ్రులతో కలిసి జీవించడం, గుర్తింపు కల్గి ఉండడం, ఏకాంతాన్ని కోరుకోవడం, స్వేచ్ఛగా బ్రతకడం, గౌరవంగా జీవించడం, విశ్రాంతి కోరడం వంటి హక్కుల్ని బాలలు కలిగి ఉంటారు.

**బాలల హక్కుల ప్రకటన :**

**ఆర్టికల్-2 :** పిల్లలు స్వేచ్ఛాయుత, గౌరవప్రదమైన పరిస్థితుల్లో ఆరోగ్యకరంగా జీవించాలి. స్వాభావికం గా, శారీరకంగా, మాన సికంగా, నైతికంగా, ఆధ్యాత్మికంగా మరియు సామాజికంగా అభివృద్ధి చెందడానికి శాసనం లేదా ఇతర మార్గాల ద్వారా అవకాశాలు మరియు వసతులు కల్పించ బడతాయి.

**ఆర్టికల్-5 :** శారీరకంగా, మానసికంగా లేదా సామాజికంగా బలహీనులైన వారికి ప్రత్యేక పరిస్థితికి అనుగుణంగా ప్రత్యేక ఆదరణ, విద్య మరియు సంరక్షణ అందించబడతాయి.

**బాలల హక్కుల ఒప్పందం :**

**ఆర్టికల్-6 :** ప్రతి బాలుడు / బాలిక జీవించే హక్కును కలిగి వున్నారు. పిల్లల మనుగడ, అభివృద్ధి కొరకు ప్రభుత్వాలు సాధ్యమయి నంత ఎక్కువగా కృషి చేయాలి.

**రక్షణపొందే హక్కు (సంరక్షణ హక్కు) :**

లింగవివక్ష, కుల వివక్ష, మతవివక్ష, వర్ణవివక్ష, దోపిడీ, దౌర్జన్యం, లైంగిక వేధింపులు వంటి అవమానాలనుండి రక్షణపొందే హక్కును బాలలు కల్గిఉన్నారు. ఇవే కాక ప్రకృతి వైపరీత్యాలు, అంటు వ్యాధులు, శిక్షలు, పని, మత్తు మందులు, హింస, ప్రమాదాల నుంచి బాలలు రక్షణపొందే హక్కును కల్గి ఉంటారు.

**బాలల హక్కుల ప్రకటన :**

**ఆర్టికల్-2 :** పిల్లలు ప్రత్యేక సంరక్షణను అనుభవించాలి.

**ఆర్టికల్-4 :** పిల్లలు సామాజిక భద్రతా ప్రయోజనాలను పొందాలి. వాళ్లు ఆరోగ్యంగా పెరగడానికి, అభివృద్ధి చెందడానికి అర్హులు. దీనికోసం జనన పూర్వ మరియు జననానంతర సంరక్షణతో పాటు తల్లీ పిల్లల సంరక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధ మరియు రక్షణ కల్పించబడుతుంది. సరైన పోషకాహారం, గృహవసతి, వినోదం మరియు వైద్య సేవలు పొందే హక్కు పిల్లలకు కలిగి ఉన్నారు.

**ఆర్టికల్-6 :** పిల్లలు ఎక్కడ పెరిగినా సరైన సంరక్షణతో, వాత్సల్య పూరిత, నైతిక, భౌతిక వాతావరణంలో పెరగాలి.

**ఆర్టికల్-8 :** ఎలాంటి పరిస్థితుల్లోనైనా సంరక్షణ మరియు సహాయం పొందే వారిలో పిల్లలు ప్రథమంగా ఉండాలి.

**ఆర్టికల్-9 :** అన్ని రకాల నిర్లక్ష్యం, క్రూరత్వం మరియు దోపిడీ నుండి పిల్లలకు రక్షణ కల్పించాలి.

**ఆర్టికల్-10 :** జాతి, మత మరియు ఇతర వివక్షతలకు దారితీసే విధానాల నుండి బాలలకు రక్షణ.

**బాలల హక్కుల ఒప్పందం :**

**ఆర్టికల్-2 (2) :** తల్లిదండ్రుల లేదా చట్టబద్ధ సంరక్షకులు లేదా కుటుంబ సభ్యుల స్థాయి, వ్యక్తపరచిన అభిప్రాయాలు, నమ్మకాల కారణంగా ఉండే అన్ని రకాల వివక్ష లేక శిక్షల నుండి పిల్లలను రక్షించడానికి ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలి.

**ఆర్టికల్-3 (3) :** బాలల సంరక్షణకు సంబంధించిన సంస్థలు, సేవలు మరియు సౌకర్యాలు నిర్ధారించిన ప్రమాణాలకనుగుణంగా ఉండేలా ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటుంది.



**ఆర్టికల్-16:** బాలల యొక్క ఏకాంత, కుటుంబ, గృహ సంబంధ విషయాలలో చట్టవిరుద్ధ చొరబాటు నుండి రక్షణ.

**ఆర్టికల్-18:** పనిచేస్తున్న తల్లిదండ్రుల యొక్క గలిగిన శిశువుల సంరక్షణ మరియు సౌకర్యాలను పొందడానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి.

**ఆర్టికల్-19 :** పిల్లలను శారీరక, మానసిక హింస, నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురిచేయడం, లైంగిక హింస, దోపిడీల నుండి రక్షించుటకు చట్టపరమైన, పాలనా సంబంధిత, సామాజిక, విద్యాపరమైన చర్యలు ప్రభుత్వం చేపట్టాలి.

**ఆర్టికల్-23 :** వైకల్యం గల పిల్లలకు ప్రత్యేక రక్షణ, చికిత్సలు ఆరోగ్యపరమైన సంరక్షణ, పునరావాస చర్యలు, ఉపాధి, విద్యా వకాశాలు మరియు వారి శక్తి సామర్థ్యాలు గరిష్టస్థాయిలో పెంచు కోవడానికి తగిన ఏర్పాట్లను ప్రభుత్వం ఏర్పరచాలి.

**ఆర్టికల్-24:** అత్యున్నత ప్రామాణికత గలిగిన ఆరోగ్యాన్ని పొంద డం మరియు అనారోగ్యానికి చికిత్సపొందే అర్హత బాలలకు ఉన్నది. అనారోగ్య నివారణ చర్యలు, ఆరోగ్యం, విద్య మరియు శిశు మరణాలు తగ్గించడంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

**ఆర్టికల్-26 :** పిల్లల యొక్క సామాజిక భద్రతను గుర్తించి దానిని సాధించడానికి తగిన చర్యలు ప్రభుత్వం చేపట్టాలి.

**ఆర్టికల్-32 :** బాలలు ఆర్థిక దోపిడీకి గురికాకుండా ఉండే హక్కు మరియు పిల్లల విద్య, శారీరక, మానసిక, నైతిక, సామాజిక వికాసానికి భంగం కలిగించే ఏదైనా ప్రమాదకరమైన పనుల నుండి రక్షణపొందే హక్కు.

**ఆర్టికల్-33:** మత్తు పదార్థాల చట్ట విరుద్ధ వినియోగం, వాటి తయారీ లేదా అక్రమ రవాణాతో భాగస్వాములు కావడం నుండి రక్షణ.

**ఆర్టికల్-36 :** బాలల సంక్షేమానికి విఘాతం కల్గించే ఏ రకమైన దోపిడీ నుండైన రక్షణ.

**అభివృద్ధి చెందే హక్కు (వికాస హక్కు) :**

బాలల శారీరక, మానసిక, సాంఘిక, సాంస్కృతిక, వృత్తిపర, ఆధ్యాత్మిక మరియు నైతికంగా అభివృద్ధి చెందాలి. ప్రశంసలు పొందడం, స్వేచ్ఛగా ఆలోచించడం, సామాజిక సమానత్వం వంటి హక్కులు బాలలు కల్గి ఉంటారు.

**బాలల హక్కుల ప్రకటన :**

**ఆర్టికల్-6 :** సంపూర్ణ మరియు సమ్మేళన మూర్తిమత్వ అభివృద్ధికి బాలలకు ప్రేమ, వారి పట్ల అవగాహన అవసరం. వారు ఎక్కడ పెరిగినా సరైన సంరక్షణ, వాత్సల్యపూరిత వాతావరణం కల్పించాలి. ఎంతో అవసరమయితే తప్ప తల్లినుండి పిల్లలను వేరుచేయవద్దు. సరైన కుటుంబ సంరక్షణలేని పరిస్థితిలో ప్రజాధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

**ఆర్టికల్-10 :** తన తోటి వారికే సేవలు చేయడానికి తన సామర్థ్యాలను వినియోగించాలనే అవగాహన, సహనం, ప్రజల మధ్య స్నేహం, శాంతి మరియు విశ్వ సోదర భావం పెంపొందించబడేలా పిల్లలు పెంచబడాలి.

**బాలల హక్కుల ఒప్పందం :**

**ఆర్టికల్-6 :** పిల్లలందరూ జీవించే హక్కును కల్గి ఉన్నారు. పిల్లలు అర్థవంతంగా బ్రతకడానికి మరియు అభివృద్ధి చెందడానికి ప్రభుత్వమే శ్రద్ధ తీసుకోవాలి.

**ఆర్టికల్-18 :** బాలల పెంపకం మరియు అభివృద్ధిపరచడానికి తల్లిదండ్రుల ఇద్దరికీ బాధ్యత ఉన్నదని గుర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

**ఆర్టికల్-27 :** బాలలు శారీరకంగా, మానసికంగా, నైతికంగా, సాంఘీకంగా3 అభివృద్ధి చెందడం కోసం ప్రామాణికమైన జీవనాన్ని గడిపే హక్కు ఉంది. బాలల అభివృద్ధికి తల్లిదండ్రులదే ప్రాథమిక బాధ్యత తల్లిదండ్రులు తమ ఆర్థిక, జీవన ప్రమాణాలకు అనుగుణంగా వారి పిల్లల అభివృద్ధికి తోడ్పడాలి. ఈ విషయంలో తల్లిదండ్రులకు ప్రభుత్వం తగు సహాయాన్ని అందించాలి.

**ఆర్టికల్-39 :** బాలలను దారిద్ర్యం మరియు నైతిక పతనాల నుండి కాపాడుతూ వారు స్వేచ్ఛ, గౌరవం మరియు ఆరోగ్యంతో అభివృద్ధి చెందడానికి అన్ని సదుపాయాలు సమకూర్చాలి.

**పాల్గొనే హక్కు / భాగస్వామ్యపు హక్కు :**

ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సంఘాల ఏర్పాటు వంటి అంశాల్లో భాగస్వామ్యం పొందే హక్కు బాలలకు కలదు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, స్నేహపూర్వక జీవనం, ఇతరుల అభిప్రాయాల్ని గౌరవించడం కూడా ఈ కోవకే చెందుతాయి. ఈ హక్కులన్నీ బాలలు కల్గి ఉంటారు.

**బాలల హక్కుల ఒప్పందం :**

**ఆర్టికల్-12 :** బాలలను ప్రభావితం చేసే అన్ని అంశాల్లో వారి అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచే అవకాశాన్ని, అందుకు ప్రోత్సా హాన్ని బాలలకు ఇవ్వాలి.

**ఆర్టికల్-23 :** గౌరవం, స్వీయ నిబద్ధత (సెల్ఫ్ రిలైన్స్) కల్పిస్తూ శారీరక, మానసిక వైకల్యం గల బాలలు సంపూర్ణమైన గౌరవ పూరితమైన జీవితమును సమాజంలో పొందగలగాలి.

**ఆర్టికల్-31 :** పిల్లలు వారి వయస్సుకనుగుణంగా సాంస్కృతిక, కళాత్మక జీవనంలో పాల్గొనడం, సాంస్కృతిక, కళాత్మక, వినోదాత్మక మరియు తీరిక వేళల్లో కృత్యాల్లో పాల్గొనడానికి సరైన మరియు సమాన అవకాశాలను ప్రభుత్వం కల్పించాలి.

ఈ బాలల హక్కులపట్ల మన సామాజిక వ్యవస్థలు అయిన కుటుంబం, పాఠశాల, పౌరసమాజం ముఖ్యపాత్ర పోషించాలి. బాలల హక్కులు చట్టబద్ధంగా రక్షణ కల్పించడానికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. అప్పుడే బాలల దినోత్సవం, బాలల హక్కుల దినోత్సవాలకు పరిపూర్ణత కలుగుతుంది.



# నవంబర్ 29న 'ఛలో పార్లమెంట్'

# కాంట్రిబ్యూటరీ పెన్షన్ రద్దు చేయాలి పాత పెన్షన్ పునరుద్ధరించాలి

ప్రపంచబ్యాంకు ఆదేశాలతో, ఆర్థిక సంస్కరణల అమలులో భాగంగా మన దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని అమల్లోకి తెచ్చి 15 సం॥ పూర్తి అయినాయి. ఇప్పుడిప్పుడే దాని పర్యవసానాలు వెలుగులోకి వస్తున్నాయి. రిటైర్ అయినా, చనిపోయినా సిపిఎస్ పథకంలోని ఉద్యోగుల కుటుంబాలకు కనీస భద్రతలేదు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న పెన్షన్, కుటుంబ పెన్షన్, గ్రాట్యుటీ, కమ్యూటేషన్, పిఎఫ్ సౌకర్యం ఒక్క వేటుతో రద్దు చేశారు. సామాజిక బాధ్యతగా పెన్షన్ చెల్లించాల్సిన ప్రభుత్వాలు తమ బాధ్యత నుండి తప్పుకొని ఉద్యోగులు చెల్లించే సొమ్ము సైతం కార్పొరేట్ వర్గాల వ్యాపార ప్రయోజనాల కొరకు షేర్ మార్కెట్‌లో పెట్టి ఉపాధ్యాయుల, ఉద్యోగుల జీవితాలు బలి చేస్తున్నాయి.

పిఎఫ్ఆర్‌డిఏ బిల్లు 2013లో చట్టం అయినప్పటికి 2004 సెప్టెంబర్ 1 నుండే మన రాష్ట్రంలో సిపిఎస్ విధానం ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసింది. వామపక్షాలు అధికారంలో ఉన్న పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాల ప్రభుత్వాలు మాత్రమే పాత పెన్షన్ కొనసాగిస్తూ ఆయా శాసనసభల్లో తీర్మానించి ఉద్యోగుల పక్షాన నిలిచాయి. ఆ తర్వాత కేరళలో అధికారంలోకి వచ్చిన యుడిఎఫ్ (కాంగ్రెస్) ప్రభుత్వం పాతపెన్షన్ విధానం రద్దుచేసింది. ఇప్పటికీ పశ్చిమబెంగాల్, త్రిపుర రాష్ట్రాల్లో కొనసాగుతోంది. ఇటీవల ఎన్నికల సందర్భంగా తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు సిపిఎస్ పథకాన్ని రివ్యూ చేయడానికి సిద్ధమైనాయి. ఆంధ్రప్రదేశ్ శాసన సభలోకూడ సిపిఎస్ పథకాన్ని రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానం అమలు చేస్తూ తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

మన రాష్ట్రంలో టీచర్లు 94వేలు, ఉద్యోగులు 70వేలు మొత్తం 1 లక్షా 64 వేలమంది, దేశవ్యాపితంగా 46,83,792మంది సిపిఎస్ పథకంలో ఉన్నారు. వారు చెల్లించే వేలకోట్ల రూపాయలు కార్పొరేట్ల ప్రయోజనాలకు పెట్టుబడిగా పెడుతున్నారు.

సిపిఎస్ పథకం అమలులో వచ్చినప్పటి నుండి అనేక పోరాటాలు చేశాము. కార్పొరేట్ల ప్రయోజనాలకు పెద్ద పీటవేస్తున్న ప్రభుత్వాల్లో ఎలాంటి మార్పులేదు.

ఉద్యోగుల, ఉపాధ్యాయుల కుటుంబాలు కనీస భద్రత లేకుండా చేసిన సిపిఎస్ పథకం రద్దుకు విశాల ఐక్యతతో దేశవ్యాపిత పోరాటాలు చేద్దాం.

ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులు నియామకాలు ఆలస్యం కావడంతో పాత పెన్షన్ పథకం కోల్పోయారు. ఇది ప్రభుత్వ నిర్ణయాల జాప్యం వల్ల జరిగింది. కావున ప్రభుత్వమే బాధ్యత వహించి పాతపెన్షన్ పథకం వర్తింపజేయాలి.

సరళీకరణ ఆర్థిక విధానాలు ఇలాగే కొనసాగితే ప్రస్తుతం ఉన్న పిఎఫ్ఆర్‌డిఏ చట్టం అమలులోనే ఉంటే 2004 ముందు నియామకం పొందిన వారు కూడ పెన్షన్ పొందుతారనే గ్యారెంటీ లేదు. పెన్షనర్లకు పెన్షన్ ఉంటుందనే భద్రత లేదు.

అందుకోసమే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు అందరు కలిసి పెద్దఎత్తున పోరాటాలలో పాల్గొనాలి. సిపిఎస్ విధానం రద్దు అయ్యేంతవరకు పోరాడాలి.

అందులో భాగంగానే ఎస్‌టిఎఫ్ఐ - యుటియఫ్ దేశవ్యాప్తంగా దశలవారీ పోరాటాలకు పిలుపునిచ్చాయి. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.


**సిపిఎస్ విధానం రద్దు చేయాలి - పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరుతూ దేశవ్యాపితంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జులై 2016 నుండి నిర్వహించడం జరిగింది.**

**2016 సెప్టెంబర్ 2వ తేదీన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల, కార్మిక సంఘాలు చేపట్టిన జాతీయ సమ్మెకు యుటియఫ్ సంఘీభావంగా ధర్నాలు, ర్యాలీలలో యుటియఫ్ భాగస్వామి అయింది.**

**పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా నవంబర్ 29న "ఛలో పార్లమెంట్" కార్యక్రమం నిర్వహిస్తున్నది.**

**కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మన సంఘటిత శక్తిని చూపాలని కోరుతున్నాము.**

## ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్




"తల్లి శరీరాన్ని పోషించి పెంచుతుంది. ఉత్తమ గ్రంథం హృదయాన్ని పోషించి పెంచు తుంది" – రావూరు సత్య నారాయణరావు.

"పుస్తకాలు మనోమాలి న్యాన్ని తొలగించే దీపాలు" – అంబేద్కర్.

"జీవితాన్ని సమగ్రంగా దర్శింపజేసే వెలుగుదారులు చూపే ఉత్తమ సాధనాలు పుస్తకాలు" –స్వామి వివేకానంద.

"ఒక గొప్ప పుస్తకం చదివినప్పుడు ఒక గొప్ప స్నేహితుడు దొరికి నంత అనుభూతి కలుగుతుంది. దాన్ని మళ్లీ చదివినప్పుడు చిరకాల మిత్రుని కలిసినంత ఆనందం కలుగుతుంది" అంటారు రచయిత అలివర్ గోల్డ్‌స్మిత్. అలా ఎందరెందరో పుస్తకమునకు, పఠనమునకు గొప్పశక్తి వుందని అన్నారు... అంటున్నారు. నాడు పుస్తక పఠనాసక్తితో విలువైన గ్రంథ పఠనంలో నిమగ్నమైన వారిని ఒకప్పుడు పుస్తకాల పురుగులు అనేవారు. నేడు పుస్తకాలు తొలిచే పురుగులే కానీ, పుస్తక ప్రియులులేక పోవటం దురదృష్టకరం.

కందుకూరి వారు"చిరిగిన చోక్కా అయినా తోడుక్కో – కానీ మంచి పుస్తకం కొనుక్కో" అంటే.... నేటి యువత స్థితి దానికి భిన్నంగా నవనాగరికత ప్రభావం వల్ల మంచి చోక్కాలు తొడుక్కుంటున్నారు, కానీ మంచి పుస్తకాలను కొనుక్కోవడం లేదు. పాఠ్య పుస్తకాలు తప్ప ఇతర పుస్తకాల పఠనానికి ప్రాధాన్యత ఇవ్వడం లేదు. అందుకే పాఠశాల ప్రాధాన్యత తెలియజేయాలనే ఈ వ్యాసం....


జి.సి.మధుసూదన రావు
నెల్లూరు జిల్లా

**పిల్లలెందుకు చదవాలి :**

ప్రతి మనిషి బాల్యం తీపి జ్ఞాపకమే... కష్టమున్నా, నష్టమున్నా వేదనున్నా, ఆవేదనున్నా సరే. జీవితానికి గట్టి పునాది వేసేదీ, మంచివైపో, చెడు వైపో నడిపించేదీ... పరిపూర్ణ మానవుడి చేసేది పాఠశాలే. అటువంటి పాఠశాల స్థాయిలో విలువల పునాది బాగా విద్యార్థిలో కలిగిననాడే విద్యకు సార్థకత. విషయాగావహనకు, జ్ఞాన నిర్మాణానికి, ఆనందించడానికి, స్వతంత్రగా ఎదగడానికి పిల్లలలో పఠనాసక్తిని పెంచాలి. ఎందుకంటే పిల్లల్లో నేడు నేర ప్రవృత్తి పెరిగి పోతున్నది. పెద్దల పట్ల ప్రేమ, భయం, గౌరవం నానాటికీ తగ్గి పోతున్నది. ఇహ పిల్లలు 10వ తరగతికి రాగానే పెద్దవాళ్లమై పోయినట్లు ప్రవర్తిస్తున్నారు. ఇంటర్‌నెట్, సినిమాలు, టీవి కార్యక్రమాలు మొదలగునవి వాళ్లను నైతికంగా పతనం చేస్తున్నాయి. విలువలు లేకుండా పోతున్నాయి. ఫలితంగా వ్యక్తి భద్రత, సామాజిక భద్రతకు భంగం కలుగుతున్నది.

అదే పాఠశాల స్థాయి నుంచి విద్యార్థికి పాఠ్య పుస్తకాలతో పాటు ఇతర పుస్తకాలు చదివే అలవాటును పెంచిన యెడల వారిలో ఎంతో మార్పువస్తుంది. పాఠ్య పుస్తకాలు పాఠాలు నేర్పిస్తే ప్రముఖ గ్రంథాలు, కథలు "జీవిత పాఠాలు" నేర్పిస్తాయి. సమస్య పరిష్కా రాలకు ఎన్ని మార్గాలున్నాయో ఆలోచిం చేలా చేస్తాయి. నేడు యువత మానసిక ధైర్యాన్ని కోల్పోతున్నారు. ప్రతి సమస్యకు మార్గం హత్య, ఆత్మహత్య అనుకుంటున్నారు. అది కూడా ఉన్నత విద్య స్థాయిలో ఎక్కువగా వుంది. మరో ప్రక్క నేను వేరు, నా దేశం వేరు, నేను వేరు నా ప్రభుత్వం వేరు, దేశం చెడిపోయినా నేను బాగుపడాలి. ప్రభుత్వం, ఇతరులు నష్టపోయినా నేను సొమ్ము చేసుకోవాలనే ఆలోచన చాలా మంది యువతలో ఎక్కువై పోయింది. ఈ తరహా ద్వైదీభావం చాలా ప్రమాదకరం. సమాజంలో యువత ఇలాంటి కార్యక్రమాలు చేపడితే సమాజాభివృద్ధి కుంటుపడుతుంది. సమాజాభివృద్ధికి మూలం మానసిక వికాసం, స్థైర్యం కలిగిన యువత.

యువత బలహీన మనస్కులకు ధైర్యాన్నివ్వాలి కాని తామే బలహీనులవ్వ కూడదు. అందుకే వివేకానంద బలమే జీవనం – బలహీనతే మరణం అన్నారు. విద్య లక్ష్యం ధైర్యసాధన కావాలి. నాడే యువత అభివృద్ధి, సమాజాభివృద్ధి. మరి యువతకు ధైర్యాన్ని ఇచ్చేవి, ఆలోచింప జేసేవి, విలువలు పెంచేవి పుస్తకాలు మాత్రమే. అందుకే యువతలో పఠనాసక్తిని పాఠశాల స్థాయి నుంచి పెంచాలనే ఈ పఠనోత్సవాలు.

**పఠన పుస్తకాలు ఎలావుండాలి :**

పిల్లలకు అందించే పుస్తకాలు ఆర్షణీయంగా ఆలోచింపజేసే బొమ్మలతో వుండాలి. పిల్లలకు పరిచయమైన లేదా తెలిసిన పదాలతో నిండిన పుస్తకమై వుండాలి. పిల్లలకు చదవడంలో స్వేచ్ఛ నివ్వాలి. పిల్లలు కథల పుస్తకాలు చదివేటప్పుడు ప్రశ్నలు వేయడం, ఇలా చదవరాదని చెప్పడం, చేయరాదు. పిల్లలనే ఇష్టమైన పుస్తకాలు ఎంచుకోనివ్వాలి. చదవడం మొక్కుబడి కార్యక్రమం కాకుండా ఉపాధ్యాయుడు చూడాలి. నిండే పిల్లల్లో పఠనాభివృద్ధి కల్గుతుంది. సృజనాత్మకంగా ఆలోచించి తమ ఆలోచనలకు అక్షరరూపం ఇస్తారు.

**ఉపాధ్యాయులందరిని భాగస్వాములు చేయాలి :**

నేడు సర్వశిక్షా అభియాన్, ఆర్ఎంఎస్ఏ నిధుల క్రింద ప్రతి పాఠశాల గ్రంథాలయ పుస్తకాలు కొనుగోలు చేస్తున్నారు. చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొందరే వాటిని విద్యార్థులకు అందిస్తు న్నారు. మరికొన్ని పాఠశాలల్లో బీరువాల్లో పుస్తకాలు నలగకుండా వుంటున్నాయి. ఈ స్థితి మారాలి. ఇక ఆర్ఎంఎస్ఏలో భాగంగా సెకండరీ పాఠశాలకు పుస్తకాల కొనుగోలుకు నిధులు మంజూరు చేస్తున్నారు. కానీ బీరువాల కొనుగోలుకు చివర్లో నిధులు కేటాయిస్తు న్నారు. ఫలితంగా చాలా పాఠశాలల్లో గ్రంథాలయ పుస్తకాలు గోతాల్లోనే వుంటున్నాయి. ఈ విధానం మారాలి. ముందుగా ఫర్నిచర్ కేటాయించి తరువాతే పుస్తకాల కొనుగోలుకు నిధులు కేటాయించాలి. ఇక మరో ముఖ్య విషయం పాఠశాల అకడమిక్ పీరియడ్ ప్రణాళికలో గ్రంథాలయ పఠనంనకు ఒక పీరియడ్ కేటాయిస్తున్నారు. ఆ పీరియడ్ ఓ ఉపాధ్యాయుడు నిర్వహిస్తున్నారు.

ఇలా కాకుండా ప్రతి ఉపాధ్యాయునికి తన పీరియడ్స్‌లో ఓ పీరియడ్ గ్రంథాలయానికి కేటాయించి ప్రతి రోజు పిల్లలకు ఓ గ్రంథాలయ పీరియడ్ వుండే విధంగా రూపకల్పన చేసిన యెడల అందరూ భాగస్వాములు కాగలరు. విద్యార్థులకు ప్రతి రోజు గ్రంథాలయ పీరియడ్ వుండటం ద్వారా పఠనాసక్తి పెరుగుతుంది. తద్వారా పఠనోత్సవ లక్ష్యాలు నెరవేరుతాయి. పుస్తకాన్ని హస్త భూషణంగా కాకుండా మస్తక భూషణంగా అందరూ భావిస్తారు. పుస్తకాలు పాఠకులకు నేస్తాలుగా నిలుస్తాయి. వ్యక్తిత్వ వికాస ప్రగతికి దారిచూపుతాయి.



# చిన్న దేశం - పెద్ద సందేశం
## ఫిన్లాండ్ విద్యా విధానం

సి.వి.కృష్ణయ్య
జనవిజ్ఞాన వేదిక

ఫిన్లాండు యూరఫ్ ఖండంలో ఉత్తరాన ఉన్న ఒక చిన్న దేశం. ఆ దేశ జనాభా కేవలం 54 లక్షలు మాత్రమే. కాని వారి విద్యా విధానం ఈనాడు ప్రపంచదేశాలన్నిటికీ ఆదర్శవంతంగా మారింది. అక్కడి విద్యా విధానాన్ని అధ్యయనం చేయడానికి ప్రపంచ దేశాలన్నీ ఎగబడటంతో, విద్యా విధానమే ఆ దేశ టూరిజానికి వనరుగాను, కేంద్రంగాను మారింది.

వరల్డ్ ఎకనమిక్ ఫోరం అధ్యయనాన్ని బట్టి ప్రపంచంలో ఎక్కువ సంతోషంగాను, సృజనాత్మకంగాను విద్యార్థులున్న దేశంగా ఫిన్లాండ్ గుర్తించబడింది. నోకియా కంపెనీ ఆ దేశానికి సంబంధించిందే. యాంగ్రీ బర్డ్స్ - సృష్టికర్తలు ఆ దేశస్తులే. 130కోట్ల ప్రజలున్న మన దేశానికి ఇప్పటివరకు వచ్చిన నోబుల్ ప్రైజులు ఐదు. 54 లక్షలమంది ప్రజలున్న ఫిన్లాండ్‌కు కూడా ఐదు నోబుల్ ప్రైజులు వచ్చాయి. ఒక దేశ అభివృద్ధికి సామాజిక శాంతికి మూలం అక్కడి విద్యా విధానమే.

ఫిన్లాండ్ విద్యా విధానానికి ఇంత ప్రాధాన్యత రావడానికి ముఖ్య కారణాలు నాల్గు.

1. ఉపాధ్యాయులకున్న ప్రాధాన్యత, ఎన్నిక, శిక్షణ
2. బోధనా పద్ధతులు
3. అందరికీ సమాన అవకాశాలు
4. పాఠశాలల నిర్వాహణ

**ఉపాధ్యాయులకున్న ప్రాధాన్యత, ఎన్నిక శిక్షణ :**

ఫిన్లాండ్ సమాజం ఉపాధ్యాయులకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంది. మన దేశంలో ఐఏఎస్, ఐపిఎస్‌లకున్నంత ప్రాధాన్యత గౌరవాలు అక్కడ ఉపాధ్యాయులకు వున్నాయి. ప్రభుత్వ విధానాల రూపకల్పన లోనూ ఉపాధ్యాయులకు భాగస్వామ్యం ఉంటుంది. జీతభత్యాలు కూడా ఎక్కువే. ప్రతి ముగ్గురు విద్యార్థుల్లో ఒకరు టీచరు కావాలని కోరుకొంటారు.

ఉపాధ్యాయుడిగా ఎన్నిక కావడం అంత సులువుగాదు. చదువుల్లో బాగా రాణించిన వారు, ఉపాధ్యాయ వృత్తిమీద ఆసక్తి అంకిత భావం గల వారినే ఎన్నిక చేస్తారు. నూరుమంది అభ్యర్థులకుగానూ పదిమంది కూడా ఎన్నికకావడం కష్టం. అనేక వడపోతలు, ఇంటర్వ్యూలు వుంటాయి. ప్రతి ఒక్కరికి మాస్టర్ డిగ్రీ తప్పనిసరి. ప్రతి ఒక్కరు యూనివర్సిటీలో ఏదో ఒక థీసెస్ రాసి గుర్తింపు పొంది ఉండాలి. యూనివర్శిటీ విద్య 5 సం॥లతోపాటు రెండు సంవత్సరాలు ఉపాధ్యాయ శిక్షణ ఉంటుంది. శిక్షణ మొత్తం బోధనా పద్ధతులపైన ప్రాక్టికల్‌గా ఉంటుంది. ఉపాధ్యాయులకు ప్రతి సంవత్సరం ఇన్ సర్వీస్ శిక్షణ ఉంటుంది.

**బోధనా పద్ధతులు :**

బోధన విద్యార్థి కేంద్రంగా ఉంటుంది. రీడింగ్ (కమ్యూనికేషనల్ స్కిల్) గణితం, సైన్సు ఈ మూడింటికి అధిక ప్రాధాన్యత ఉంటుంది. వీటితోపాటు సంగీతానికి (మ్యూజిక్) కూడా అధిక ప్రాధాన్యతనిస్తారు. 3 నెలల వయస్సు నుండి పిల్లలకు సంగీతం వినిపిస్తారు. సంగీతంతో గణితానికి సృజనాత్మకతకు మానసిక వికాసానికి ఎక్కువ సంబంధం ఉంటుందని వారి ఉద్దేశ్యం.

టీచర్‌కు గైడ్‌లైన్స్ మాత్రమే ఇస్తారు. సిలబస్ మాత్రమే ఉంటుంది. పాఠ్యపుస్తకాల ఎన్నిక, పిల్లలు నేర్చుకోవడానికి కావలసిన బోధనా పద్ధతులు, వస్తుసామగ్రి సమకూర్చుకోవడం-స్కూల్స్, టీచర్ నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. అంతా వికేంద్రీకరణ - స్థానిక పరిస్థితుల కనుగుణంగా రూపొందించుకొంటారు.

సంగీతంతోపాటు ఆటపాటలు, జానపద సంగీతం, క్రాఫ్ట్, చిత్ర లేఖనం, పెయింటింగ్, ఉడ్‌వర్క్, వంట చేయడం, విజ్ఞాన విహార యాత్రలువంటి నాన్ అకడమిక్స్‌కు ప్రాధాన్యతనిస్తారు. ఇవన్నీ వ్యక్తిగత వికాసానికి మానసికోల్లాసినికి దోహదం చేస్తాయంటారు అక్కడి విద్యా వేత్తలు, ఉపాధ్యాయులు.

6 సంవత్సరాలు నిండితేనే పాఠశాలలో చేర్చుకొంటారు. 7 నుండి 15 సం॥ల వయస్సు పిల్లల్ని బేసిక్ కాంప్రహెన్సివ్ స్కూల్స్ (సమగ్ర ప్రాథమిక పాఠశాల)లో చేర్చుకొంటారు. 7 నుండి 15 సంవత్సరాల వరకు - 9 సంవత్సరాలు ఈ స్కూల్సులో ప్రతి ఒక్క విషయం సమగ్రంగా నేర్పిస్తారు. పరీక్షలుండవు - చివర బేసిక్ స్కూల్ చదువు ముగింపులో మాత్రమే పరీక్షలుంటాయి. హెూమ్‌వర్క్‌తో వత్తిడి ఉండదు. క్లాసు రూమ్‌లో విసుగు పుట్టినప్పుడు, అలసిపోయి నప్పుడు విశ్రాంతి తీసుకోడానికి ప్రతి స్కూల్లో విశ్రాంతి గదులుంటాయి. రోజుకు 3 గంటలలోపే అకడమిక్ పీరియడ్స్ ఉంటాయి. మధ్య మధ్యలో 15 నుండి 20 నిమిషాలు ఏదో ఒక దానికోసం లీజర్ ఉంటుంది - టీచర్ తన స్కూల్ సమయంలో ప్రిపేర్ కావడానికి కావలసినంత సమయం ఉంటుంది. దీనివల్ల పిల్లలకు టీచర్స్‌కు హాయిగా ఉంటుంది. వత్తిడి ఉండదు - "Less is More" అనేది వారి ప్రధాన సిద్ధాంతం. నేర్చుకోవాల్సిన విషయాలు ఎంత తక్కువగా ఉంటే అంత ఎక్కువగాను, సమగ్రంగాను, ఆనందం గానూ నేర్చుకొంటారనేది వారు నిరూపిస్తు న్నారు. క్లాసుకు 20మందే పిల్లలు ఉంటారు.

ఆ చలి దేశంలో సాక్స్ లేకుండా, షూ లేకుండా తరగతి గదుల్లో పిల్లలు ప్రవేశిస్తారు - ప్రకృతిలో ఆ పాదాలు ఒదిగిపోవాలని, ఆ వాతావరణానికి అలవాటు పడాలని వారి ఉద్దేశ్యం. మన దేశంలో టైలు కట్టి, సాక్స్ వేసి, షూ తొడిగి, ఇన్‌షెర్టు బిగించి, పిల్లల్ని హింసించే తల్లిదండ్రులకు అవగాహన లేదు. పాఠశాలల యాజమాన్యాలకు పిల్లల మీద కనీసం జాలి లేదు.

## కాంట్రాక్టు, పర్మినెంట్ తేడా లేదు

# ఒకే పనికి ఒకే వేతనం - సుప్రీంకోర్టు తీర్పు

'కాంట్రాక్టు ఉద్యోగులకూ శాశ్వత ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాల్సిందే' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న లక్షలాదిమంది ఉద్యోగులు, కార్మికులకు ఊరటనిచ్చేలా ఆదేశాలు జారీ చేసింది. 'ఒకే పనికి... ఒకే రకమైన వేతనం' అన్న విధానాన్ని అనుసరించాల్సిందే అని స్పష్టం చేసింది. జస్టిస్ జెఎస్ ఖేహర్, జస్టిస్ ఎస్ఏ బాబ్డేలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. పంజాబ్ రాష్ట్రానికి చెందిన ఒక కాంట్రాక్టు ఉద్యోగి దాఖలు చేసిన కేసులో సుప్రీంకోర్టు ఈ తీర్పు చెప్పింది. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా తనకు వేతన చెల్లించాలని ఆయన కోరారు. అయితే కాంట్రాక్టు ఉద్యోగులకు పర్మినెంట్ ఉద్యోగుల్లా వేతనాలు వర్తించవని పంజాబ్, హరియాణా ఉమ్మడి హైకోర్టు తీర్పు చెప్పింది. ఈ తీర్పును సుప్రీంకోర్టు ఇప్పుడు పక్కన పెట్టింది. "ఒకే రకమైన పనిచేస్తున్న వారందరికీ ఒకే విధమైన వేతనం అందాలి. కార్మికులకు వారి ప్రయోజనాలు అందకుండా చేసేందుకు కృత్రిమ ప్రాతిపదికలు సృష్టించడం తప్పు. ఒకే విధమైన బాధ్యతలు నిర్వహిస్తూ, ఒకేరకమైన పనిచేస్తున్న వ్యక్తికి (కాంట్రాక్టు పేరిట).... మరొకరి (పర్మినెంట్ ఉద్యోగి) కంటే తక్కువ జీతం ఇవ్వడం కుదరదు. మరీ ముఖ్యంగా సంక్షేమ రాజ్యంలో అస్సలు కుదరదు" అని ధర్మాసనం పేర్కొంది. "ఎవ్వరూ తమ ఇష్టం ప్రకారం తక్కువ వేతనం తీసుకుని పని చేయరు. తమ కుటుంబాన్ని పోషించుకునేందుకు.. తప్పనిసరి పరిస్థితుల్లో తన ఆత్మ గౌరవాన్ని, హుందాను, స్వీయ విలువను తగ్గించుకుని మరీ తక్కువ జీతానికి పనిచేస్తారు. అలా చేయకపోతే తమపై ఆధారపడిన వారికి ఇబ్బందులు తలెత్తుతాయని తెలుసు" అని తీర్పు రాసిన జస్టిస్ ఖేహర్ పేర్కొన్నారు. "ఒకే రకమైన పరిస్థితుల్లో, ఒకే రకమైన పనిచేసే వారి మధ్య వేతనాల్లో తేడా ఉండటమంటే... శ్రమను దోచుకోవడమే. ఇది ఖచ్చితంగా అణచివేత చర్యే" అని స్పష్టం చేశారు.

'అంతర్జాతీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల ఒప్పందంపై భారత్ 1979 ఏప్రిల్ 10వ తేదీన సంతకం చేసింది. దీని ప్రకారం సమాన పనికి సమాన వేతనం పొందే హక్కు లభించింది. దీని నుంచి ప్రభుత్వం తప్పించుకోజాలదు. అంతేకాదు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 141 ప్రకారం సుప్రీంకోర్టు చెప్పిన తీర్పు ప్రకారం కూడా సమాన పనికి సమాన వేతనం రూపొందడమనేది తిరుగులేని హక్కు. ఉద్యోగి పర్మినెంటా, కాంట్రాక్టా అనే అంశంతో నిమిత్తం లేదు" అని ధర్మాసనం తేల్చి చెప్పింది.

(9వ పేజీ తరువాయి)

## చిన్న దేశం - పెద్ద సందేశం



**అందరికీ సమాన అవకాశాలు :**

అక్కడ ప్రైవేట్ స్కూళ్లు లేవు. చదువు అందరికీ సమానమే. 1 నుండి 9 వరకు నిర్బంధ విద్య అమలులో వుంది. అక్షరాస్యత 100 శాతం. బిడ్డ తల్లి గర్భంలో ఉన్నప్పటినుండి ప్రభుత్వం బాధ్యత తీసుకొని జాగ్రత్తలు పాటిస్తుంది. గర్భవతికాగానే కాబోయే తల్లిదండ్రులకు రెండు పుస్తకాలు, పుట్టబోయే బిడ్డకు ఒక పుస్తకం మొత్తం 3 పుస్తకాలు ఇస్తారు. వాటిలో వారు తెలుసుకోవలసిన విషయాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు ఉంటాయి. బిడ్డ పుట్టగానే బిడ్డకు కావలసిన బట్టలు, ఆట వస్తువులతో సహా ఒక కిట్‌ను అందిస్తారు. తల్లిదండ్రులు ఉద్యోగస్తులైతే 3 నెలల వయస్సునుండి డే కేర్‌లో చేర్చుకొంటారు. ఇంట్లోనే ఉండి బిడ్డను చూసుకోవాలని భావిస్తే 3 సం॥ల వయస్సు వచ్చేవరకు తల్లికి ప్రభుత్వం డబ్బు చెల్లిస్తుంది. పిల్లలు సమాజపు ఉమ్మడి సంపదగా భావిస్తారు. 8 నెలల వయస్సు నుండి 6 సంవత్సరాలు డే కేర్, నర్సరీ, ప్రీప్రైమరీ అన్నిటిలో ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకొని పిల్లలు మంచి బాధ్యతగల పౌరులుగా పెరగడానికి కావాలసిన శిక్షణనిస్తుంది.

డే కేర్ నుండి ప్రీప్రైమరీ వరకు అంటే ఆరు సంవత్సరాల వరకు ప్రతి బిడ్డపైనా వ్యక్తిగత శ్రద్ధ పెడతారు. అందుకనే 3 సం॥లలోపు పిల్లల కోసం ప్రతి 12 మందికి ఒక టీచర్, ఇద్దరు నర్సులు వుంటారు. 4వ సంవత్సరం నుండి 20మంది పిల్లలకు ఒక టీచర్ ఇద్దరు నర్సులు ఉంటారు.

బేసిక్ ఎడ్యుకేషన్ - 7 నుండి 15 సంవత్సరాల వరకు ఆ తర్వాత యూనివర్శిటీ విద్యతో సహా అంతా ఉచితమే - అవసరమైతే ఉన్నత చదువులు చదువుకోవచ్చు లేదా వాటికి సమానమైన వృత్తి విద్యలూ నేర్చుకోవచ్చు.


**పాఠశాలల నిర్వహణ :**

స్కూళ్ళకు కొన్ని గైడ్‌లైన్స్ మాత్రమే ప్రభుత్వం ఇస్తుంది. స్థానిక పరిస్థితులకనుగుణంగా బోధనా పద్ధతులు, బోధనా విషయాలు నిర్ణయించుకోవడంలో దేనికదే స్వతంత్రంగా వ్యవహరిస్తుంది. గ్రామ, మున్సిపాల్టీవంటి స్థానిక సంస్థలదే స్కూల్స్ నిర్వహణా బాధ్యత. ఒక పాఠశాలలో 600మందికి మించి ఉండరు. పిల్లలు ఏ స్కూలుకు దగ్గరగా ఉంటారో ఆ స్కూల్లో చేరాలి. అవసరమైన వారికి ప్రయాణ సౌకర్యం కూడా ఉచితంగా కల్పిస్తారు. ప్రతి స్కూల్లో ఒక డాక్టరు వుంటారు.

పిల్లల సమగ్ర వికాసానికి మూలమైన విద్య వల్లనే ఆ దేశంలో మంచి పౌర సమాజం ఏర్పడింది. వారి ఇళ్ళు, బట్టలు, అలంకరణలు ఏవీ అడంబరంగా ఉండవు. అంతా సింపుల్. వారు విలువ ఇచ్చేది వ్యక్తిత్వానికి, జ్ఞానానికి. ఇందువల్ల ఆ సమాజంలో ప్రశాంతత కూడా ఎక్కువే. అలాంటి విద్యా విధానం మనకూ రావాలని కోరుకుందాం.

# ప్రత్యామ్నాయ విద్యా విధానం

## (తమిళనాడు విద్యా హక్కుల పరిరక్షణ సంస్థ ప్రతిపాదనలు)



**సిహెచ్.శ్రీహరి**
ఐక్యఉపాధ్యాయ
సంపాదకవర్గ సభ్యులు

ఇవాళ దేశవ్యాప్తంగా మేధావులు, విద్యావేత్తలు టిఎస్ఆర్ సుబ్రహ్మణ్యం కమిటీ నూతన విద్యా విధానం ప్రతిపాదనలు దాని పర్యవసానాలు, ప్రత్యామ్నాయాలపై చర్చలు జరుపుతున్నారు. దీనికిముందు 1986లో నూతన విద్యా విధానం (ఎన్‌పిఇ) వచ్చింది. ఎన్‌పిఇ-86 విద్యను పొందడంలో అంతరాలు తొలగిపోవాలని, అందరికీ సమాన విద్యావకాశాలు వుండాలని వర్ణించింది. వయోజన విద్య, ఎస్‌సిలనుండి ఎక్కువమందిని టీచర్లుగా తీసుకోవడం, తమ పిల్లల్ని క్రమం తప్పకుండా బడికి పంపడానికి పేదలకు ప్రోత్సహకాలు, స్కాలర్‌షిప్‌లు లాంటివి ప్రతిపాదించింది. ప్రాథమిక తరగతుల్లో విద్యార్థి కేంద్రిత బోధన వుండాలని, ఆపరేషన్ బ్లాక్ బోర్డు పథకంతో దేశవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్ని అభివృద్ధి చేయాలనింది. ఓపెన్ యూని వర్శిటీ వ్యవస్థను ప్రతిపాదించింది. వీటిలో కొన్ని జరిగినట్లుగా కన్పిస్తున్నా జరగాల్సినంత జరగలేదని మనకు అర్థమౌతూనే వుంది. ఎన్‌పిఇ-1986ను 1992లో ప్రపంచబ్యాంక్ దర్శకత్వంలో జరుగుతున్న నూతన ఆర్థిక విధానాల ప్రయోజనాల కోణంలో సవరించారు. అందరికీ విద్య-2000 అనే పిలుపును ఈ సవరించిన విద్యా విధానం ఇచ్చింది. అంతేకాకుండా నిర్బంధ విద్యను 8 సం॥ల కాలం (ప్రాథమికోన్నత) నుండి 5 సం॥ల కాలానికి (ప్రాథమిక) తగ్గించింది. ప్రైవేట్ విద్యా విస్తరణ కూడా ఇక్కడనుండే ఊపందు కొంది. మోహిన్‌జైన్ వర్సెస్ కర్నాట ప్రభుత్వం, ఉన్ని కృష్ణన్ వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీర్పుల నేపథ్యంలో 14 సం॥ల ఉచిత నిర్బంధ విద్యను ఆమోదిస్తూ ఆర్‌టిఇ చట్టం-2005 రూపొందించింది. ఇది 2010 ఏప్రిల్ నుండి అమలు చేయబడుతోంది.



ఈ పూర్వరంగంలో, అంతర్జాతీయ ద్రవ్యనిధి ఆధిపత్యం రాజ్యమేలుతున్న కాలంలో, ప్రజా సంక్షేమ కార్యక్రమాల నుండి ప్రభుత్వం వేగంగానే తప్పుకొంటున్న తరుణంలో ప్రస్తుత నూతన విద్యావిధానం రూపుదిద్దుకొంటోంది. పూర్తి పాఠం రాకపోయినా 43 పేజీల సారాంశాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. దీనిపై దేశవ్యాప్త చర్చ నడుస్తోంది. తమిళనాడులో ప్రాథమిక ఉపాధ్యాయ సంఘాల దగ్గరనుండి యూనివర్శిటీ అధ్యాపకుల సంఘాల వరకు తమిళనాడు సైన్స్ ఫోరం, విద్యార్థి సంఘాలతో కలిసి 40 సంఘాలు 'ఫెడరేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ ఎడ్యుకేషన్ రైట్స్' పేరుతో ఒక ప్రత్యామ్నాయ విధానాన్ని 61 పేజీల బుక్‌లెట్‌గా ప్రకటించారు. దీనికి సిటిజన్స్ చార్టర్ ఫర్ ఎన్ ఆల్టర్‌నేటివ్ పాలీసీ ఆన్ ఎడ్యుయేషన్ అని పేరు పెట్టారు. మాజీ వైస్ చాన్సలర్ వి.వసంతదేవి చైర్మెన్‌గా 18మందితో కమిటీ ఏర్పర్చి "ఈ ప్రతిపాదనలు పరిగణలోకి తీసుకొండి. విద్యారంగ సంక్షోభం నుండి దేశాన్ని గట్టెక్కించండి" అంటూ చర్చకు పెట్టారు. వైస్ చాన్సలర్ వి.వసంతదేవి సారాంశంగా ఇలా రాశారు.

"గొప్ప ఆలోచనాపరులు ప్రచారం చేసిన మానవత్వం, సమానత్వంలాంటి ఆదర్శాలను వదిలేసి వాటికి దూరంగా విద్యా వ్యవస్థ నడుస్తున్న కాలంలో మనం వున్నాం. బానిసత్వం, పరాయీకరణ, అమానీయ, వ్యాపారీకరణ, అసమానతల వైపుకు మన దేశ విద్యావ్యవస్థ నడుస్తోంది. విద్య యొక్క లక్ష్యం మానవీకరణతో మానవ జాతిని జ్ఞానం, చైతన్యం, స్వేచ్ఛ మరియు సామాజిక బాధ్యతల అత్యున్నత దశలకు నడిపించడం. కానీ జ్ఞానానికి ప్రాధాన్యత ఇస్తూ మిగిలిన మూడింటికి (చైతన్యం, స్వేచ్ఛ, సామాజిక బాధ్యత) వది లేస్తున్నాం. విద్యను మొత్తం గాను, అసలైన అర్థంలోనూ చూడకపోతే, మనం మానవ విలువల్ని, న్యాయాన్ని చివరకు అభివృద్ధి ప్రపంచాన్ని సృష్టించలేము.

విద్యని ఇలా నిర్వచించు కొంటే ఇది మనకు సుదూర లక్ష్యంగా వున్నట్లు కనిపిస్తోంది. విద్యకు గతంలో ఎప్పుడూ ప్రతి యొక్క మానవుని చైతన్యాన్ని ముందుకు తీసుకెళ్ళిన చరిత్రలేదు. ఇది చరిత్రలో ఎప్పుడూ వివక్షతకు, నిరాకరించుటకు, ఆధిపత్యం వహించు టకు ఒక వర్గానికి ఆయుధంగా వుండింది. ఈ ఆధిపత్యానికి కుల, పితృస్వామిక వ్యవస్థల ఇనుపచట్రం రక్షణ కవచంగా నిలిచింది. ఇప్పటికీ అధిక సంఖ్యాకులకు సమానమైన, సాధికారికమైన జ్ఞానం అందించక పోవడం జరుగుతోంది. విద్య విషయంలో కూడా కొందర్ని తొలగించటానికి, జ్ఞానం ఒక గహ్వరమైనదిగా చూపడానికి, అశేష ప్రజానీకాన్ని అసమాన వ్యవస్థను అంగీకరించడానికి అనువుగా రూపొందించబడింది. తళతళలాడే పిల్లల కన్నులు ముక్కలుగా వున్న వాస్తవాన్ని మాత్రమే చూడగలవు. భయానక పేదరికాన్ని, మనసులేని దోపిడీని, వివక్షతను చూడలేని జ్ఞానం పాక్షికమైంది మాత్రమే.

**తొలగింపు విద్యను అభివృద్ధిచేసిన భారత్ :**

కులంలో వున్న అంతస్థులు మన విద్యలో కూడా కొన సాగుతున్నాయి. అనేక దేశాల్లో అన్ని వర్గాల పిల్లలందరూ సమీపంలోవున్న పబ్లిక్ స్కూల్‌కు వెళతారు. అక్కడ స్కూలు అస మానతల్ని, అవరోధాల్ని దరికి రానీయని ప్రదేశం. మన దేశంలో అలా లేదు. మన పాఠ్యప్రణాళికలు, బోధనా పద్ధతులు, పరీక్షా విధానాలు, అసంఖ్యాక పిల్లల్ని తొలగించే యంత్రాలుగా వున్నాయి. గ్రామీణ కష్టజీవుల పిల్లల నిజజీవితానికి, వారి సంస్కృతికి సంబంధం లేనిదిగా విద్యా విషయం వుంటుంది. కొన్ని సంవత్సరాల అందుకోలేని స్థితి తరువాత పెద్ద సంఖ్యలో డ్రాప్ అవుట్‌గా ఈ పిల్లలు మారతారు. కష్టజీవుల పిల్లల ప్రపంచానికి స్థానం లేకపోవడం భారత విద్య వ్యవస్థలో ఒక విషాదం. క్లాస్ రూం భాష కూడా ఒక దళిత, స్లమ్ ప్రాంతం నుండి వచ్చిన పిల్లవాడు భయపడిపోవడానికి, తిన్నగా తనలోకి తాను ముడు చుకొని నిశబ్ధంగా వుండిపోవడానికి చివరకు తొలగింప బడడానికి వాహకంగా వుంది. ఇంగ్లీషు మరింతగా ఇటువంటి పిల్లల్ని బడి నుండి తొలగిస్తుంది. ఇప్పుడు దేశం ఇంగ్లీషులో చదువుకొనే వారు, మాతృభాషలో చదువుకొనే వారు అనే రెండు లోకాలుగా విభజితమైవుంది.

**స్వాతంత్ర్యనంతర కాలంలో విద్య :**

స్వాతంత్ర పోరాటం, దాని ఆశలు, ఆదర్శాలు చుట్టూ ఆవరించివున్న కాలంలో జాతి నిర్మాణానికి అనువుగా ప్రణాళికలు, కలలు వుండేవి. అప్పట్లో అన్ని స్కూళ్ళూ ధనవంతులు మరియు పేదవారి పిల్లలు కలిసిమెలిసి చదువుకొనే 'నైబర్‌హుడ్ స్కూల్స్'గా వుండేవి. ఇందులోంచి వచ్చిన పిల్లలు ధనిక, పేదా తేడాలేకుండా సామాజిక, రాజకీయ, ఆర్థిక, శాస్త్ర రంగాలలో మంచి స్థానం సంపాదించారు. కొద్దొగొప్పో రూపంలో కామన్ స్కూల్ వ్యవస్థ వుండేది.


**సంస్కరణల కాలంలో విద్య :**

స్కూళ్ళకు ఫండ్స్ కేటాయింపు తగ్గిపోవడం, వసతులలేమి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోవడంతో ప్రమాణాలు పడిపోయాయి. ప్రభుత్వ స్కూళ్ళ వ్యవస్థ బలహీనపడింది. దాంతో వివిధ రకాల స్కూళ్ళు పుట్టుకొచ్చాయి. ఫీజులు వసూలు చేసే స్కూళ్ళు 70ల్లో ప్రారంభమై 90ల నాటికి అనేక రూపాలుగా జడలు విచ్చుకొన్నాయి. ఉన్నత వర్గాలు ప్రైవేట్ స్కూళ్ళ వైపుకు వెళ్ళడం మొదలైంది. నయా ఉదారవాదం ప్రారంభంలో విద్యలో పోటీ ప్రవేశించి విశ్వరూపం ధరించింది. పిల్లలు పోటీ మధ్య కరుణలేని ప్రపంచంలో చిక్కుకుపోయారు కుక్కలమధ్య చిక్కు కున్న పిల్లలాడిలా. పుట్టినప్పటి నుండి పోటీపడానికి, గెలవడానికి తయారు చేయబడుచున్నారు. ప్రపంచ బడా కార్పొరేట్ వర్గాల ప్రయోజనలే "ఏది జ్ఞానం"మో నిర్వచిస్తున్నాయి. దానికనుగుణం గా మన విద్యా వ్యవస్థలు తమ కోర్సులు, బోధనలు మార్పు చేసుకొంటున్నాయి. జ్ఞాన రంగంలో ఇదొక పెనుమార్పు.

**డిమాండ్స్:**

1. అత్యున్నత ప్రమాణాలుగల విద్య 18 ఏళ్ళవరకు కామన్ స్కూల్ ద్వారా అందించాలి. 8వ తరగతి వరకు నడిచి వెళ్ళేంత దగ్గరలో బడి వుండాలి. వాహనం ద్వారా స్కూళ్ళకు తరలిం చడం నిషేధించాలి. 3,6 సంIIల పిల్లలకు నాణ్యమైన బాల్యారంభ విద్య అందించాలి. ఏ రకమైన పనిలో (కుటుంబం నడిపే పనిలో సైతం) పిల్లల్ని ఉపయోగించకూడదు. అన్ని స్థాయిల వరకూ (ఉన్నత విద్య వరకూ) ఉచిత విద్య అందించాలి. ఫీజు వసూలు చేసే స్కూళ్ళకు అనుమతులు ఇవ్వకూడదు.
2. జిడిపిలో 6% విద్యకు కేటాయించాలి. అంతర్జాతీయ స్థాయి స్కూళ్ళను ఏర్పాటు చేయాలి. ఒక క్లాసుకు ఒక టీచరు (ఒక్క విద్యార్థి వున్నా) ఏర్పాటు చేయాలి. అలాగే ఆర్ట్స్, వ్యాయామ విద్య, సామాజిక పని, ఎన్ఎస్ఎస్‌లకు టీచర్లను అదనంగా నియమించాలి. విద్యా సంవత్సరంలో 1100 గంటల బోధన విద్యార్థికి అందించాలి.
3. మాతృభాషే బోధనా మాధ్యమంగా వుండాలి. ఇంగ్లీషు ఆధిపత్యం నివారించాలి. ఇంగ్లీషు మీడియంను ఏ స్కూల్లో అనుమతించరాదు. 12వ తరగతి వరకు మాతృభాషలోనే బోధన వుండాలి. ఇంగ్లీషును రెండవ భాషగా సమర్ధవంతంగా నేర్పించాలి.
4. సోషలిజం, సెక్యులరిజం, సామాజిక న్యాయం అనేవి పాఠ్య ప్రణాళికల, సిలబస్, బోధనా పద్ధతుల, స్కూలు నిర్వహణ లలో ముఖ్య నియమాలుగా అమలు చేయాలి. నైపుణ్యాల అభివృద్ధి, ఉత్పత్తి ఆధారిత విద్య మాత్రమే విద్యా లక్ష్యాలుగా వుండకూడదు. విద్యా సంస్థలు సమాజంలో భాగంగా వుండాలి. ఎల్‌కెజి నుండి 12వ తరగతి వరకూ వుండే విధంగా ప్రతి స్కూలు వుండాలి. హోంవర్క్ వుండకూడదు. ట్యూషన్లు నిషేధించాలి. అన్ని స్కూళ్ళలో లైబ్రరీ, ఐటి వుండాలి.
5. భారతీయ విద్యావ్యవస్థలో పరీక్షలదే ఆధిపత్యం. అదే లక్ష్యం ప్రపంచం. 10, 12 పబ్లిక్ పరీక్షలు రద్దుచేయాలి. ఓపెన్ బుక్ పరీక్షలు ప్రోత్సహించాలి. డిటెన్షన్ ఉండకూడదు. దేశ వ్యాప్తంగా ఒకే మూల్యాంకన వ్యవస్థ వుండకూడదు.
6. విద్యలో ఏ స్థాయిలోనైనా అధికార, కేంద్రీకృత వ్యవస్థ వుండ కూడదు. విద్యను కాంకరెంట్ లిస్టు నుండి స్టేట్ లిస్టుకు తిరిగి తేవాలి. విద్యార్థి సంఘాల్ని అనుమతించాలి.
7. అన్ని వసతులు గల్గిన హాస్టళ్ళు, అందులో టీచర్లు కాపురం వుండే విధంగా ఏర్పరచాలి. ఎస్‌సి, ఎస్‌టి పిల్లలకు స్కాలర్ షిప్‌లు ఇవ్వాలి. మధ్యాహ్న భోజనం 12వ క్లాసు వరకు అందించాలి.
8. నాణ్యమైన ఉన్నత విద్య డబ్బులేనివారికి కూడా అందే విధంగా వుండాలి. రీసెర్చ్ కోసం నిధులు సంవృద్ధిగా కేటాయించాలి. ఓపెన్ యూనివర్శిటీలు నాణ్యమైన విద్యనందించేవిగా మార్చాలి.

# మౌలిక వసతుల అభివృద్ధి – వర్గ కోణం



ప్రభాత్ పట్నాయక్

రేవులు, రోడ్లు, కాలువలు, వంతెనలు, రైలు మార్గాం నిర్మాణంలాంటి వన్నీ మౌలిక వసతుల కిందకు వస్తాయి. అనేక విషయాలు 'మౌలిక సదుపాయాల' కిందకు రావడం, వాటిలో అనేకం అన్ని పరిస్థితుల్లోనూ ప్రజలకు ఉప యోపడే విగా కనబడతాయి. ఈ 'మౌలిక వసతుల' రంగాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున వనరులను కేటాయించినప్పుడుగానీ లేక ప్రభుత్వరంగ బ్యాంకులను ఈ రంగానికి పెద్ద మొత్తంలో అప్పులు ఇవ్వమని ఆదేశించినప్పుడుగానీ చాలా వరకు ప్రశ్నించటం అనేది ఉండదు.

**మౌలిక వసతుల భావనకు వర్గకోణం ఉంది :**

అయితే ఈ విధంగా 'మౌలిక వసతుల'ను చూడటం పూర్తిగా తప్పుదోవ పట్టించడమే. **అభివృద్ధికి చేపట్టే దిశనుబట్టి 'మౌలిక వసతుల' కిందకువచ్చే విషయాలు మారతాయి. భారత దేశంలో 'ఆర్థిక సరళీకరణ' జరగటానికి ముందున్న సంక్షేమ ప్రభుత్వాలు దృష్టి సారించిన అభివృద్ధి మార్గానికీ, నేటి నయా ఉదారవాద ప్రభుత్వం దృష్టిసారిస్తున్న అభివృద్ధి మార్గానికీ తేడా ఉన్నది. అభివృద్ధి సాగుతున్న మార్గాన్ని వదిలి 'మౌలిక వసతుల'ను అర్థం చేసుకోవటం సాధ్యపడదు.** అంటే ఒక అభివద్ధి మార్గానికి సంబంధించిన మౌలిక వసతుల అభివృద్ధిపై చేసే వ్యయాన్ని గుడ్డిగా ఆమోదించటం కుదరదు. వేరే విధంగా చెప్పాలంటే ఒక అభివృద్ధి మార్గాన్ని అనుసరించి ప్రత్యేకంగా ఒక మౌలిక వసతుల భావన ఏర్పడుతుంది. ఏ అభివృద్ధి మార్గమైనా వర్గ బలాబాలాల సమతూకాన్ని బట్టి నిర్ధారింపబడుతుంది. ఆ విధంగా మౌలిక వసతుల భావనకు వర్గ కోణం ఉంటుంది. ఈ విషయం గురించి కార్ల్ మార్క్సుకు స్పష్టమైన అవగాహన ఉన్నది. బ్రిటీష్ పాలనలో భారతదేశంలో రైలు మార్గాలను నిర్మించటాన్ని ప్రస్తావిస్తూ అవి భారతీయులకు 'నిరుపయోగం' అని ఆయన చెప్పినప్పుడు ఆయన ఉద్దేశం భారతీయులు రైళ్ళను ఎన్నడూ ఉపయోగించరని కాదు. బ్రిటీష్ వలస పాలకులు భారత ఆర్థిక వ్యవస్థను దోపిడీ చేయటమనే తమ ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని వనరులను ఉపయోగించారే తప్ప భారతీయుల ప్రయోజనాలను పట్టించుకుని కాదు. క్లుప్తంగా చెప్పాలంటే అభివృద్ధి విక్షేపమార్గ చట్రంలో మార్క్సు మౌలిక వసతులను బిగించాడు. రైలు మార్గాలను నిర్మించటమనే వాస్తవం వెనుక భారతీయులకు ఉపయోగ పడాలనే దయార్ధ హృదయం లేదు. దానిలో బ్రిటీష్ ప్రయోజనాలే దాగున్నాయనే నగ్న సత్యాన్ని ఆయన బయటపెట్టారు.

మొగల్ సామ్రాజ్యంలో మౌలిక వసతులు అంటే రోడ్ల నిర్మాణం, ఎడ్లబండ్లు నడిచే మార్గాలు, ధాన్యాన్ని మార్కెట్ చేసే చిన్న పట్టణాలను అభివృద్ధి చేయటంగా ఉన్నది. బ్రిటీష్ పాలనలో భారతదేశంతో ఇంగ్లండ్‌కు గణనీయమైన వ్యాపార సంబంధాలు ఏర్పడ్డాయి. భారత దేశం ఇంగ్లండ్ వస్తువులకు మార్కెట్‌ను, పరిశ్రమలకు ముడి సరుకులను అందించింది. అందుకోసం గ్రామీణ ప్రాంతాలనుంచి సదరు సరుకుల ను చేరవేయటానికి ఓడ రేవులను, రవాణా సౌకర్యాలను అభివృద్ధి చేయటానికి ప్రాధాన్యత ఏర్పడింది. గతంలో ప్రపంచవ్యాప్తంగా కీర్తి గడించిన ఆగ్రా వంటి పాత నగరాలకు ప్రాధాన్యత తగ్గింది. క్లుప్తంగా చెప్పాలంటే మౌలిక వసతుల భావన ఒక నూతన భావాన్ని సంతరించు కున్నది. రైలు మార్గాలను ప్రైవేట్ కంపెనీలు నిర్మిస్తున్నాయి. వలస దోపిడీ అవసరాలను తీర్చేందుకు పెట్టే పెట్టుబడులపై ఆశించే లాభాల రేటుకు ప్రభుత్వం బడ్జెట్ ద్వారా పూచీ ఉంటుంది. దేశంలో రైలు మార్గాలను నిర్మించటానికి ప్రధాన కారణం ముడి సరుకులను రవాణా చేయటమేనని కేంబ్రిడ్జ్ ఆర్థిక చరిత్రకారుడు మెక్‌ఫర్సన్ వాదించాడు. ఈ సందర్భాన్ని దృష్టిలో ఉంచుకుని భారతదేశంలో రైలు మార్గాలు భారతీయులకు 'పనికిరావు' అని మార్క్సు చేసిన వ్యాఖ్యను అర్థం చేసుకోవలసి ఉంటుంది.

దేశంలో శ్రేయోరాజ్య విధానాన్ని అవలంభించిన కాలంలో విమానాశ్రయాలు ఏ మాత్రం బాగుండేవి కావని, ప్రస్తుతం నిర్మిస్తున్నవి చాలా అందంగా ఉంటున్నాయనీ, ఆ విధంగా అవి 'అభివృద్ధి'కి చిహ్నాలుగా ఉన్నాయని పలువురు పరిశీలకులు పోల్చుతుంటారు. అయితే నయా ఉదారవాద పాలనలో అభివృద్ధి సాగే మార్గం ఆదాయ అసమానతలను పెంచిపోషించేదిగా ఉండటం వల్ల విమానాశ్రయాల లో విపరీతమైన రద్దీ ఏర్పడుతున్నదనీ, దాన్ని అధిగమించేందుకు విమానాశ్రయాల రూపంలో 'మౌలిక వసతుల'లో పెట్టుబడుల అవసరం ఉంటుందనే విషయాన్ని వీరు విస్మరిస్తున్నారు. అలాగే స్వేచ్ఛగా పెట్టుబడులు ప్రవహించే ప్రస్తుత పాలనలో దేశంలోకి విదేశీ వ్యాపారవేత్తలు వస్తుండటంతో వారిని సంతృప్తి పరచాలి. దానిలో భాగంగా నయా ఉదారవాదులు అత్యవసరమని భావించే విదేశీ పెట్టుబడులను ఆకర్షించటానికి విమానాశ్రయాలను అభివృద్ధి చెందిన దేశాల్లో మాదిరిగా నిర్మించవలసి ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా విమానాశ్రయాలన్నీ పెద్ద తేడా లేకుండా ఉచ్ఛ స్థాయిలో ఉండట మనేది ప్రపంచీకరణ ప్రక్రియకు అవసరం. అందుకనుగుణంగానే ఢిల్లీ విమానాశ్రయంలో స్పష్టమైన ఆంగ్ల ఉచ్చారణతో ప్రకటనలు చేస్తుంటారు. ఈ క్రమంలో ఉదయపూర్ వంటి భారతీయ నగరాలను ఘోరంగా 'యుదైపోర్' అని

సంబోధిస్తుంటారు. దీనికంతకూ కారణం ప్రస్తుత ప్రపంచీకరణకు చెందిన ప్రత్యేక స్వభావమే. దీనికి చాలా ముఖ్యమైన అంతస్సూచన ఉన్నది. నయా ఉదారవాద ప్రపంచీకరణలో ఆదాయ పంపిణీ కష్టజీవుల నుంచి కార్పొరేట్–ఫైనాన్షియల్ వర్గానికి బదిలీ అవుతున్నది. మధ్య తరగతిలోని ఒక విభాగం కూడా ప్రపంచీకరణతో లాభపడుతున్నది. ఇలా లాభపడుతున్న వారికి ఉపయోగపడే ఒక ప్రత్యేక రకమైన 'మౌలిక వసతుల'కు నిరంతరం కావలసిన దానికంటే ఎక్కువ డిమాండ్ ఉన్నది. అయితే సంక్షోభ కాలంలో ఇది ఉండదు. దీన్ని గురించి తరువాత వివరిస్తాను. కాబట్టి సంక్షోభ కాలాలను పక్కనబెట్టి చూచినప్పుడు మనకు కనబడేదేమంటే ఆదాయ అసమానతలు పెరగటం వల్ల ధనవంతుల వద్దకు మరింత సంపద చేరుతుంది. దానితో విమానాల్లో పయనించేవారి సంఖ్య పెరిగి నూతన విమానాశ్రయాలు కూడా సరిపోని పరిస్థితి ఏర్పడుతుంది. నూతనంగా నిర్మించిన రోడ్లు కూడా సరిపోవు. ఎందుకంటే ఆదాయ అసమానతలు పెరగటం వల్ల చాలామంది ధనికులు ఎక్కువ సంఖ్యలో కార్లు కొంటారు. కాబట్టి పెరుగుతున్న అసమానత వల్ల ధనికులకు ఉపయోగ పడే మౌలిక వసతులపై ఒత్తిడి పెరుగుతుంది. తత్ఫలితంగా ధనికులు డిమాండ్ చేసే 'మౌలిక వసతుల'ను ఇతర ఉపయోగాలకు దూరం చేస్తుంది. అది వనరులను ఎంతగా కబళించినప్పటికీ వారికి ఉపయోగ పడే 'మౌలిక వసతుల'లో కొరత అలానే కొనసాగుతుంది.

సంక్షోభ కాలాల్లో దీనికి పూర్తి విరుద్ధంగా జరగటం వల్ల ఈ కొరత మాయమౌతుందనటంలో సందేహంలేదు. మౌలిక వసతులకు చెందిన అనేక సౌకర్యాలు డిమాండ్ లేనందున నిరుపయోగంగా పడి వుంటాయి. బూమ్ కొనసాగుతుందనే ఆలోచనతో కట్టే భవనాలు ఖాళీగా ఉండిపోతాయి. కార్యాలయాల కోసం కట్టిన భవనాలు, అపార్ట్‌మెంట్లు నిరుపయోగంగా ఉంటాయి. మనుషులులేని పట్టణాలు, కార్లు తిరగని రోడ్లు బూమ్ అస్థిర స్వభావాన్ని చాటుతాయి. అయితే సంక్షోభ కాలంలో మౌలిక వసతులకు డిమాండ్ అధికంగాలేని స్థితిలో కూడా మౌలిక వసతుల పునరుద్ధరణ జరుగుతూ ఉంటుంది. దీనికి కారణం దేశీయ ధనికులు అభివృద్ధి చెందిన దేశాల్లోని ధనికులను అనుకరించాలని కోరుకోవటమే. ఈ దేశాలలో ఉత్పత్తుల నవీరీనీకరణ జరుగుతున్న తీరుకు అనుగుణంగా విదేశీ, స్వదేశీ ధనికుల జీవన శైలి కూడా మారుతుంటుంది. ఇది సరుకుల విషయంలోనేకాక మౌలిక వసతుల విషయంలో కూడా నిజం. కాబట్టి ఉత్పాదక సామర్థ్యం నిరుపయోగంగా ఉన్న స్థితిలో కూడా వస్తువుల తయారీ, విమానాశ్రయాల వంటి మౌలిక వసతులలో నిత్యనూతనంగా కనబడటానికి అదనపు పెట్టుబడులు అవసరమౌతాయి. పాత విమానాశ్రయాలను పూర్తిగా వినియోగించు కోని పరిస్థితుల్లో కూడా సరికొత్త ఉపకరణాలతో నూతన విమానాశ్ర యాలను నిర్మిస్తారు. ఆర్థిక వ్యవస్థను సంక్షోభం నుంచి గట్టెక్కించటానికి అలాంటి అదనపు పెట్టుబడి ఎన్నటికీ సరిపోదు.

**నియంత్రణ ఆవశ్యకత :**

**ఆరోగ్యం, విద్యకు నిధుల కేటాయింపులను పెంచలేక పోవటానికి, ఉపాధి హామీ పథకం వంటి కార్యక్రమాలపై కావలసినంతగా ఖర్చు చేయలేకపోవటానికి, వృద్ధాప్య పింఛన్లకు నిధులు అందించలేక పోవటానికి మౌలిక వసతులపై వ్యయం చెయ్యవలసిన అవసరం ఉండటమే కారణమని చెబుతారు. దేశంలో విమానాశ్రయాలు కట్టటానికి వనరులుంటాయిగానీ వృద్ధాప్య పింఛన్లకు, పాఠశాల విద్యకు ఉండకపోవటమనే వాస్తవం నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థకు చెందిన అభివృద్ధి మార్గస్వభావాన్ని సూచిస్తున్నది.** అయితే ఈ అభివృద్ధి మార్గాన్ని విమర్శించటం, అది మారేదాకా వేచివుండటం, కేటాయింపులు విమానాశ్రయాలకు చెయ్యాలా లేక మంచి ప్రభుత్వ పాఠశాలలు నిర్మించటానికి చెయ్యాలా అనేదాని ఆధారంగా సమతను సాధించే దిశగా ఆదాయ పునఃపంపిణీ ఉండాలని డిమాండ్ చేయటంగా దీన్ని అర్థం చేసుకోకూడదు. అంతిమంగా ఇదంతా ఆదాయ పంపిణీపై ఆధారపడి ఉంటుంది. అంటే ఆదాయ పంపిణీ గిరాకీని నిర్ధారిస్తుం దనే నమూనా ఆధారంగా వనరుల కేటాయింపు ఉంటుంది. సరిగ్గా ఇక్కడే జోక్యం చేసుకోవాలి. 'మౌలిక వసతుల' పెట్టుబడిగా చేసిన వ్యయం ప్రజల దృక్కోణం నుంచి చూసినప్పుడు 'పనికి మాలింది' అని కార్ల్‌మార్క్స్‌లాగా మనం కూడా చెప్పాలి. అలాంటి పెట్టుబడిని అడ్డుకోవాలి. చర్చిస్తున్న 'మౌలిక వసతుల'ను నియంత్రించాలి. ఎక్కడ నియంత్రణను అమలు చేయాలనే విషయాన్ని సరైన రీతిలో ఎంచుకోవాలి. ఉదాహరణకు రద్దీగా రోడ్లు ఉండటం ఒక విధమైన నియంత్రణే. కార్ల సంఖ్యను బట్టి రోడ్డు రద్దీగా ఉంటుంది. రద్దీ ఎక్కువైనప్పుడు ప్రతి కారూ నెమ్మదిగా వెళ్ళవలసి ఉంటుంది. అయితే నియంత్రణ ట్రాఫిక్ జాంల రూపాన్ని తీసుకోవటానికి బదులుగా రోడ్ల మీద తిరిగే కార్ల సంఖ్యను పరిమితం చేసేదిగా ఉండాలి. ప్రతి కారులో కనీసం ఇంత సంఖ్యలో ప్రయాణం చేయాలనే నిబంధనను అమలు చేయటం ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు.

భారత దేశంలో లేనప్పటికీ తృతీయ ప్రపంచ దేశాలతోసహా చాలా దేశాలలో ఈ విధమైన నియంత్రణ అమలులో ఉన్నది. అయితే నియంత్రణ ఉండాలని గట్టిగా కోరటం కూడా ఒక విధంగా ఆదాయ పంపకం విషయంలో జోక్యం చేసుకోవటమే. ఆహార ధాన్యాలను తక్కువ ధరకు రేషన్ ఇచ్చినట్టుగానే సమానత్వ దిశగా ఆదాయ పంప కంలో జోక్యం చేసుకోవటం కూడా ఒక మార్గం. ఆ విధంగా సామా జికంగా అత్యవసరమైన ఇతర అవసరాలను అందించే బదులు ధనికులు తమకు కావలసిన 'మౌలిక వసతుల' కోసం వనరుల కేటాయింపుకు డిమాండ్ చేస్తారు. అయితే ఈ 'మౌలిక వసతుల' కల్పనకు రేషన్ ప్రకటించటం కూడా ఆదాయ పంపిణీలో ఒక విధంగా జోక్యం చేసుకోవటం అవుతుంది. 'మౌలిక వసతుల' కల్పనలో చేసే అన్ని రకాల పెట్టుబడులను విచక్షణారహితంగా సామాజిక ప్రాధమ్యం గలవిగా మనం భావించకుండా ఉండటం చాలా ముఖ్యం.

# టీచర్‌కు కంప్యూటర్ ప్రత్యామ్నాయం కాదు

- ఎడమ శ్రీనివాసరెడ్డి



విద్యా టెక్నాలజీ ఉపాధ్యాయుడి బోధనకు అదనపు పరికర మవుతుంది గాని, అది ఉపాధ్యాయుడి స్థానాన్ని పూరించలేదు. స్మార్ట్ క్లాస్‌రూమ్‌లకంటే స్మార్ట్ టీచర్లే ప్రధానం. టీచర్ల తయారీని గాలికి వదిలేసి స్మార్ట్ క్లాస్ రూమ్‌లను ఆశ్రయిస్తే ప్రయోజనం ఉండదు. గూగుల్ ఎప్పటికీ గురువుకంటే గొప్పదికాదు. సజీవంగా, క్రియాత్మకం గా ఉండే బోధన అభ్యసన ప్రక్రియలో యంత్రంతో చేయించాల్సిన పనులను యంత్రంతోనే చేయిస్తూ, మనిషి చేయాల్సిన పనులు మనిషి చేసినంత కాలం సమస్య లేదు. కాని తారుమారు అయినప్పుడే సంక్షోభం తలెత్తుతుంది.

కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధాన రూపకల్పనకు కసరత్తును గత సంవత్సరమే ప్రారంభించింది. ఈ ముసాయిదాపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్నది. గతంలో రూపొందించబడిన విద్యా విధానాలకు భిన్నంగా క్షేత్రస్థాయిలో దేశవ్యాప్తంగా సుమారు మూడు లక్షల సంప్రదింపులు జరిగాయి. కానీ ఆ సంప్రదింపు ల్లో పారదర్శకత లోపించిందనీ, ముసాయిదా దేశ విద్యారంగాన్ని ఇంకా బలహీన పరిచేదిగా ఉందని విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముసాయిదా, విద్యలో సమాచార, ప్రసార, సాంకేతికశాస్త్ర (ఐసీటీ) వినియోగం గురించి వెలువరించిన అభిప్రాయాలను విశ్లేషిం చడం ఈ వ్యాసం ఉద్దేశం.

సమాచార, ప్రసార, సాంకేతిక శాస్త్రాలను ప్రస్తావించకుండా 21వ శతాబ్దపు విద్య గురించి మాట్లాడలేం.

అన్నిరంగాలను ప్రభావితం చేసినట్లే విద్యా రంగాన్ని కూడా సమాచార, ప్రసార, సాంకేతిక శాస్త్రం ప్రభావితం చేస్తున్నది. అయితే విద్యలో సమాచార, ప్రసార, సాంకేతిక శాస్త్ర వినియోగం గురించి కమిటీ ప్రతిపాదనలు నిష్ణాతుల సిఫార్సుల మాదిరిగా గాక సాధారణ స్థాయి అవగాహనతోనే దర్శనమిస్తాయి. అన్నిస్థాయిల విద్యలో సమాచార, ప్రసార, సాం కేతిక శాస్త్ర వినియోగాన్ని పెంపొందిం చాలని, సెకండరీ, ఉన్నతస్థాయి విద్యలో ఆన్‌లైన్ కోర్సులను ప్రవేశపెట్టాలని, దీనిద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్య లభిస్తుందనే అపోహను ఈ ముసాయిదా కలిగిస్తున్నది. దీని వినియోగానికి ఉన్న పరిమితులను అర్థం చేసుకోకపోతే కలిగే పరిణామాల గురించి హెచ్చరికలు లేకపోగా దీనిపేరు మీద జరిగే విద్యా వ్యాపారాన్ని బలపరిచే విధంగా సిఫార్సులున్నాయి.

ప్రీ ప్రైమరీ స్థాయి నుంచే ముందే నిర్దేశించబడిన లక్ష్యాలకు అనుగుణంగా విద్యార్థుల చదువులకు మార్గదర్శకాన్ని ఇచ్చే విశ్లేషణ పద్ధతి ఇది. దీనిలో విద్యార్థికి ఆన్‌లైన్ విద్యా వ్యవస్థ సమకూర్చ బడుతుంది. దీనిద్వారా పిల్లలు నేర్చుకునే క్రమం లో పిల్లలకు కావలసిన వ్యక్తిగత విషయాన్ని సమకూరుస్తూ, వారిని అంచనా వేస్తుంటాయి. ఈ క్రమంలో పిల్లల అనుభవాలకు సంబంధించిన మొత్తం సమాచారానికి సంబంధించిన డాటా బేస్ తయారవుతుంది. దీన్ని ఉపయోగించి పిల్లల భవిష్యత్ సాధనకు సంబంధించిన అంచనాలు ఇవ్వబడుతాయి, దానికనుగుణంగా పిల్లలు నేర్చుకుంటా రు. ఈ విధానంలో సహజమైన టీచర్ స్టూడెంట్ సంబంధాలు బలహీనపరచ బడుతాయి. పిల్లలు అమానవీకరించబడుతారు.

దీనివల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ. డిజిటల్ వ్యాపారుల లాగానే సుబ్రమణ్యం కమిటీ కూడా ఈ బిగ్ డాటా విశ్లేషణ విధానా లను కీర్తిస్తున్నారు.సమాచార, ప్రసార, సాంకేతిక శాస్త్ర వినియోగం లో బహుళ జ్ఞానేంద్రియాల వినియోగం ఉంటుంది కాబట్టి విషయాలను బాగా గుర్తుంచుకోగలుగుతారు. అయితే నేర్చుకోవడం అంటే కేవలం విషయాన్ని గుర్తుంచుకోవడం,అర్థం చేసుకోవడమే కాదు, దాన్ని సరిగ్గా అన్వయించడం, సరైన వివేచనను తద్వారా సరైన విలువలను పొందడం జరగాలి. మొదటిరకం పనులకు (గుర్తుంచుకోవడం, అర్థం చేసుకోవడం) సమాచార, ప్రసార, సాంకేతిక శాస్త్ర వినియోగం బాగానే తోడ్పడుతుంది.

కాని రెండో రకం పనులకు వివేచన, విలువలు టీచర్ చాలా ప్రధానం. కాని మన విద్యావ్యవస్థ మొదటి పనుల కేంద్రం గానే నడుస్తున్నది కాబట్టి ఐసీటీ వినియోగానికి ప్రాముఖ్యం పెరిగింది. సమాచార, ప్రసార, సాంకేతిక శాస్త్ర వినియోగంతో బోధన జరుగుతున్నదని చెప్పుకోవడం నేడొక ప్రత్యేక ఆకర్షణ. అందుకనే డిజీ స్కూళ్ళు, ఈ టెక్నోస్కూళ్లు అని స్కూళ్ల పేర్ల ముందు ప్రిఫిక్సులు చేరాయి. టీచర్ల కంటే స్మార్ట్‌బోర్డ్‌లకు ప్రాధాన్యం పెరిగింది. ప్రపంచ వ్యాప్తంగా ఈ విద్యా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉన్నది. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ విద్యా సంవత్సరం నుంచి కొన్ని ప్రభుత్వ స్కూళ్లలో పైలట్ ప్రాజెక్టుగా స్మార్ట్ తరగతులను ప్రారంభించింది.

అయితే ఈ సమాచార, ప్రసార, సాంకేతిక శాస్త్ర వినియోగం ఏస్థాయిలో, ఏమేరకు ఉండాలి? దీనిని బోధన అభ్యసనలో ఏ మేరకు సమైక్య పరచాలి? ఇది టీచర్‌కు అదనపు సహాయకారి అవుతుందా? ప్రత్యామ్నాయం అవుతుందా? టీచర్ల తయారీని పట్టించుకోకుండా డిజిటల్ క్లాస్‌రూముల తయారీయే

ప్రాధాన్యమైనదా? అనే విషయాల చర్చ ముఖ్యమైనది. మన దేశానికే చెందిన ఇంగ్లాండ్‌లోని న్యూ కాజిల్ యూనివర్సిటీ ప్రొఫెసర్, సుగత మిత్ర చేసిన ప్రయోగాలు కూడా ఈ సందర్భంగా తెలుసుకోదగినవి. సుగత మిత్ర 1999 నుంచి కంప్యూటర్ల వినియోగం, ఇంటర్నెట్ ద్వారా పిల్లలు ఎలా నేర్చుకుంటారన్న విషయాలపై పరిశోధనలు చేశారు. ఈయన ఇన్‌స్ట్రక్టర్ లేకుండానే స్వయం అభ్యసన ద్వారానే పిల్లలు ఇంటర్నెట్‌ను వాడటం నేర్చు కున్నారని, వారి పదజాలం కూడా పెరిగిన విషయం పరిశీలించాడు. దీన్నే 'స్వీయ వ్యవస్థీ కృత అభ్యసన పరిసరం' అన్నాడు.



స్వయం అధ్యయన కేంద్రాలను సుగత మిత్ర మనదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో ఏర్పాటు చేశాడు. ఇది స్వయం నిర్దేశిత అధ్యయనం. సహకార భావనతో జ్ఞానాన్ని నిర్మించుకునే విధానానికి ఆధారం. అయితే ఈ విధానానికి కూడా పరిమితులున్నాయని విమర్శకులు చెబుతున్నారు. అన్ని విషయాలను ఈ విధానంలో నేర్చుకోలేకపోవడం, విస్తృత పరిమాణంలోని సమాచారం నుంచి కావాల్సిన సమాచారాన్ని ఎంపిక చేసుకోవడానికి మార్గ దర్శకత్వం లోపించడం, నేర్చుకోవడం ఎలాగో నేర్చుకోవడం టీచర్ సమక్షంలోనే జరుగుతుందనే ముఖ్యమైన అంశం ఈ విధానంలో లోపిస్తుంది. విద్యార్థులపై సరైన నియంత్రణ లేకపోవడం, అవసరమైన సమాచారాన్ని మాత్రమే పొందే ప్రావీణ్యాన్ని పొందలేకపోవడం, పొందిన సమాచారం విశ్వసనీయతను అంచనావేసే నైపుణ్యాలను ఇవ్వదు. సమాచారం అందుబాటులో ఉన్నంత మాత్రాన సరిపోదు, దానిని సరైన రీతిలో వ్యవస్థీకృతం చేయడంలో టీచర్ పాత్ర ప్రధానమైనది. అందుకనే ఆన్‌లైన్ కోర్సుల ద్వారా అభ్యసించే వారిలో వైఫల్యాలు ఎక్కువ ఉంటాయని నిపుణులు అంటున్నారు.

కాబట్టి ఐసీటీ విధానం, స్మార్ట్ తరగతి గదులు టీచర్‌కు ప్రత్యామ్నా యం ఎప్పటికీ కాదు. ఇవి విద్యార్థికి కావలసిన సమాచారాన్ని మాత్రమే ఇస్తాయి. ఆ సమాచారాన్ని సమన్వయపరిచి సరైన జ్ఞానా న్ని అందించడంలో టీచర్ల పాత్ర చాలా ఎక్కువ. పిల్లలకు జ్ఞానాన్ని ఇవ్వడంతో పాటు వారి మెంటరింగ్, కౌన్సెలింగ్ కూడా స్కూల్ స్థాయిలో చాలా ముఖ్యమైనవి, ఈ విధులను సాంకేతిక పరికరాలు, స్మార్ట్ తరగతి గదులు ఇవ్వలేవు. ఇవి టీచర్‌కు అదనంగా ఉపయోగపడే పరికరాలు మాత్రమే. సాధారణ టీచర్ల బోధనా సామర్థ్యాన్ని కొంతవరకు పెం చడానికి ఉపయోగపడవచ్చు కాని, సామర్థ్యం ఉన్న టీచర్లకైతే ఇవి అడ్డంకిగానే తోస్తాయి. టీచర్ సామర్థ్యం పెరిగే కొద్దీ టెక్నాలజీ వాడకం తగ్గుతుంది.

బోధనలో టెక్నాలజీ విద్యార్థులను, వారు బాగా నేర్చుకున్నారనే భ్రమలకు గురిచేస్తుంది. ఊహాశక్తి, భావనలకు ఆకృతినిచ్చే సామర్థ్యాలు తగ్గిపోతాయి. పిల్లల వైయక్తిక బేధాలను అనుసరించి బోధన జరుపడానికి దీనిలో తక్కువ అవకాశాలుంటాయి. సమాచార, ప్రసార, సాంకేతిక శాస్త్ర వినియోగం వల్ల పిల్లల్లో నేర్చుకోవడం పట్ల మొదట్లో కొత్తదనంతో కొంత ఉత్తేజాన్ని కలిగించవచ్చు, కాని కాలక్రమేణా అది యాంత్రికంగా మారుతుంది. అన్ని విషయాలను ఈ విధానంలో బోధించలేం. ముఖ్యంగా ఎలిమెంటరీ స్థాయిలో ఈ విధానాలను పరిమితంగా వాడవలసి ఉంటుంది. సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, భిన్న సంస్కృతుల ప్రజలు ఒకరితో నొకరు వ్యవహరించే తీరు, ప్రపంచాన్ని అర్థం చేసుకునే తీర్లను అవగాహన సామర్థ్యాలను శతాబ్దపు నైపుణ్యాలుగా ఈ సమాచార, ప్రసార, సాంకేతిక శాస్త్ర వినియోగాన్ని కీర్తించేవారు చెబుతుంటారు. అయితే ఈ నైపుణ్యాలు సమాచార, ప్రసార, సాంకేతికశాస్త్ర వినియోగం లేకపోయినా అభివృద్ధి చెందుతాయి. అలాగే సమాచార, ప్రసార, సాంకేతిక శాస్త్ర వినియోగంతో ఈ నైపుణ్యాలు తప్పక కలుగుతాయనే నమ్మకం ఏమీ ఉండదనీ ఈ రంగంలోని నిపుణులు చెబుతున్నారు.

విద్యా టెక్నాలజీ ఉపాధ్యాయుడి బోధనకు అదనపు పరికరమవుతుంది గాని, అది ఉపాధ్యాయుడి స్థానాన్ని పూరించలేదు. స్మార్ట్ క్లాస్‌రూంల కంటే స్మార్ట్ టీచర్లే ప్రధానం. టీచర్ల తయారీని గాలికి వదిలేసి స్మార్ట్ క్లాస్‌రూంలను ఆశ్రయిస్తే ప్రయోజనం ఉండదు. జాతీయ విద్యా విధాన ముసాయిదా- 2016 సమాచార, ప్రసార, సాంకేతిక శాస్త్ర వినియోగాన్ని కీర్తిస్తున్నది. క్లిష్టంగా ఉన్న విద్యారంగ పరిస్థితులను రాబోయేకాలంలో అతి సంక్లిష్టం చేయబోనున్న ప్రతిపాదనలివి.


**ఐక్య ఉపాధ్యాయ పత్రిక చందా రేట్లు**

| | | |
|---|---|---|
| విడి పత్రిక | - | ₹ 15.00 |
| సంవత్సరం చందా | - | ₹ 150.00 |
| అర్ధ దశాబ్ది (5 సం॥లు) | - | ₹ 650.00 |
| దశాబ్ది చందా (10 సం॥లు) | - | ₹ 1250.00 |

**ఐక్య ఉపాధ్యాయలో ప్రకటనల రేట్లు**

| | | |
|---|---|---|
| 4వ కవర్ పేజీ (కలర్) | - | ₹ 30,000 |
| 2వ కవర్ పేజీ (కలర్) | - | ₹ 20,000 |
| 3వ కవర్ పేజీ (కలర్) | - | ₹ 20,000 |
| లోపలి పేజీ (బ్లాక్ & వైట్) | - | ₹ 10,000 |
| లోపలి పేజీ (బ్లాక్ & వైట్)ఆప్షనల్ | - | ₹ 11,000 |

**SMS Alert**

**చందాదారులకు విజ్ఞప్తి :** ఐక్యఉపాధ్యాయ పత్రిక చందాదారులుగా వున్న వారు మీ చందా నంబర్, పేరు, జిల్లా, ఫోన్ నెంబర్ పోస్టుకార్డు / ఇ-మెయిల్ ద్వారా పంపగలరు. ప్రతి నెల పత్రిక 11,12 తేదీలలో పోస్టు అవుతుంది. వెంటనే మీకు మెసేజ్ ఆటో జనరేట్ అయి మీ మొబైల్‌కి మెసేజ్ వస్తుంది. పైన తెలిపిన వివరాలతో పాటు ఒక సంవత్సరం / 5 సం॥ / 10 సం॥ / ఏజెన్సీ ఏదనే వివరం కూడా తెలుపగలరు.

**- సంపాదకవర్గం**

### విద్యాశాఖ పోస్టుల్లోకి ఇతర శాఖల అధికారుల నియామకాలు రద్దు చేయాలి - యుటియఫ్

విద్యాశాఖలోని ఖాళీ పోస్టుల్లో ఇతర శాఖల నుండి అధికారులను నియమించే విధానం విరమించుకోవాలని యుటియఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఐ.వెంకటేశ్వరరావు, పి.బాబురెడ్డి డిమాండ్ చేశారు.

జిల్లాల్లోని ప్రాజెక్టు ఆఫీసర్ (పిఓ) పోస్టుల నుండి డైరెక్టర్ స్థాయి పోస్టుల వరకు ఇతర శాఖల నుండి భర్తీ చేయడం వల్ల విద్యారంగం పట్ల అవగాహన లేక వారు తీసుకునే నిర్ణయాలు పాఠశాలల్ని నష్టపరుస్తున్నాయని అన్నారు. ఇటీవల కాలంలో అనేక అవినీతి అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయని వాటిపై విచారణ జరపాలని డిమాండ్ అన్నారు.

ప్రమోషన్స్ ద్వారా భర్తీ చేయాల్సిన ఆర్ఎంఎస్ఏ డైరెక్టర్, ఓపెన్ స్కూల్సు డైరెక్టర్ లాంటి పోస్టుల్లో కూడ ఇతర శాఖల నుండి ఎలా డెప్యుటేషన్ వేస్తారని వారు ప్రశ్నించారు. ఇలాంటి అక్రమ నియామకాలు వెనక ఎవరున్నారో విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎస్ఏ ప్రాజెక్టును పాఠశాల విద్యా కమీషనరేట్ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

### ఎయిడెడ్ పాఠశాలలకు బడ్జెట్ విడుదల

ఎయిడెడ్ పాఠశాలలకు 3వ క్వార్టర్ బడ్జెట్ విడుదల అయినట్లు యుటియఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఐ.వెంకటేశ్వరరావు, పి.బాబురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ఎయిడెడ్ ప్రైమరీ పాఠశాలలకు రూ.79,79,00,000/-, సెకండరీ పాఠశాలలకు రూ.68,72,33,000/-, ఒరియంటల్ పాఠశాలలకు రూ.9,34, 01,000/- విడుదల అయినట్లు వారు తెలిపారు. వెంటనే జీతాలు చెల్లించే ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను కోరారు.

కవిత

### నేను ఉద్యమ ఊపిరిని

– పి.బాబురావు, గంగలకుంట

వదిలిన బాణమై వేగంఆ వస్తున్నా!
నింగి నుంచి నేలను తాకుతున్న మెరుపునై వస్తున్నా!
పద భావజాలంతో కురవబోతున్న మేఘమై వస్తున్నా!
ఉర్వికి ఊపిరి పోసే ఝుంజా మారుతమై వస్తున్నా!
గంగమ్మ గలగలతో, కృష్ణమ్మ సవ్వడితో వేగంగా వస్తున్నా!
భానుడి భగ భగలు రగిలించటానికి వస్తున్నా!
ఉవ్వెత్తున ఎగసే కడలి అలలతో వస్తున్నా!
కదనరంగమున ఘీంకరించే గజరాజునై వస్తున్నా!
రక్తవర్ణ హృదయాలలో విప్లవ విపంచికలు మోగించటానికి వస్తున్నా!
ఎరుపెక్కిన కళ్ళను అరుణకిరణ భాహువులతో స్పృశించటానికి వస్తున్నా!
నేనే ఉద్యమ ఊపిరిని మిత్రులారా!
నేనే ఉపాధ్యాయ ఉద్యమ ఊపిరిని మిత్రులారా!

### ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్‌రూల్స్‌పై ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలి - ఫ్యాప్టో

ప్రభుత్వ మరియు పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్ సాధనకై రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రభుత్వం ప్రత్యేక చొరవచూపి విద్యా వ్యవస్థను కాపాడాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ప్రభుత్వాన్ని కోరింది. అక్టోబర్ 18న ఫ్యాప్టో చైర్మన్ పి.బాబురెడ్డి, సెక్రటేరీ జనరల్ జి.హృదయరాజు, కో-చైర్మన్లు సిహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు, పి.పాండురంగ వరప్రసాద్, పి.కృష్ణయ్య, కార్యదర్శి బి.కరీముల్లారావు, కోశాధికారి జి.శౌరి రాయలు ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి పాఠశాల విద్య ఆదిత్యానాథ్ దాస్, కమీషనర్ కె.సంధ్యారాణి గార్లను కలసి చర్చించారు.

ముఖ్యకార్యదర్శి మాట్లాడుతూ ఉమ్మడి సర్వీస్‌రూల్స్ విషయమై జిఏడి ముఖ్యకార్యదర్శితో కలసి ప్రభుత్వాన్ని కలుపుకొని సాధించే దిశగా కృషి చేస్తామని, పండిట్, పిఇటి అప్‌గ్రేడేషన్ పోస్టుల పంపిణీ మరియు జిల్లాల్లో అమలుకై త్వరలోనే జిఓ జారీ చేస్తామని, ప్రతి జిల్లాలో ముఖ్యంగా కర్నూలు, ప్రకాశం, నెల్లూరు, తూర్పుగోదావరి, కృష్ణాలలో నెలవారీ పదోన్నతులు జరిగేలా చూస్తామని ఫ్యాప్టోకు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

### మాతృభాషలో విద్యను కొనసాగించాలి - ఫ్యాప్టో

ప్రపంచంలో అత్యధిక దేశాలు అన్ని యాజమాన్యాలలో ఒక స్థాయి వరకు తమ మాతృభాషలోనే విద్యా బోధనలను అమలు చేస్తారని, అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని మున్సిపల్ స్కూళ్ళలో, ప్రాథమిక పాఠశాలలతో సహా తెలుగు మాధ్యమం లేకుండా ప్రతికూల పరిస్థితుల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడం అశాస్త్రీయ మని ఫ్యాప్టో చైర్మన్ పి.బాబురెడ్డి, సెక్రటరీ జనరల్ జి.హృదయరాజు తెలిపారు.

ప్రజాభిప్రాయం మేరకు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెట్టాలనుంటే ఖచ్చితంగా మాతృభాషతో పాటు పరబాష మాధ్యమాలను సమాంతరంగా కొనసాగిస్తూ శిక్షణ పొందిన టీచర్లను స్టాఫ్ ప్యాటర్న్ ప్రకారం నియమించాలన్నారు. పట్టణీకరణ వలన పెరుగుచున్న జనాభాను దృష్టిలో వుంచుకొని అన్ని మున్సిపాలిటిల్లో క్రొత్త పాఠశాలలు ప్రారంభించాలి మరియు ఉపాధ్యాయులను నియమించాలని ఫ్యాప్టో నాయకత్వం డిమాండ్ చేసింది.

### పండిట్, పిఇటి అప్‌గ్రేడేషన్ పోస్టుల పంపిణీకై ఉత్తర్వులు జారీ - ఫ్యాప్టో

రాష్ట్రంలో 1450 పండిట్లు, 1200 పిఇటి గ్రేడ్-2 పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులపై, పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ఆదిత్యానాథ్ దాస్ వాటి జిల్లాలకు పంపిణి నిమిత్తం ఉత్తర్వు నం.10093/సర్వీస్-2/ఎ1/2012 ద్వారా కమీషనర్‌కు బాధ్య తలను ఇచ్చినట్లు ఫ్యాప్టో చైర్మన్ పి.బాబురెడ్డి, సెక్రటరీ జనరల్ జి.హృదయరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

ఫ్యాప్టో ప్రతినిధి బృందం ముఖ్య కార్యదర్శిగారిని కలిసి ప్రాతినిధ్యం చేసిన మేరకు “పండిట్ మరియు పిఇటి పోస్టుల అప్‌గ్రేడేషన్ పోస్టులకు పంపిణి మార్గదర్శకాలను జారీ చేశారని ఫ్యాప్టో తెలిపింది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ పాఠశాలల టీచర్లు, సిబ్బందికి 10వ పిఆర్‌సి వర్తించునట్లు ప్రభుత్వ ఉత్తర్వులు 114, 264 నెంబర్లు జారీ అయినట్లు ఫ్యాప్టో తెలిపింది.

## విద్యారంగ పరిరక్షణే లక్ష్యంగా - ప్రత్యామ్నాయ విధానాలే ధ్యేయంగా

# యుటియఫ్ 42వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు - ఆహ్వాన సంఘం ఏర్పాటు



విజయనగరం జిల్లా కేంద్రంలో స్థానిక ఎన్‌జిఓ కార్యాలయం లో విజయనగరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 23వ తేదీన 42వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు డిసెంబర్ 10,11 తేదీలలో విజయనగరంలో జరుగుతున్న నేపథ్యంలో జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస రావు అధ్యక్షతన ఆహ్వానసంఘం ఏర్పాటు చేయడం జరిగింది. తొలుత జిల్లా ప్రధానకార్యదర్శి కె.శేషగిరి ఆహ్వాన సంఘం ప్రాముఖ్యత, జిల్లాలో ప్రముఖులతో ఆహ్వాన సంఘం ఏర్పాటు, జిల్లాలో ప్రత్యేక అంశాలను మాట్లాడారు. అనంతరం ఆహ్వాన సంఘం అధ్యక్షులు, ప్రధానకార్యదర్శి, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కమిటీ సభ్యులు దాదాపు 40మందితో కూడిన ప్రముఖుల జాబితాను కె.శేషగిరి ప్రతిపాదిం చారు. సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.

సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన యుటియఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ 10,11 తేదీలలో జరగబోయే రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలలో విద్యారంగంపై సుదీర్ఘమైన చర్చ జరుగుతుందని, కీలక నిర్ణయాలు తీసుకునే ఈ సమావేశాలు ఉపాధ్యాయ ఉద్యమం బలోపేతానికి దోహద పడతాయని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వ వైఖరిని వివరించారు.

రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి మాట్లాడుతూ దుర్మార్గమైన సిపిఎస్ విధానాన్ని రద్దుచేయాలని, ఈ క్రమంలో నవంబర్ 29న జరిగే "ఛలో ఢిల్లీ"ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తరువాత ఉత్తరాంధ్ర పట్టభద్రుల అభ్యర్థి ఎ.ఆజశర్మను సభకు పరిచయం చేశారు.

అనంతరం సభకు హాజరైన ప్రముఖులు ప్రొఫెసర్ రామకృష్ణా రావు, ఆర్.పోతన్న, ఆర్.ప్రసాద్, ప్రభూజీ, నారాయణరావు, సురేష్, పి.అప్పారావు, డి.రాము తదితరులు మాట్లాడారు. విశాఖ జిల్లా అధ్యక్షులు జాజులు, ప్రధానకార్యదర్శి ఐ.ప్రసాద్‌లు సందేశం ఇచ్చారు. రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు సంబంధించిన పోస్టర్లను నాయకులు, ఆహ్వాన సంఘం సభ్యులు ఆవిష్కరించారు.

జిల్లా కార్యవర్గ సమావేశం మధ్యాహ్నం ప్రారంభమైంది. జిల్లా ప్రధానకార్యదర్శి కార్యకలాపాల రిపోర్టు, కౌన్సిల్ సమావేశాలు, రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల కమిటీలు, క్యాంపెయిన్స్‌పై నివేదికను, ప్రతి పాదనలను ప్రవేశపెట్టిన అనంతరం చర్చలలో మండల, పట్టణ ప్రతి నిధులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు ఎస్.మురళీమోహన్, జి. నిర్మల, కోశాధికారి రమేష్ పట్నాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం. కృష్ణారావు, జిల్లా కార్యదర్శులు జి.రాములప్పుడు, ఎన్.శ్రీరాములు, జి.వెంకటనాయుడు, జి.వెంకటరావు, టి.రమేష్, జి.పార్వతి, ఎ.సత్య శ్రీనివాస్, ఎం.అప్పలనాయుడు, వై.స్వామినాయుడు, పి.మధుసూధన రావు, పి.శ్రీనివాసరావు, పి.లక్ష్మణ, వి.ప్రసన్నకుమార్, ఎస్.నాగ రాజులతో పాటు మండలాల నాయకులు పాల్గొన్నారు.

## ఆహ్వాన సంఘం

చైర్మన్ : పిడి కామేశ్వరరావు; శోధన సంస్థ డైరెక్టర్, ఉపాధ్యక్షులు ప్రొ॥ రామకృష్ణారావు, ప్రముఖ విద్యావేత్త; ఎయు, ఆర్.ప్రసాద్, రిటైర్డ్ ఆర్‌డిఓ, ఆర్.పోతన్న, గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు, జి.గౌరునాయుడు ప్రముఖ కవి, సాహితీ వేత్త; చాగంటి తులసి, రచయిత, డా॥ డివిజి శంకరరావు, మాజీ ఎంపి, డా॥ మంచుపల్లి శ్రీరాములు, హిందీ కాలేజీ ప్రిన్సిపల్, కె.నారాయణరావు, పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, డివి రమణ, ఎన్‌జిఓ రాష్ట్ర పాధ్యక్షులు, ఎన్.ప్రభూజీ, జిల్లా జెఎసి చైర్మన్; కె.శేషగిరి, యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి, కోశాధికారి రమేష్‌చంద్ర పట్నాయక్.

పై వాటితోపాటు సాహితీస్రవంతి, జనవిజ్ఞాన వేదిక, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్, ఎస్ఎఫ్ఐ వ్యవసాయ కార్మిక సంఘం, ఏపి ఎంఎస్‌టిఎఫ్, కెజిబివి, ఐటిడిఏ, సిఆర్‌టిల సంఘం, ఐద్వా, సిఐటియు, ఎల్ఐసి ఎంప్లాయీస్ యూనియన్, మధ్యాహ్న భోజన పథక నిర్వాహక సంఘాల నుండి రాష్ట్ర, జిల్లా ప్రధాన బాధ్యులు, యుటియఫ్ జిల్లా కార్యదర్శివర్గంతో ఆహ్వాన సంఘం ఏర్పాటు జరిగింది.

# ప్రశ్నోత్తరాలు



*నిర్వహణ :* టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు,
ఐక్య ఉపాధ్యాయ సంపాదకవర్గ సభ్యులు
mail : ikyopadhyaya1975@gmail.com

ప్రశ్న : **ఒక ఉపాధ్యాయుడు 30 సం॥ల సర్వీసు పూర్తి చేశారు. ఇప్పటివరకు 170 రోజులు కమ్యుటేషన్ సెలవులు వాడుకున్నారు. ఇంకా ఎన్ని రోజులు కమ్యుటెడ్ సెలవు వాడుకోవచ్చు? తదుపరి కూడా సెలవు అవసరమైతే ఏమి చేయాలి.**

**- పి.రమేష్, కర్నూలు**

జవాబు : సర్వీస్ మొత్తం 240 రోజులు కమ్యుటెడ్ సెలవుగా వాడుకోవచ్చు. అప్పుడు అర్ధజీతపు సెలవు ఖాతా నుండి 480 రోజులు తగ్గింపు చేయబడతాయి. తదుపరి కూడా సెలవు అవసరమైతే అర్ధజీతపు సెలవుగా మాత్రమే ఖాతాలో నిల్వయున్నంత వరకు వాడుకోవచ్చు.

ప్రశ్న : **2014 డిఎస్‌సి ద్వారా నియామకం పొందిన ఉపాధ్యాయులు ఎన్ని సిఎల్‌లు వాడుకోవచ్చు?**

**- వివిఎస్ నారాయణ, గండేపల్లి, తూ॥గో॥**

జవాబు : డిఎస్‌సి 2014 ఉపాధ్యాయులు జూన్ 1వ తేదీన ఉద్యోగంలో చేరినందున 9 రోజులు సిఎల్, 4 రోజులు స్పెషల్ సిఎల్, మహిళా ఉపాధ్యాయినులు మరొక 3 రోజులు స్పెషల్ సిఎల్ వాడుకొనవచ్చును.

ప్రశ్న : **నేను స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో స్టెప్‌అప్ పొందాను. మరల అదే కేడర్‌లో స్టెప్‌అప్ పొందవచ్చా?**

**-వై.ఎస్.చక్రవర్తి, ఒజిలి, నెల్లూరు**

జవాబు: అవకాశం లేదు.

ప్రశ్న : **నా స్నేహితుడు ఫిబ్రవరి నెలలో ఉద్యోగ విరమణ చేయవలసి వుంది. విద్యా సంవత్సరం మధ్యలో ఉద్యోగ విరమణ చేస్తే సంవత్సరం చివరిదాకా కొనసాగిస్తారని పత్రికలలో చదివాను. ఉత్తర్వులు తెలుపగలరు.**

**- ఎం.బాలకృష్ణారావు, రాజమండ్రి, తూ॥గో॥**

జవాబు : అటువంటి ఉత్తర్వులు ఏవి వెలువడలేదు.

ప్రశ్న : **ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రైవేట్ కళాశాలలో పని చేయవచ్చా? డిఇఓ ఇచ్చిన ఛార్జీ మెమో ఎస్ఆర్‌లో నమోదు చేయాలా?**

**- ఐ.వెంకటేశ్వరరావు, వానపల్లి, తూ॥గో॥**

జవాబు : సిసిఏ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ప్రైవేట్ కళాశాలలో బోధించరాదు. నమోదు చేయాలి.

ప్రశ్న : **చికిత్సల జాబితా లోని తలసేమియా వ్యాధికి హెల్త్ కార్డు ద్వారా చికిత్సపొందవచ్చా?**

**- ఎస్‌కె సైదాసాహెబ్, విజయవాడ**

జవాబు : చికిత్సల జాబితాలో లేని వ్యాధులకు కూడా అనుమతిపొంది చికిత్స అందించాలని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆసుపత్రులకు ఆదేశాలు యివ్వడం జరిగింది.

ప్రశ్న : **నేను, నా భార్య ఇరువురం ఉపాధ్యాయులము. హెల్త్ కార్డుల ప్రీమియం నా జీతం ద్వారా చెల్లిస్తున్నారు. నా భార్య కార్డులో వారి తల్లిదండ్రుల పేరు నమోదు చేసుకోవచ్చా?**

**- పి.నాగార్జున, గిద్దలూరు, ప్రకాశం**

జవాబు : చేసుకోవచ్చు. మహిళా ఉద్యోగినులు కూడా ఆధారిత తల్లిదండ్రుల పేర్లను హెల్త్‌కార్డులో చేర్చుకోవచ్చు.

ప్రశ్న : **అడ్మిషన్ రిజిష్టర్‌లో మార్పులకు ఎవరి అనుమతి అవసరం?**

**-నాగేంద్రకుమార్, ధర్మవరం, అనంతపురం**

జవాబు : ఇన్‌స్పెక్షన్ అధికారి అనుమతితో మార్పు చేసుకోవచ్చు.

ప్రశ్న : **నేను 1983లో ఎస్‌జిటిగా నియామకం పొందాను. నా పుట్టిన తేదీ 5.11.1958. నేను 2007లో 24 సం॥ల స్కేలు పొందాను. డిపార్ట్‌మెంట్ టెస్టులు పాస్ కాలేదు. తదుపరి 2/2009న ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయునిగా పదోన్నతి పొందాను. నేను 24 సం॥లు రద్దు చేసుకొనినచో ఎస్‌జిటి కేడర్‌లో 18 సం॥ల ఇంక్రిమెంట్, ఎల్ఎఫ్ఎల్ కేడర్‌లో 6 సం॥లు పొందవచ్చా?**

**- కర్రి చిరంజీవులు, ధనపురం, శ్రీకాకుళం**

జవాబు : మీకు అర్హత లేకుండా యిచ్చిన 24 సం॥ల స్కేలు రికవరీ చేయవలసి వుంటుంది. నూతన ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ 01.02.2010 నుండి అమలులోకి వచ్చింది. మీరు 2/2009లోనే పదోన్నతి పొందినందున ఎస్‌జిటి కేడర్‌లో 18 సం॥ల ఇంక్రిమెంట్ వచ్చే అవకాశం లేదు. 24 సం॥ల స్కేలు రద్దు అనంతరము ఎల్ఎఫ్ఎల్ కేడర్‌లో 6 సం॥లు స్కేలు పొందవచ్చును.

## పాఠకులకు గమనిక

ఇ–మెయిల్ (ikyopadhyaya1975@gmail.com) లేదా లేఖల ద్వారా ప్రశ్నలు పంపేవారు వారి పేరు, గ్రామం, జిల్లా పేరు, ఫోన్ నంబరు, ఐక్య ఉపాధ్యాయ చందానంబరు తప్పనిసరిగా వ్రాయాలి. ప్రశ్నలు సూటిగా, స్పష్టంగా ఉండాలి. జిఓ / మెమో కాపీలు కావలసిన వారు సంబంధిత జిల్లాలలో యుటియఫ్ కార్యాలయాలను లేదా బాధ్యులను సంప్రదించాలి. పత్రికా కార్యాలయం నుండి జిఓ / మెమో కాపీలు పంపుటకు వీలుకాదు.

# సదస్సులు - సమావేశాలు - స్టడీ సర్కిల్స్

## శ్రీకాకుళం జిల్లా

### సిపిఎస్ విధానం రద్దు చేయాలి



శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యుటియఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం అక్టోబర్ 23న జిల్లా అధ్యక్షులు రెడ్డి మోహనరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పంచాయితీరాజ్, మున్సిపల్, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ రూపొందించేం దుకు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర వత్తిడి తేవాలని, సిపిఎస్ రద్దుకై అసెంబ్లీలో తీర్మానం చేయాలని, పిఆర్‌సి అరియర్లు చెల్లించాలని, డిఏ బకాయిలు చెల్లించాలని, పండిట్, పిఇటి అప్‌గ్రేడేషన్ జిఓలు అమలుకు సత్వర చర్యలు చేపట్టాలని, స్పెషల్ టీచర్ల నోషనల్ ఇంక్రి మెంట్స్ మంజూరు చెయ్యాలని, సిసిఇ విధానంపై సమీక్ష చెయ్యాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జిల్లా ప్రధానకార్యదర్శి చౌదరి రవీంద్ర ప్రసంగిస్తూ నవంబర్ 6న జిల్లా జనరల్ కౌన్సిల్ నిర్వహిస్తున్న నేపథ్యంలో మండల, పట్టణ శాఖలు ఆడిట్, కౌన్సిల్ నిర్మాణాలు పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు రెడ్డి మోహనరావు ప్రసంగిస్తూ విద్యాశాఖాధికారులు స్వతంత్ర నిర్ణయాలు వదలిపెట్టి, ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు, జిల్లా సహాధ్యక్షులు బమ్మిడి శ్రీరామమూర్తి, జిల్లా కోశాధికారి పి.అప్పారావు, జిల్లా కార్యదర్శులు సదాశివుని జగదీశ్వరరావు, పి.పద్మశ్రీ, కొండపల్లి గౌరునాయుడు, బి.విజయకుమారి, యండ ఉమాశంకర్, డి.ప్రకాశ రావు, ఆరిక భాస్కరరావు, వి.మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా విద్యాధికారుల నిర్ణయాలు - విద్యార్థులు ఉపాధ్యాయులపై ఒత్తిడి

శ్రీకాకుళం జిల్లా విద్యాధికారుల స్వతంత్ర నిర్ణయాల వలన విద్యార్థులు, ఉపాధ్యాయుల ఒత్తిడికి గురౌతున్నారని శ్రీకాకుళం జిల్లా యుటియఫ్ నాయకత్వం ఆందోళన వ్యక్తం చేసింది. స్థానిక కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఒక సబ్జెక్టు ఉపాధ్యాయుడు తన మండల పరిధిలో మరో ఉన్నత పాఠశాలలో ఆదివారం బోధనచేసి తదనంతరం పరీక్ష నిర్వహించి, ఆ విషయాన్ని విద్యాధికారులకు అందించాలని మౌఖిక ఆదేశాలు అందించారు. వారాంతపు సెలవు లేకుండా చేయడం వల్ల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంది. సెలవు లేకుండా చేయడం వలన బోధనకు, సంగ్రహణకు ఆటంకం కలుగుతుందని గుర్తించి, జిల్లా విద్యాధికారులు ఇచ్చిన మౌఖిక ఆదేశాలను ఉసంహ రించుకోవాలని యుటియఫ్ కోరింది.



పదవీ విరమణ పొందిన ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయు లను పాఠశాల సందర్శనకు పంపి, వారిచ్చిన రిపోర్టులు ఆధారంగా సమీక్షలు చేయడం సరికాదు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యా యులను పాఠశాల పరిశీలనకు పంపడం మానుకోవాలని సమావేశం అభిప్రాయపడింది.

నూతన విద్యావిధానంపై అభిప్రాయాల సేకరణకు ఉపాధ్యాయ సంఘాలను విస్మరించడం సరికాదు. ఉపాధ్యాయులను, విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేసే ప్రయో గాలకు స్వస్తి పలకాలనీ, లేకపోతే ఉద్యమం తప్పదనీ యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రెడ్డి మోహనరావు, చౌదరి రవీంద్ర అన్నారు. సమావేశంలో యుటియఫ్ నాయకులు ఎస్.కిశోర్‌కుమార్, పి.అప్పారావులు పాల్గొన్నారు.

## తూర్పుగోదావరి జిల్లా

### సిపిఎస్ రద్దు కోసం నవంబర్ 29న చలో ఢిల్లీ

కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఎస్‌టిఎఫ్ఐ పిలుపు మేరకు నవంబర్ 29న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. యుటియఫ్ తూర్పుగోదావరి జిల్లా శాఖ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు.

కాకినాడ యుటియఫ్ హోంనందు యుటియఫ్ తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గ సమావేశం అక్టోబర్ 12న జిల్లా అధ్యక్షులు డి.వి.రాఘవులు అధ్యక్షతన జరిగింది. అధ్యక్షోపన్యాసంలో ఆయన మాట్లాడుతూ మండల / పట్టణ / నగర శాఖల కౌన్సిల్స్ అక్టోబర్ 25వ తేదీనాటికి పూర్తిచేయాలని పిలుపునిచ్చారు. సంఘ కార్యక్రమా

లతో కూడిన కార్యదర్శి నివేదికను జిల్లా ప్రధానకార్యదర్శి టి.కామేశ్వర రావు ప్రవేశపెట్టారు. ఆర్థిక నివేదికను జిల్లా కోశాధికారి కెవి ప్రసాద్ బాబు ప్రవేశపెట్టారు. కుటుంబ సంక్షేమ పథకం నివేదికను పథకం ప్రధానకార్యదర్శి సిహెచ్‌వి రమణ ప్రవేశపెట్టారు. సంతాప తీర్మానాల ను, ఐక్యఉపాధ్యాయ పత్రిక నివేదికను జిల్లా గౌరవాధ్యక్షులు జి. ప్రభాకరవర్మ ప్రవేశపెట్టారు. నివేదికలపై హాజరైన శాఖల నుండి బాధ్యులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. ముఖ్య అతిథిగా హాజరైన యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జెఏసి పోరాటం, దాని ఫలితాలు గురించి వివరించారు. హెల్త్‌కార్డు లపై చేసిన ప్రాతినిధ్యాలను స్టీరింగ్ కమిటీ తీసుకోనున్న నిర్ణయాలను తెలియజేశారు. పండిట్, పిఇటి పోస్టుల అప్‌గ్రేడేషన్‌కి సంబంధించి మున్సిపల్ ఉన్నత పాఠశాలలకు కూడా కేటాయించడం కోసం కొంత జాప్యం జరిగిందన్నారు.

రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.సత్తిరాజు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జోగా అప్పారావు, ఎన్. అరుణకుమారి, జిల్లా కార్యదర్శులు జి.అప్పలనాయుడు, ఎంఆర్‌సి మోహన్, యం.వెంకటేశ్వరరావు, చలపతి, చక్రవర్తి, సోనీ, పెంకే వెంకటేశ్వరరావు, ఆర్‌వి రమణమూర్తి, వి.చంద్రశేఖర్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ తోలేటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. సమావేశం గత కార్యవర్గం నుండి ఇప్పటివరకు జరిగిన కార్యక్రమాల అమలును సమీక్షించి, భవిష్యత్ కర్తవ్యాలను నిర్దేశించింది.

**పెద్దాపురం :**

**యువ ఉపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలపై శిక్షణ**



పెద్దాపురం యాసలపు సూర్యారావు భవన్‌నందు యుటియఫ్ పెద్దాపురం మండల శాఖచే యువ ఉపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలపై అక్టోబర్ 17న శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా గౌరవాధ్యక్షులు జి.ప్రభాకరవర్మ ఉపాధ్యాయ ఉద్యమంలో యుటియఫ్ విశిష్టత, నాయకత్వ లక్షణాలు, అస్థిత్వ ఉద్యమాలు అనే అంశంపై క్లాసు చెప్పారు. ఈ శిక్షణా కార్యక్రమానికి పెద్దాపురం మండల శాఖ అధ్యక్షులు కె.సూరిబాబు అధ్యక్షత వహించారు. పెద్దాపురం రూరల్ ప్రధానకార్యదర్శి వివిఆర్ సీతారామారావు, పట్టణశాఖ ప్రధాన కార్యదర్శి జి.వెంకట్రావు, రూరల్ మండలశాఖ గౌరవాధ్యక్షులు ఎంఎస్‌సి మూర్తి తదితరులు పాల్గొన్నారు. క్లాస్‌కి హాజరైన యువ ఉపాధ్యాయులు భవిష్యత్ ఉద్యమానికి నాయకత్వం వహిస్తామని ప్రతి స్పందించారు.

**పశ్చిమగోదావరి జిల్లా**

**ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించవద్దు**

స్థానిక యుటియఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం జిల్లా శాఖ అధ్యక్షులు పి.జయకర్ అధ్యక్షతన అక్టోబర్ 23న జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రాము సూర్యారావు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖలో అమలు చేస్తున్న విద్యార్థులకు ఉపయోగంలేని కార్యక్రమాల వలన, సిసిఇ విధానం అమలు విషయంలోను అస్తవ్యస్తంగా వ్యవహరించడం వలన ఉపాధ్యాయులలో తీవ్రమైన వ్యతిరేకత ఏర్పడిందని ఇది ప్రభుత్వం పట్ల వ్యతిరేకతగా మారుతుందని ప్రజాప్రతినిధులు లోతుగా పరిశీలన చేసి లోపాలను సరిచేయాలని అన్నారు. ఉపాధ్యా యులకు ఏకీకృత సర్వీసు రూల్స్ సత్వరమే అమలు చేయడానికి కేంద్రప్రభుత్వంతో సంప్రదించి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న డివైఈవో, ఎం.ఈ.వో, డైట్ లెక్చరర్ పోస్టులను ప్రమోషన్లు ద్వారా భర్తీ చేయాలని ముఖ్యమంత్రికి పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రాతినిధ్యం చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర కార్యదర్శి షేక్ సాబ్జీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ జిల్లాలోను లేని విధముగా పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని మండలాలలో ప్రైమరి, అప్పర్ ప్రైమరీ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో బోధనోపకరణ ముల మేళాలు ఏర్పాటు చేసి వాటిని పర్యావేక్షించడానికి విద్యాశాఖకు సంబంధములేని అధికారులతో తనిఖీలు చేయించడం విద్యాశాఖ అధికారులను ఉపాధ్యాయులను అవమానించడమేనని జిల్లా యంత్రాం గం చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 5% పేపర్లు బాహ్య మూల్యాంకనము చేపట్టుటలో జిల్లా విద్యాశాఖ ఉపాధ్యాయు లను గందరగోళానికి గురిచేయడం సమంజసంగా లేదన్నారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ హామీ మేరకు ఫార్మెటివ్, సమ్మెటివ్ పేపర్ల మార్కులు ఆన్‌లైన్ చేసే భారాన్ని ఉపాధ్యాయులపై పెట్టవద్దని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేసారు.

జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి బి.గోపీమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎటువంటి ఫోటోలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సిన పనిలేదు అని పి.వో ఇచ్చిన హామీని అమలు చేయాల న్నారు. డిఈవో నెలవారీ ప్రమోషన్లుకు సంబంధించిన షెడ్యూల్సు విడుదల చేసి నెలాఖరులోగా ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.రామకృష్ణ, సహాధ్యక్షులు సి.హెచ్ జగన్మోహనరావు, వి.కనక దుర్గ, కోశాధికారి పి.వి నరసింహరావు, జిల్లా కార్యదర్శిలు ఎ.కెవి రామభద్రం, వి.బి.వి.ఎస్ సుబ్రహ్మణ్యం, బి.సుబాషిణి, పి.శివ ప్రసాద్, ఎం.సువర్ణరాజు, ఆర్.రవికుమార్, రాష్ట్ర కౌన్సిలర్స్ టిజె జయకుమార్, సిహెచ్ పట్టాభిరామారావు, కె.శ్రీనివాసన్, కె.రాజశేఖర్, డి.నాగరాజు తదితరులు మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండల, పట్టణ శాఖల నుండి అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. సమావేశంలో యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ సాబ్జీ తండ్రి షేక్ కబీర్షా రిటైర్డ్ ఎల్.ఎఫ్.ఎల్ హెచ్‌ఎం మృతికి మరియు ఇతర ఉపాధ్యాయుల మృతికి సమావేశం సంతాపాన్ని ప్రకటించింది.

### గుంటూరు జిల్లా

#### సిసిఇ పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు

యుటియఫ్ జిల్లా శాఖ కార్యదర్శివర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు కె.నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన అక్టోబర్ 23న జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాఠశాలల్లో నిరంతర సమగ్ర మూల్యాంకనం (సిసిఇ) పద్ధతి ప్రకారం విద్యాబోధన జరుగుతున్నది. అయితే ఆచరణలో చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ముఖ్యంగా హైస్కూల్స్‌లో సెక్షన్‌లలో అధిక సంఖ్యలో విద్యార్థులు ఉన్నందున టీచర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారని, దానికితోడు 5% బాహ్య మూల్యాంకనం పేరుతో ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేస్తున్నారని అన్నారు. వీటికి ప్రత్యామ్నాయ విధానాలు రూపొందించాలన్నారు.

శాసనమండలి మాజీ సభ్యులు కెవిఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విభజన చట్టంలో ఉన్న హామీలను నెరవేర్చడంలో కేంద్రప్రభుత్వం వాటిని అమలు చేసేటట్లు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసు కోవాలన్నారు. రాష్ట్రానికి చట్టప్రకారం రావలసిన ఉన్నత విద్యా సంస్థలను, ప్రాజెక్టులను, నిధులను సకాలంలో ఇవ్వడం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు.

జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి యుటియఫ్‌ను మరింత బలోపేతం చేసుకోవలసిన అవసరం ఉందన్నారు.

కోశాధికారి పి.ప్రేమ్‌కుమార్ ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. సమావేశంలో రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ ఎన్.తాండవకృష్ణ, జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.నాగేశ్వరరావు, జిల్లా సహాధ్యక్షులు ఎం.డి.గౌస్, బి.ఆదిలక్ష్మి, జిల్లా కార్యదర్శులు, ఆడిట్ కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### ప్రకాశం జిల్లా

**కనిగిరి :**

ప్రాంతీయ మండలాలైన కనిగిరి, పిసి పల్లె, హనుమంతునిపాడు, వెలిగండ్ల మండల శాఖల ఆధ్వర్యంలో అక్టోబర్ 16న కనిగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలయందు జిల్లా కార్యదర్శి ఎన్.రామ చంద్రారెడ్డి అధ్యక్షతన విద్యా సదస్సు జరిగింది. జిల్లా గౌరవాధ్యక్షులు మీగడ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ 1966 కొఠారి కమీషన్ సిఫారసులు ఇంతవరకు పూర్తిగా అమలు జరగకుండానే నూతన విద్యావిధానం ప్రవేశ పెట్టడం చర్చించాల్సిన విషయమని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే కదిరి బాబురావు మాట్లాడుతూ తమ ప్రభుత్వం విద్యారంగానికి అధికంగా నిధులు ఖర్చు పెడుతున్నదని, ప్రతి సంవత్సరం డిఎస్‌సిలు, ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నదని చెప్పారు.

మున్సిపల్ కమీషనర్ ఎస్‌కె బినరుస్తాన్, మండల ఎంపిపి వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం పాడు మండల ఎంపిపి గాయిం బలరాంరెడ్డి విద్యారంగంలో యుటియఫ్ ఉపాధ్యాయుల కృషిని అభినందించారు. మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి రాబోయే ఎన్నికలకు పిడిఎఫ్ ఎమ్మెల్సీల గెలుపును తన మద్దతు అందజేస్తున్నట్లు తెలిపారు. మాజీ మంత్రివర్యులు ముక్కు కాశీరెడ్డి, వైఎస్ఆర్‌సిపి కన్వీనర్ బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పాఠశాలలు, ఉపాధ్యాయులు బాగా పనిచేస్తున్నందనే హైస్కూల్సు ఎక్కువమంది ఉపాధ్యాయులతో కళకళలాడుచున్నాయని, ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధికి కృషిచేసి పాఠశాలలను నిలబెట్టుకోవాలని తల్లిదండ్రులలో నమ్మకం పెంచాలని కోరారు.

యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంఘ పటిష్టానికి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి జిల్లా ఉద్యమాన్ని వివరించారు. అనంతరం మీగడ వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన ఉద్యమ సదస్సు జరిగింది. ముఖ్య అతిథి ఎమ్మెల్సీ వితపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నూతన విద్యా విధానం 2016లోని విధానపరమైన నిర్ణయాలు ఉపాధ్యాయుల హక్కులను కాలరాచే విధంగా ఉన్నాయని, పూర్వ ప్రాథమిక విద్యను కేంద్రం వదిలించుకొని రాష్ట్రాలపై రుద్దడం, మధ్యాహ్న భోజన పథకం స్వచ్ఛంద సంస్థలకు అప్పజెప్పడం సరికాదని, ప్రమోషన్‌లకు, ఇంక్రి మెంట్లకు పరీక్షలు పెట్టి లింక్‌పెట్టడం వంటి చర్యలు ఉపా ధ్యాయులకు అభద్రతను ప్రేరేపిస్తున్నాయని దీనిని వ్యతిరేకించాలని, ప్రభుత్వ పాఠశాలల రక్షణకు యుటియఫ్ ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు నారాయణరెడ్డి, షరీఫ్, ఖాజరహంతుల్లా, ఎస్‌కెపిఎం గౌస్, వైవి రావు, జి.వెంకటరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటరెడ్డి, రహంతుల్లా, సింగారెడ్డి, బోయళ్ళ వెంకటేశ్వర్లు, రాము, రత్తయ్య, వికెఎల్‌వి ప్రసాదు, కాశయ్య, వేణు, పదిలంబాబు, రమేష్, చీకటి వెంకటసుబ్బయ్య, శ్రీనివాసాచారి తదితరులు కృషి చేశారు. కదిరిబాబురావు, ముక్కు కాశిరెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, షేక్ చినమస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

### కడప జిల్లా

#### ఉపాధ్యాయులకు ఇండ్ల స్థలాలు కేటాయించటం ప్రభుత్వ బాధ్యత



కడప జిల్లా ఎలిమెంటరీ మరియు సెకండరీ స్కూల్ టీచర్స్ కో- ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ జనరల్ బాడీ మీటింగ్ జిల్లా పరిషత్ ఆవరణలో నిర్వహించారు. ఈ సమావేశం జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మీరాజ మాట్లాడుతూ ప్రభుత్వ ఉపా ధ్యాయులుగా 40 సంలు పనిచేసిన వారికి కూడా సొంతింటి కల నెరవేరటం లేదన్నారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు గృహ వసతి కల్పిస్తామని ఆర్భాటంగా ఏర్పాటు చేసిన రాజీవ్ స్వగృహ మూతపడటానికి సిద్ధంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల నుండి రూ.5000/-లు రాజీవ్ గృహ అధికారులు వసూలు చేసి 10 సంలు గడుస్తున్నా ప్లాటు కేటాయించ లేదన్నారు. వసూలు చేసిన 5వేల రూపాయలు ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు

చెల్లించలేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులందరికి ఇండ్ల స్థలాలు కేటాయించటం ప్రభుత్వ బాధ్యతగా తీసుకోవాలన్నారు.

డా॥సర్వేపల్లి రాధాకృష్ణనగర్‌లో ప్లాట్లు కేటాయించి 20 సం॥లు గడుస్తున్నా అధికారులు మౌలిక వసతులు కల్పించటం లేదన్నారు. ప్లాట్లకు అవసరమైన నీరు, రోడ్లు, కరెంట్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి బి.వి.శివారెడ్డి కార్యకలాపాల నివేదిక ప్రవేశ పెట్టారు. సమావేశంలో పలు తీర్మానాలు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదింపచేశారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు కె.చెంచు రామయ్య బాలశౌరిరెడ్డి, కె.పర్వతుల్లా, సొసైటి సభ్యులు పాల్గొన్నారు.

**పోరుమామిళ్ల :**

**విద్యను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను నిర్వీర్యం చేస్తున్నాయని యుటియఫ్ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మీరాజ ఆరోపించారు. పట్టణంలోని మహర్షి ఉన్నత పాఠశాలలో జిల్లా కార్యదర్శి జయరామయ్య అధ్యక్షతన యుటియఫ్ ప్రాంతీయ సమావేశం అక్టోబర్ 23న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలు, విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేదని విమర్శించారు. హేతుబద్ధీకరణ పేరుతో ఉపాధ్యాయుల స్థానాలను కుదించారని తెలిపారు. ఫలితంగా అనేక పాఠశాలలు మూసివేశారని చెప్పారు. విద్యాశాఖ కమీషనరేట్ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు దాసోహం అయిందని తెలిపారు. ఆన్‌లైన్ వెబ్‌కౌన్సిలింగ్, 5% బాహ్య మూల్యాంకనం, ఉపాధ్యాయులకు ప్రతిభా పరీక్ష, మధ్యాహ్న భోజనం వివరాల సంక్షిప్త సమాచారాలు అంటూ నూతన విధానాలతో విద్యాశాఖలో పాలన కొనసాగుతోందని విమర్శించారు. ఉపాధ్యాయుల నైపుణ్యం, శిక్షణా తరగతులపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. భాషా పండిట్ల స్థాయి పెంపుదలలో ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయాలని సూచించారు. ఎయిడెడ్ పాఠశాలలోని ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. డిఏ, పిఆర్‌సి, వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాలుగు మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు రాఘవేంద్ర, పుల్లయ్య, నారాయణరెడ్డి, చెన్నయ్య, జయరామయ్య, అల్లాబకాష్, సుబ్బారెడ్డి, మురళీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కర్నూలు జిల్లా**

**ఎమ్మిగనూర్ :**

**విద్యారంగాన్ని కార్పొరేటీకరించడం తగదు**

అక్టోబర్ 24న కుర్ని కళ్యాణ మండపంలో జిల్లాస్థాయి నూతన విద్యా విధానం ముసాయిదాపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి ఎల్లప్ప అధ్యక్షతన వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న యుటియఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎన్.నర్సింహుడు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన విద్యా విధానం ముసాయిదా ప్రస్తుత విద్యారంగాన్ని కార్పొరేటీకరించేదిగా ఉందన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో రాష్ట్రంలో 10వేల పోస్టులు ఖాళీగా ఉండే అవకాశం ఉందన్నారు. భవిష్యత్తులో విద్యా వ్యవస్థను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా అధ్యక్షులు డి.రామశేషయ్య, నాగమణి, నాగరాజు, దావీదు, జ్ఞానప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## నూతన విద్యా విధానం ముసాయిదాను సవరించాలి

నూతన విద్యా విధాన ముసాయిదాను సవరించాలని, విద్య కార్పొరేటీకరణను విరమించుకోవాలని ప్రముఖ విద్యావేత్త, మాజీ శాసనమండలి సభ్యులు కెఎస్ లక్ష్మణరావు అన్నారు. యుటియఫ్ నగరశాఖ ఆధ్వర్యంలో నగరంలోని మాంటిస్సోరి కళాశాల ఆడిటోరియంలో అక్టోంబర్ 21న చెన్నుపాటి ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ గ్లోబలైజేషన్‌లో భాగంగా నూతన పోకడలు ప్రభుత్వ విద్య వినాశనానికి దారితీస్తుందన్నారు. విద్య ఎల్లప్పుడూ ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని సూచించారు.

శాసనమండలి సభ్యులు బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ దశలవారీగా విద్య ప్రైవేటీకరణ చేసే విధానాలను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. పేద, మధ్య తరగతి వర్గాల వారికి విద్య అందాలంటే ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా 2015-16 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులను, వివిధ సబ్జెక్టుల్లో నూరు శాతం సాధించిన 320మంది ఉపాధ్యాయులను సత్కరించారు.

ఈ కార్యక్రమంలో యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబు రెడ్డి, నగరశాఖ అధ్యక్షులు ఏవిఎన్ఆర్ మూర్తి, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కె.మల్లిఖార్జునరెడ్డి, కృష్ణ జిల్లా అధ్యక్షులు ఎస్‌పి మనోహర్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా, మండల/పట్టణ కౌన్సిల్ సమావేశాలు

## శ్రీకాకుళం జిల్లా

### కోటబొమ్మాళి :

**సిపిఎస్ రద్దు కోరుతూ "చలో ఢిల్లీ" కార్యక్రమాన్ని జయప్రదం చేయండి**

అక్టోబర్ 31న మండల కౌన్సిల్ సమావేశం మండల శాఖ అధ్యక్షులు వై.వాసుదేవరావు అధ్యక్షతన జరిగింది. సిపిఎస్ రద్దు కోరుతూ నవంబర్ 29న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని యుటియఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఆ కార్యక్రమంలో ఉపాధ్యాయులందరూ పాల్గొని జయప్రదం చేయాలని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ పిలుపునిచ్చారు. యుటియఫ్ మండల కౌన్సిల్ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. 398 రూపాయల వేతనంతో పనిచేసిన ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ఉమ్మడి సర్వీస్ నిబంధనలను అమలు చేయాలని జిల్లా గౌరవాధ్యక్షులు కామేశ్వరరావు మాట్లాడారు. అనంతరం మండల కార్యవర్గం ఎన్నికలు కె.వైకుంఠరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో యుటియఫ్ నాయకులు ఎస్.సంజీవరావు, ఆర్ఆర్ పట్నాయక్, మోద గోవిందరావు, కింజరపు రామకృష్ణ, నక్క అప్పయ్య, యర్నాగుల వాసుదేవరావు, జి.నారాయణ, చంద్రమోహన్, కరజాన భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## తూర్పుగోదావరి జిల్లా

### మామిడికుదురు :



మామిడికుదురు విద్యా వనరుల కేంద్రంలో యుటియఫ్ మామిడికుదురు మండలశాఖ నూతన కౌన్సిల్ సమావేశం అక్టోబర్ 22న మండలశాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించబడినది. ఈ సమావేశనమునకు ముఖ్య అతిథిగా జిల్లా ప్రధానకార్యదర్శి టి. కామేశ్వరరావు విచ్చేసి "నూతన విద్యా విధానం-తీరు తెన్నులు" అనే అంశంపై ప్రసంగించారు. తరువాత జిల్లా ఉత్తమ అవార్డు పొందిన వై.వి.వి.ఎం. సత్యనారాయణ మూర్తి (మదన్), రాష్ట్ర ఉత్తమ పాఠశాల అవార్డు గ్రహీత పి.శ్రీనివాస్, డాక్టరేట్ డిగ్రీ పొందిన గుర్రం ధమ్మాజీ రావులను సన్మానించుట జరిగినది. ఈ కార్యక్రమంలో సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సిసిఇ విధానంలో జంబ్లింగ్ విధానాన్ని రద్దు చేయాలని, తనిఖీ బృందాల పేరుతో పాఠశాలలపై దాడులను ఆపాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ పి.వి.వి.సత్యనారాయణ, వివిధ పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### తుని :

యుటియఫ్ తుని పట్టణశాఖ అధ్యక్షులు ఎ.బాపన్న అధ్యక్షతన నూతన కౌన్సిల్ సమావేశం అక్టోబర్ 27న జరిగినది. యుటియఫ్ జిల్లా కార్యదర్శులు ఆర్వి రమణమూర్తి, జి.అప్పలనాయుడు, విజయ గౌరిలు హాజరయినారు. సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ ఇవ్వాలని, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, టీచర్లు అంకిత భావంతో పని చేయాలని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని వక్తలు కోరారు. అనంతరం జరిగిన నూతన కమిటీ కార్యకర్తలు మొత్తం మహిళలతో ఏకగ్రీవంగా ఎన్నికైంది. కమిటీలో మొత్తం మహిళలు ఎన్నికవటం పట్ల జిల్లా కార్యదర్శి జి.అప్పలనాయుడు, కెవి రమణ, ఎ.బాపన్న, బి.రామకృష్ణ తదితరులు అభినందించారు.

### రాజోలు :



యుటియఫ్ రాజోలు మండల శాఖ నూతన కౌన్సిల్ సమావేశం స్థానిక మండల వనరుల కేంద్రలో నవంబర్ 1న జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి టి.కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు ఎన్.విశ్వనాథ్, బేతినీడి శ్రీనివాసులు పాల్గొని ప్రసంగించారు. సమావేశంలో ఇటీవల పదవీ విరమణ పొందిన అప్పారి ఉదయ భాస్కరరావుని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్.పుల్లయ్య, బి.రాచయ్య, అడబాల కాశీ, జి.బృహస్పతి, సిహెచ్‌వి రమణ రావు, యెరుబండి ప్రసాద్, గుబ్బల శ్రీనివాస్, అప్పారి దుర్గా ప్రసాద్, జివి భాస్కరరావు, కెవిఎస్ఎన్ బాబు, కె.రామదుర్గారావు, ఎ.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

### జగ్గంపేట :



జగ్గంపేట మండల యుటియఫ్ శాఖ నూతన కార్యవర్గం ఎంపిక సమావేశం స్థానిక నెహ్రూ యుటియఫ్ హోంనందు మండలశాఖ అధ్యక్షులు పివివి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించబడినది. ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి ఎంవి సాయిరామ్ వార్షిక

నివేదికను, కుటుంబ సంక్షేమ కార్యదర్శి వి.శివశంకర్, పత్రికా కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, కోశాధికారి జి.వెంకటేశ్వరరావు తమ తమ నివేదికలను ప్రవేశపెట్టుట జరిగింది. వీటిపై సభ్యులు చర్చ తదనంతరం ఆమోదించటం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా గౌరవాధ్యక్షులు ప్రభాకరవర్మ ప్రసంగిస్తూ రాష్ట్రంలోను, జిల్లాలోను, మండలంలోను అతిపెద్ద ఉపాధ్యాయ సంఘం యుటియఫ్ అని. యుటియఫ్ ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిరంతరం పోరాడుతుందని అన్నారు. నవంబర్ 29న సిపిఎస్‌కు వ్యతిరేకంగా నిర్వహించే 'ఛలో ఢిల్లీ' కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపు ఇవ్వడం జరిగింది.

## కృష్ణా జిల్లా

### రెడ్డిగూడెం :



కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నూతన విద్యా విధానం కార్పోరేట్ శక్తులను పెంచి పోషించేదిగా, పేద మధ్య తరగతి ప్రజలకు చదువును దూరం చేసే విధంగా ఉందని కృష్ణా,గుంటూరు జిల్లాల శాసనమండలి సభ్యులు బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. అక్టోబర్ 25న విస్సన్నపేట హైస్కూల్‌నందు రెడ్డిగూడెం, విస్సన్నపేట, చాట్రాయి మండలాల నూతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఆ సందర్భంగా ఉపాధ్యాయుల నుద్దేశించి నాగేశ్వరరావు మాట్లాడుతూ సామాజిక స్పృహ కల్గిన ఉపాధ్యాయులు విద్య ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సిపిఎస్ విధానానికి వ్యతిరేకంగా మొట్టమొదటగా ఉద్యమం ప్రారంభించింది యుటియఫ్ సంఘమేనని తెలిపారు. సిపిఎస్ విధానానికి వ్యతిరేకంగా జరిగే అన్ని పోరాటాలకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అండగా ఉండి ఆ పోరాటాల్లో పాల్గొంటామని తెలిపారు.

యుటియఫ్ కృష్ణా జిల్లా అధ్యక్షులు ఎస్‌పి మనోహర్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలని చూస్తోందన్నారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించకుండా డిజిటల్ తరగతులు ప్రారంభించడం వల్ల ప్రయోజనం లేదన్నారు. కార్యక్రమంలో స్థానిక శాఖల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### తిరువూరు :



తిరువూరు స్థానిక సత్య డిఎడ్ కాలేజీనందు ఎస్.త్రినాథ్ అధ్యక్షతన యుటియఫ్ తిరువూరు మండల మహాసభ జరిగినది. ఈ సభకు ముఖ్య అతిథిగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు ఎస్‌పి మనోహర్‌కుమార్, కోశాధికారి ఎ.కృష్ణసుందర రావు, రాష్ట్ర కౌన్సిలర్లు మచ్చా శ్రీనివాస్, డి.అపర్ణ, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పి.శినయ్య, ఎన్నికల అధికారిగా ఎ.భగీరథీ పాల్గొన్నారు. నూతన విధానంపై నాగేశ్వరరావు ప్రసంగించారు.

### నాగాయలంక :



ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకొంటూ ఉపాధ్యాయుల శ్రేయస్సు కోసం పాటుపడుతున్న యుటియఫ్‌లో సభ్యులుగా చేరి విద్యారంగ, ఉపాధ్యాయ ఉద్యమాలలో పాల్గొనాలని యుటియఫ్ కృష్ణ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఎ.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. 2016-17 సం॥నికిగానూ యుటియఫ్ నాగాయలంక మండలశాఖ వార్షిక కౌన్సిల్ సమావేశం స్థానిక యుటియఫ్ భవన్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హాజరైన పలువురు జిల్లా, రాష్ట్ర నేతలు తమ సందేశాలు ఇచ్చారు. సిపిఎస్ విధానం తక్షణమే రద్దు చేయడానికి ప్రభుత్వం కృషి చేయాలి, పిఆర్‌సి, డిఏ పాత బకాయిలు వెంటనే చెల్లించాలి, సిసిఇ, మూల్యాంకన విధానంలో మార్పులు చేయాలి, ప్రశ్నపత్రాలను అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే తయారు చేయించాలి, నూతన విద్యా విధానంలో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అన్యాయం జరిగే కొన్ని అంశాలను తొలగించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజి గోపాలకృష్ణప్ప, జిల్లా కార్యదర్శులు కనకారావు, శివకోటేశ్వరరావు, లెనిన్, రాధాకృష్ణ వివిధ మండలాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పాల్గొన్నారు.

## గుంటూరు జిల్లా

### తుళ్ళూరు :

తుళ్ళూరు మండల శాఖ కౌన్సిల్ సమావేశం అక్టోబర్ 15న కా॥ దాచూరి రామిరెడ్డి ప్రాంగణం (మండల పరిషత్ బాపూజీ ప్రాథమిక పాఠశాల) మండల శాఖ అధ్యక్షులు ఎం.సతీష్ అధ్యక్షతన జరిగింది. ముందుగా యుటియఫ్ పతాకాన్ని రిటైర్డ్ మండల సీనియర్ నాయకులు కొండవీటి రాజయ్య ఆవిష్కరించారు. ముఖ్య అతిథి మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతోపాటు, సరియైన మార్గ దర్శనం చేయాలని, వారిని మంచి పౌరులుగా సమాజానికి అందిం చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఉపాధ్యాయులు అందరూ సామాజిక బాధ్యతతో పనిచేయాలని తెలిపారు.

మరొక ముఖ్య అతిథి ఐక్యఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు ఎన్.కుమార్‌రాజా మాట్లాడుతూ నవంబర్ 29న జరిగే సిపిఎస్ విధానాన్ని రద్దు కోరుతూ చేపట్టిన 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యదర్శి నివేదికను మండల ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, ఆర్థిక నివేదికను కోశాధికారి

సిహెచ్ శ్రీనివాసరావు ప్రవేశపెట్టారు. నివేదికలను చర్చ అనంతరం ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగింది.

అనంతరం నూతన కమిటీ ఎన్నికల ఏకగ్రీవంగా జరిగినది. ఎన్నికల అధికారిగా జిల్లా ఆడిట్ కన్వీనర్ కె.రవిచంద్రశేఖర్ వ్యవహరించారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో పదోన్నతిపొందిన, పదవీ విరమణ చేసిన, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఉపాధ్యాయులకు అభినందన కార్యక్రమం జరిగింది.

**నెల్లూరు జిల్లా**

### సూళ్ళూరుపేట :



నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేటలో అక్టోబర్ 16న తడ, సూళ్ళూరుపేట, దొరవారి సత్రం మండల శాఖల ఆధ్వర్యంలో ప్రాంతీయ విద్యా సదస్సు స్థానిక అలవలవారి కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సదస్సుకు పట్టభద్రుల శాసనమండలి సభ్యులు యండపల్లి శ్రీనివాసులు రెడ్డి యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు, ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి సి.చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు పాల్గొన్నారు.

పతాకావిష్కరణ కార్యక్రమంలో జాతీయ జెండాను యండపల్లి శ్రీనివాసులురెడ్డి, యుటియఫ్ పతాకాన్ని సీనియర్ నాయకులు బాబా సాహెబ్ ఆవిష్కరించిరి. సూళ్ళూరుపేట అధ్యక్షులు కె.ప్రభాకర్ ఆహ్వానం పలుకగా యుటియఫ్ జిల్లా సహాధ్యక్షులు జిజె రాజశేఖర్ సదస్సుకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంఘం అనేది ఉపాధ్యాయులకు అవసరం అని, సంఘంలో సభ్యులుగా చేరడంతోపాటు సంఘం ఇచ్చే ప్రతి పిలుపుకు స్పందించాలని, విరాళాలు ఇవ్వడంలో వెనుకంజ వేయకూడదని, గత నాయకులు త్యాగాల ఫలితాలను మనం అనుభవిస్తున్నట్లే మనం కూడా పోరాటాల ద్వారా ప్రయోజనాలను సాధించి మన తర్వాతి తరం వారికి అందించాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్సీ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ గత 10 సంవత్సరాల నుండి శాసనమండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలుగా తాము వివిధ సందర్భాలలో చేసిన ప్రాతినిధ్యాలు, సమస్యలపై ప్రభుత్వానికి వెలుపల చేసిన పోరాటాలు, ధర్నాలు, నిరాహారదీక్షల ద్వారా విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు.

రాష్ట్ర కార్యదర్శి సి.చంద్రశేఖర్ 2016 నూతన విద్యా విధానం ముసాయిదా, అందులో ప్రభుత్వం విద్య పట్ల ప్రదర్శించబోతున్న విధానాలను వివరించారు. జిల్లా ప్రధానకార్యదర్శి నవకోటేశ్వరరావు సంఘ ఔనత్యాన్ని గురించి మాట్లాడారు. తడ అధ్యక్షులు బాబు వందన సమర్పణ చేశారు.

### నాయుడుపేట :

నాయుడుపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాటశాలలో నాయుడుపేట, ఓజిలి, పెళ్ళకూరు మండల శాఖల ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి యం.రామమూర్తి అధ్యక్షతన ప్రాంతీయ విద్యా సదస్సు మరియు మండల కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సి.చంద్రశేఖర్ మరియు జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు హాజరైనారు.



రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పట్ల యుటియఫ్, జెఏసి, ఫ్యాప్టో ఉమ్మడి ఉద్యమాల ద్వారా పోరాడే విధానం, సిపిఎస్ సమస్య జాతీయ సమస్య అన్ని సంఘాల ఉమ్మడిగా దేశ వ్యాప్తంగా పోరాడి సాధించుకోవాలని తెలియజేశారు.

ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ శాసనమండలిలో యుటియఫ్ ఎమ్మెల్సీలు ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలపట్ల పనిచేసే విధానం, శాసనమండలి యుటియఫ్ ఎమ్మెల్సీల అవసరం గురించి తెలియజేశారు.

రాష్ట్ర కార్యదర్శి సి.చంద్రశేఖర్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం ముసాయిదా గురించి, జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు జిల్లా ఉపాధ్యాయుల సమస్యల పట్ల యుటియఫ్ పోరాడే విధానం, జిల్లాలో నిర్వహించే స్టడీ సర్కిల్స్‌ను గురించి తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మూడు మండలాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బెన్నీ, సుబ్బారావు, సాయిమోహనరెడ్డి, వాసు, సుబ్బరామయ్య, గురునాథం, సీనియర్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి మరియు శివప్రసాద్, సురేంద్ర, సోమశేఖర్, అశోక్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

### గూడూరు :



యుటియఫ్ గూడూరు ప్రాంతీయ శాఖల ఆధ్వర్యంలో విద్యా సదస్సు మరియు కౌన్సిల్ సమావేశం జిల్లా కార్యదర్శి జి.వెంకటరత్నం అధ్యక్షతన అక్టోబర్ 16న గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి సి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్య

లను పోరాటాల ద్వారానే సాధించుకోగలమని అన్నారు. 2004 సంవత్సరం నుండి అమలువుతున్న సిపిఎస్ పద్ధతిని ప్రభుత్వాలు రద్దుచేసి, ఉద్యోగ విరమణ అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయులకు కనీస ఆర్థిక భద్రత కల్పించాల్సి ఉందని తెలిపారు.

యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి సి.చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్య వ్యాపారీకరణకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలని తెలిపారు. నూతన విద్యావిధానంపై ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించు కోవాలసిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు.

ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ మొదట నుండి యుటియఫ్ అంటే తనకు చాలా గౌరవం ఉందని, పోరాటాలకు మారుపేరు యుటియఫ్ అని తెలిపారు. ఈ సంఘంలో పనిచేసే ఉపాధ్యాయులు కూడా సైనికుల్లా పనిచేస్తుంటారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్స్ డి.గోపాల్, టి.వాసుదేవరావు, టి.శశికళ, జనార్ధనం, ఐదు శాఖల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సుధీర్, మస్తాన్, బాబ్జి, హరిబాబు, ప్రాణేష్‌రావు, రవి, అనిల్, శ్రీనివాసులు మరియు సీనియర్ నాయకులు పురుషోత్తమరావు, వెంకటయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

**బుచ్చిరెడ్డిపాలెం :**



నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాలెంలోని ఎస్ఎస్ కళ్యాణ మండపం నందు బుచ్చిరెడ్డిపాలెం, సంగం మరియు దగదర్తి మండల శాఖల ఆధ్వర్యంలో ప్రాంతీయ విద్యా సదస్సు మరియు మండల మహాసభలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రహ్మణ్యం, యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి మరియు జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరైనారు.

ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాయడాన్ని తప్పుబట్టారు. నూతన జాతీయ విద్యా విధానంలోని పలు అంశాలు ఆమోదించదగ్గవి కావని, వాటికి వ్యతి రేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

పి.బాబురెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విద్యారంగంలో వస్తున్న పలు మార్పులను గురించి ప్రసంగించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సమా యత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నటరాజ కళా మండలి విద్యార్థినులు నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఉత్తమ ఉపాధ్యాయులను, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను బాలసుబ్రహ్మణ్యం మరియు బాబురెడ్డిలు ఈ సందర్భంగా వారిని సన్మానించారు. జిల్లా నాయకులు కె.నాగిరెడ్డి, జి.వి.భాస్కర్, ఎస్కె ఖాజావలి, డి.గోపాల్, ఓ.వెంకటేశ్వరరావు, వివి శేషులు, వీరేంద్ర, ఎన్‌వి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం నూతన కార్యవర్గాలు మండలాల వారీగా ఎన్నుకోవడం జరిగింది.

## కర్నూలు జిల్లా

**కొత్తపేట :**

**ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం**

చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరి అవలంభిస్తున్నదని యుటియఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎన్.నరసింహులు అన్నారు. స్థానిక కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో మండల శాఖ అధ్యక్షుడు ఎస్.అన్వర్‌బాష అధ్యక్షతన మండల విస్తృత కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ సర్వీస్‌రూల్స్ విషయంలో ప్రభుత్వం చొరవ చొరవచూపి, ఆ సమస్యను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని తీసుకొని రాష్ట్రపతి ఆమోద ముద్ర వేయించాలని కోరారు.

జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్‌కుమార్ మాట్లాడుతూ త్వరలో జరుగబోవు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించే వారినే ఎన్నుకోవాలని ఉపాధ్యాయులను కోరారు. వివిధ రకాల కారణాలతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడాన్ని తక్షణమే మానుకోవాలని జిల్లా అధ్యక్షులు డి.రామశేషయ్య డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు బి.మాణిక్యంశెట్టి, జిల్లా కార్యదర్శులు కె.లక్ష్మయ్య, బివై సుబ్బరాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ ఎన్ఎస్ బాబు, నాయకులు ప్రసాదరెడ్డి, కేశవరెడ్డి, సంజీవనాయుడు, డి.రమేష్, ఎం.బోజ్జన్న, జి.వెంకటేశ్వరరెడ్డి, ఎ.లక్ష్మికాంతారెడ్డి, ఎస్ఏ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

**డోన్ :**

డోన్ మండల యుటియఫ్ నూతన కార్యవర్గ సమావేశం స్థానిక కొత్తపేట ప్రాథమిక పాఠశాలనందు మండలశాఖ అధ్యక్షులు ఎస్. అన్వర్‌బాష అధ్యక్షతన జరిగింది. యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్‌కుమార్ ఎన్నికల అధికారిగా, పర్యవేక్షకులుగా జిల్లా అధ్యక్షులు డి.రామశేషయ్య వ్యవహరించారు.

**పెదకడమూరు :**



సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని యుటియఫ్ జిల్లా అధ్యక్షులు డి.రామశేషయ్య డిమాండ్ చేశారు. పెదకడమూరు కౌన్సిల్ సమావేశం నవంబర్ 8న జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎస్ విధానంతో ఉపాధ్యాయ, ఉద్యోగులు ఆర్థిక భరోసా కోల్పోతారన్నారు. ఎంఇఓ, డివైఈఓ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు హుసేనప్ప, రాజు, రఫీక్, నాగలక్ష్మీ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురం జిల్లా


**వజ్రకరూరు :**

యుటియఫ్ వజ్రకరూరు ప్రాథమిక పాఠశాలలో యుటియఫ్ మండల మహాసభలు జరిగాయి. ఈ మహాసభకు స్థానికశాఖ అధ్యక్షులు రామప్ప అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులు జిల్లా అధ్యక్షులు

ఎం.సుధాకర్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఆర్.సలాఉద్దిన్, విడపనకల్లు ప్రధానకార్యదర్శి బండయ్య, ఉరవకొండ అధ్యక్షులు సంజీవ పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులు సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, ప్రభుత్వం విద్యను ప్రజల సంక్షేమంగా చూడాలని, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ చేయడం సరైనది కాదని అన్నారు. సిపిఎస్ విధానం రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, సిపిఎస్ రద్దుకై నవంబర్ 29న ఎస్‌టిఎఫ్‌ఐ, యుటియఫ్ ఆధ్వర్యంలో జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఆడిట్ సభ్యులు సలా ఉద్దిన్ మాట్లాడుతూ హెల్త్‌కార్డ్స్ పూర్తిస్థాయిలో అమలు చేయాలని, విద్యా సంవత్సరం మధ్యలో రేషనలైజేషన్ ఆపాలని డిమాండ్ చేశారు. గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులందరూ ఓటరుగా నమోదు కావాలని సూచించారు. తదనంతరం మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది.



## అనంతపురం జిల్లా నూతన భవన ప్రారంభోత్సవం




ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ అనంతపురం జిల్లాశాఖ నూతన భవనము అక్టోబర్ 5వ తేదీన రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వర రావు ప్రారంభిం చారు. మీటింగ్ హాలును ఎమ్మెల్సీ డా॥ఎం. గేయా నంద్ ప్రారంభించారు. ప్రారం భోత్సవ కార్యక్ర మంలో సీనియర్ నాయకులు ఎంఏకె దత్తు, టి.ఇమా మ్‌సాహెబ్, రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎన్. నరసింహుడు తదితరులు పాల్గొన్నారు. నూతన భవనమునకు సంఘానికి ఎనలేని కృషి చేసిన అమరజీవి పిఎం ఖాన్ పేరును పెట్టడము జరిగినది. ఈ కార్యక్రమంలో పిఎం ఖాన్ సతీమణి పి.ముంతాజ్‌బేగం వారి కుటుంబ సభ్యులు హాజరైనారు.

రాష్ట్ర కార్యదర్శి ఎస్.మహమ్మద్ జిలాన్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సుధాకర్, కె.నాగేంద్ర, సహాధ్యక్షులు ఎస్‌వివి రమణయ్య, జి.ఉషారాణి, కోశాధికారి బి.రామకృష్ణ, జిల్లా కార్యదర్శు లు, స్థానిక పట్టణ, మండల శాఖల నాయకులు, కార్యకర్తలు, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు. సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు, సంఘ అభిమానులు దాదాపు 550మంది హాజరై నూతన భవన ప్రారంభోత్సవమును విజయవంతం చేశారు.

### ఆలమూరు మండల శాఖచే ఆరోగ్య శిబిరం

ఆలమూరు టైన్‌హాల్, ఆలమూరునందు ఉచిత వైద్య శిబిరాన్ని అక్టోబర్ 1న యుటియఫ్ ఆలమూరు మండల శాఖ నిర్వహించింది. రాయల్ హాస్పిటల్, రమా డెంటల్ హాస్పిటల్, ఆకీరా ఐ హాస్పిటల్, కమలాకర్ హాస్పిటల్ రాజమండ్రిల నుండి వైద్యులు, సిబ్బంది ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు ఆరోగ్యకార్డులపై ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆలమూరు ఎంపిపి కె.వెంకటలక్ష్మి శిబిరాన్ని ప్రారంభించారు. జెడ్‌పిటిసి సభ్యులు డి.మమత, యంఆర్ఓ డి.రాజేశ్వ రరావు, యంపిడిఓ నాతి బుజ్జి, ఎంఇఓ ఐ.రాజేశ్వరరావు తదితరులు పాల్గొని యుటియఫ్ ఆలమూరు మండల శాఖ చేస్తున్న సేవలను కొనియాడారు. ఆలమూరు మండలశాఖ బాధ్యులు వైవి రమణ, జి. ప్రసాదరావు, పి.శ్రీనివాసరావు, కెవిఆర్ బాపూజీ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### మండపేట మండల మరియు పట్టణ శాఖలచే ఆరోగ్య శిబిరం

ప్రభుత్వ జూనియర్ కళాశాల, మండలపేటనందు అక్టోబర్ 16న ఉచిత వైద్య శిబిరాన్ని యుటియఫ్ మండల మరియు పట్టణ శాఖలు సంయుక్తంగా నిర్వహించాయి. రాయల్ హాస్పిటల్, రమా డెంటల్ హాస్పిటల్, గౌతమి ఐ హాస్పిటల్ రాజమండ్రిల నుండి వైద్యులు, సిబ్బంది ఉద్యోగులకు, ఉపాధ్యాయు లకు, పెన్షనర్లకు ఆరోగ్యకార్డులపై ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. మండల పేట నియోజకవర్గ శాసనసభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు శిబిరాన్ని ప్రారంభించారు. మండపేట మున్సిపల్ చైర్మన్ చుండ్రు వరప్రకాష్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి తదితరులు పాల్గొని యుటియఫ్ మండపేట మండల శాఖ మరియు పట్టణ శాఖలు చేస్తున్న సేవలను కొనియాడారు. మండపేట మండలశాఖ మరియు పట్టణ శాఖ బాధ్యులు ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, డి.శ్రీనివాస రావు, గంటి వీర్రాజు, కె.గోపాలకృష్ణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు పిఆర్‌సి అమలుకై నవంబర్‌లో పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ ముట్టడి

ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం అక్టోబర్ 16న బి.సోమయ్య విజయవాడలోని యుటియఫ్ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 10వ పిఆర్‌సి అమలు చేయాలని కోరుతూ నవంబర్ నెలలో విద్యాశాఖ డైరెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడి చేయాలని రాష్ట్ర కమిటీ తీర్మానం చేసింది.

గత సంవత్సరకాలం నుండి పిఆర్‌సి అమలు, సర్వీస్ రూల్స్, హెల్త్‌కార్డుల విడుదల, పెన్షన్ స్కీమ్ వర్తింపు తదితర సమస్యల పరిష్కారం కోరకు ధర్నాలు, నిరాహార దీక్షలు చేపట్టినప్పటికి ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని అభిప్రాయపడింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల న్యాయపరమైన డిమాండ్‌లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరింది.

# 2016-17 సం॥నకు మండల శాఖల నూతన కమిటీ సభ్యులు

| క్ర. సం. | మండలం | గౌరవాధ్యక్షులు | అధ్యక్షులు | సహాధ్యక్షులు | సహాధ్యక్షులు | ప్రధానకార్యదర్శి | కోశాధికారి |
|---|---|---|---|---|---|---|---|
| | | | **శ్రీకాకుళం జిల్లా** | | | | |
| 1. | కోటబొమ్మాళి | ఆర్ఆర్ పట్నాయక్ | వై.వాసుదేవరావు | జి.నారాయణరావు | కె.రామకృష్ణ | పి.లలిత కుమారి | ఆర్.రాంప్రసాద్ |
| | | | **తూర్పుగోదావరి జిల్లా** | | | | |
| 1. | తుని | వి.పద్మావతి | ఎ.ఎన్.డి.లలితమ్మ | ఎస్.భానుమతి | బి.చిన్నిశ్యామ | కె.రేవతి | వి.ఎన్.దేవి |
| 2. | రాజోలు | సి.దుర్గాప్రసాద్ | ఉండవల్లి శ్రీనివాస్ | జి.శ్రీనివాస్ | కె.శకుంతల | కె.రామ్‌కుమార్ | జె.తాతారావు |
| 3. | జగ్గంపేట | జి.రాజేంద్రప్రసాద్ | పివి.సత్యనారాయణ | డి.రూత్ మార్గరేట్ | పి.సూర్యనారాయణ | ఎం.వెంకటసాయిరామ్ | జి.వెంకటేశ్వరరావు |
| | | | **కృష్ణా జిల్లా** | | | | |
| 1. | రెడ్డిగూడెం | టి.బాలభాస్కరరావు | డి.లక్ష్మీపతి | కె.రవిబాబు | పి.భవాని | బిహెచ్‌వి సూర్యనారాయణ | ఇ.నాగేశ్వరరావు |
| 2. | తిరువూరు | ఎస్‌కె బాజీ | పి.నాగేశ్వరరావు | ఎం.సుధాకర్ | బి.మృదుల | ఎన్.ముత్తయ్య | జి.రవిబాబు |
| 3. | నాగాయలంక | డిఎస్ఎస్ భట్టార్ | బి.సాంబశివరావు | ఎన్ఎన్ స్వామి | టివి జ్యోతి | డి.నవజీవన్ | ఎం.వెంకటేశ్వరరావు |
| 4. | మోపిదేవి | పి.చిన్నబ్బాయి | జి.శ్రీధర్ | ఎం.సుధారావు | పి.వి.వర్మ | ఎన్ఆర్‌కెవి ప్రసాద్ | బిఎల్ నారాయణ |
| 5. | పమిడిముక్కల | ఎన్ఏకె స్వామి | జిఎల్‌వి ప్రసాద్ | ఐ.దుర్గాప్రసాద్ | కెఆర్ లక్ష్మి | ఎంవి సత్యనారాయణ | ఎస్.సుధాకర్ |
| 6. | పెనమలూరు | యుహెచ్ సుమంత్ | జివి గంగాధర్ | వి.వెంకటేశ్వరరావు | పి.మాలతీదేవి | జి.లక్ష్మీప్రసాద్ | కె.సుధాకర్ |
| 7. | మైలవరం | కె.గంగరాజు | టి.శ్రీనివాసరావు | బివి నాయక్ | జి.సూర్యకుమారి | వై.జాన్ | పి.రవిబాబు |
| 8. | పెనుగంచిప్రోలు | ఎం.ప్రసాదరావు | ఎం.ప్రశాంత్‌కుమార్ | సిహెచ్ రామారావు | ఎం.రామతులసమ్మ | కెవి సుబ్బారావు | బి.వెంకటేశ్వర్లు |
| 10. | చాట్రాయి | ఎం.మట్టయ్య | జె.చంటి | కె.చంటిబాబు | కె.లావణ్య | జి.సత్యనారాయణరెడ్డి | పి.రత్తయ్య |
| 11. | విస్సన్నపేట | పి.వీరకోటి | బి.సత్యనారాయణరెడ్డి | వి.కిషోర్‌కుమార్ | జి.ఇస్తరరాణి | జి.నాగేశ్వరరావు | ఎ.శ్రీనివాసరావు |
| 12. | ముసునూరు | కె.రాజు | పిఆర్ఎల్ కుమార్ | సిహెచ్ జాకబ్‌రాజు | డి.వసంతలక్ష్మి | వి.వినయ్ | ఎల్.వెంకన్నబాబు |
| 13. | నూజివీడు | కె.గంగేయుడు | జి.పద్మకిషోర్ | ఎ.కోటేశ్వరరావు | కె.పద్మావతి | బిఎస్ పార్ధసారధి | టి.హరిప్రసాద్ |
| 14. | బాపులపాడు | వి.చిన్నప్ప | కె.తాతబాబు | డిపి దస్తగిరి | డిఎన్ఎస్ కుమారి | కె.దుర్గారావు | బి.నాగరాజు |
| | | | **గుంటూరు జిల్లా** | | | | |
| 1. | తుళ్ళూరు | ఎ.రఘునాథ్ | ఎ.శ్రీనివాసరావు | పి.అరుణ్‌కుమార్ | జె.రత్నజ్యోతి | ఎం.సతీష్ | సిహెచ్.శ్రీనివాసరావు |
| 2. | రాజుపాలెం | ఎస్.విజయరాజు | ఎం.బురాన్ | బి.ఎస్.ఎం.నాయక్ | ఎస్.మాధవీలత | సిహెచ్.ఆదినారాయణ | ఎం.రాజకిషోర్ |
| 3. | బెల్లంకొండ | ఎస్‌కె సైదా | ఎ.బాలసుబ్రహ్మణ్యం | కె.శ్రీనివాసరావు | ఎ.రమాదేవి | కె.రంగారావు | ఎస్‌డి బుడేసాహెబ్ |
| 4. | కర్లపాలెం | కెఎం నవరత్న కుమారి | బి.భానుప్రకాష్ | పి.వెంకటేశ్వర్లు | జి.అరుణకుమారి | ఎండి అక్రమఘోరీ | సిహెచ్.ప్రభాకర్ |
| 5. | నగరం | వైకె గురవయ్య | ఐ.శ్రీనివాసరావు | కె.రాంబాబు | టి.ఉదయభాను | ఎంవిబి సుబ్రహ్మణ్యం | పివిఆర్ఆర్ విఠల్ |
| 6. | క్రోసూరు | ఎం.ముసలారెడ్డి | బి.శ్రీనివాసరావు | బివి శేషిరెడ్డి | కె.ఉషశ్రీ | జి.వెంకటేశ్వరరావు | జి.గురునాథం |
| 7. | బాపట్ల | పి.సుబ్రహ్మణ్యం | ఎ.వెంకటరెడ్డి | కె.రవిబాబు | ఎస్.శివపార్వతి | ఎం.సురేష్ | ఎ.వెంకటేశ్వర్లు |
| 8. | చెరుకుపల్లి | జె.శ్రీనివాసరావు | పి.రాంబాబు | కె.లక్ష్మీనారాయణ | టి.అనుపమ | ఎస్‌కె షంషుద్దీన్ | బి.ఏకాంబరాచారి |
| 9. | పెదకూరపాడు | డి.కోటేశ్వరరావు | ఎస్‌కె జాన్‌సైదా | జి.ఉమామహేశ్వరరావు | ఎం.పద్మావతి | కె.ప్రేమ్‌కుమార్ | ఎండి రభీబుద్దీన్ |
| 10. | ఎడ్లపాడు | కెఎస్ఎన్ మల్లేశ్వరావు | ఎం.చింతయ్య | వి.శ్రీనివాసరావు | ఎ.సునీత | జి.వెంకటేశ్వర్లు | పి.హనుమసూరి |
| 11. | గురజాల | సిహెచ్.రాజేశ్ | డి.కాంతారావు | ఎస్‌కె బాజి | ఎం.విజయశాంతి | ఎం.సైదారావు | జెవిజె రాజ్‌కుమార్ |
| 12. | అమృతలూరు | బిజెపి వర్ధన్ | ఎస్.సురేష్ | వి.రామ్‌ప్రసాద్ | ఎంఎస్ కోకిలామణి | ఎం.శ్రీనివాసరావు | టి.హరిబాబు |
| | | | **నెల్లూరు జిల్లా** | | | | |
| 1. | బుచ్చిరెడ్డిపాలెం | ఎం.పుల్లయ్య | కెవి శ్రావణ్‌కుమార్ | టి.గోపాలకృష్ణమూర్తి | ఎం.వజ్రమ్మ | ఎ.చినకోటయ్య | జి.వంశీచరణ |
| 2. | సంగం | బి.బలబ్రహ్మం | ఎస్.నాగామల్లికార్జున | ఎస్‌కె ముంతాజ్‌బేగం | సివి కృష్ణయ్య | టి.మోహన్ | పి.శ్రీరాంప్రసాద్ |
| 3. | దగదర్తి | ఎల్.కృష్ణారావు | కె.ఆదిశేషయ్య | ఎ.రమణయ్య | టివి రమణమ్మ | ఎన్.శ్రీధర్ | కె.బ్రహ్మయ్య |
| | | | **కర్నూలు జిల్లా** | | | | |
| 1. | పెద్దకడబూరు | కె.హుస్సేన్ | యు.రాజు | ఎం.డి.రఫీక్ | పి.నాగలక్ష్మి | డి.కౌలన్న | కె.శివకుమార్ |
| 2. | డోన్ | ఎం.సుబ్బారెడ్డి | బి.వెంకటేశ్వరరెడ్డి | ఎస్.ఖలీల్ అహమ్మద్ | బి.రాణి | కె.కనకరాజు | డి.రమేష్ |
| | | | **అనంతపురం జిల్లా** | | | | |
| 1. | వజ్రకరూరు | | ప్రకాష్ | రామప్పచౌదరి | శ్రీదేవి | మహేష్‌బాబు | శేఖర్ |

# సమస్యలపై ప్రాతినిధ్యాలు

## శ్రీకాకుళం జిల్లా

### గిరిజన ప్రాంతంలోని ఉపాధ్యాయుల, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

గిరిజన ప్రాంతంలోని ఉపాధ్యాయుల, విద్యార్థుల, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యుటియఫ్ ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్‌కు అక్టోబర్ 21న వినతి పత్రం అందజేశారు. ప్రాజెక్టు ఆఫీసర్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన వారిలో యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.రాము, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కెకె జాజులు, వై.ఎ.ఆర్.కె.ప్రసాద్, ఏజెన్సీ సబ్ కమిటీ కన్వీనర్ కె.రఘునాథ్, కార్యదర్శులు వి.మహేష్, ఎస్.నాగరాజు, జిల్లా కౌన్సిలర్ కె.సంజీవ్ ఉన్నారు.

ఏజెన్సీలో ఖాళీగా ఉన్న 640 ఉపాధ్యాయ పోస్టులను స్పెషల్ డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని, ఖాళీగా ఉన్న 11 ఆశ్రమోన్నత పాఠశాలల హెడ్మాష్టర్ పోస్టులను, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను నెలవారీ ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని యుటియఫ్ నాయకత్వం ప్రాజెక్టు ఆఫీసర్‌ను కోరింది. అలాగే ఆశ్రమ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు ప్రారంభించాలని, కంప్యూటర్ టీచర్లను నియమించాలని, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లను నియమించాలని కోరారు. వీటితోపాటు అన్‌ట్రైన్డ్ / స్పెషల్ విద్యావాలంటీర్లకు బిఇడి చదివేందుకు స్టడీలీవు మంజూరు చేయాలని, అన్‌ట్రైన్డ్ ఉపాధ్యాయుల అన్‌ట్రైన్డ్ సర్వీస్‌గా ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ (ఏఏఎస్)కు వర్తింపచేయాలని తదితర సమస్యలు పిఓ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే గిరిజన ఉపాధ్యాయులకు గృహ నిర్మాణ ఋణ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## విజయనగరం జిల్లా

### వాస్తవాలను పరిశీలించి అన్నికోణాల నుండి సమగ్ర దర్యాప్తు చేయాలి

విజయనగరం జిల్లాలో మెరకముడిదాం మండలంలో గల కెజిబివి పాఠశాలలో అక్టోబర్ 19వ తేదీ నుండి విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటనలో పాఠశాల ప్రత్యేక అధికారిణి ఎ. భారతిని, ఎ.ఎన్.ఎంనను విధుల నుండి తొలగించారు. తొలగించడమే కాకుండా ప్రత్యేక అధికారిణిపై క్రిమినల్ కేసును పెట్టియున్నారు. ఇటువంటి చర్యలను తీసుకునే ముందు అన్ని కోణాల నుండి సమగ్ర దర్యాప్తు జరపాలని సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టరుకు కెజిబివి రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.విజయగౌరి, ప్రధానకార్యదర్శి కె.రమాదేవి, డి.జానకి, పి.స్వప్నలు ప్రాతినిధ్యం చేశారు.

జిల్లా సంచలనాలత్మకంగా చెప్పుకుంటున్న మెరకముడిదాం కెజిబివి పాఠశాల సంఘటనపై అన్ని కోణాల నుండి సమగ్ర దర్యాప్తు జరపాలని వారు అధికారులను కోరారు. కాంట్రాక్టు పద్ధతిలో నియామకాలైన వీరంతా అనేక సమస్యలను ఎదుర్కొంటూ పాఠశాలలను నిర్వహిస్తున్నారు.

మెరకముడిదాం కెజిబివి జిల్లాలలోనే ప్రథమ స్థానంలో ఉంది. 100% ఫలితాలు, ట్రిపుల్ ఐటి సీట్లు, ప్రతిభా అవార్డులు, జాతీయ అవార్డులు అందుకోవడంలో విశేష ప్రతిభ కనబరుస్తుంది. ఒక సంఘటన జరిగినప్పుడు అన్ని కోణాల నుండి విచారణలు జరపకపోవడం, సంస్థ హెడ్‌దే బాధ్యత గనుక శిక్షిస్తున్నాం, మా పని అయిపోయిందని అనిపించుకోవడమే తప్ప న్యాయం చేయడం కాదని గమనించాలి.

ఈ సంఘటనలో వేరుసెనగ పలుకులే భూమికగా మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాడైన వేరుసెనగ పలుకులు పెట్టడం వల్లనే అస్వస్థతకు గురి అయ్యారని, కనుకనే ప్రత్యేక అధికారిణిని విధుల నుండి తొలగిస్తున్నామని, క్రిమినల్ కేసు బనాయించామని చెప్తున్నారు. కానీ ఈ సంఘటనలో అనేక ప్రశ్నలు ప్రశ్నలుగా మిగిలిపోకుండా ఉండాలంటే వాస్తవ సమగ్ర విచారణ ఎంతైనా అవసరం.

అసలు విద్యార్థినులు వేరుసెనగ పలుకులు మేము తినలేదు అని చెప్తున్నా ఎవరూ మా మాట వినడం లేదని వాపోతున్నా... ఎందుకు పట్టించుకోవడం లేదు. ప్రతి పాఠశాలకు 25 నుండి 30 కేజీల వరకే పల్లీలు అవసరమైతే 200 కేజీలు వరకు ఒక్కసారే సరుకులను ఎందుకు డంప్ చేస్తున్నట్లు?

ప్రతి సంవత్సరం పాఠశాలల నుండే ఎంత సరుకు అవసరమో బడ్జెట్ ఇచ్చిన మేరకు సరుకులు పంపేవారు. దానికి భిన్నంగా ఈ యేడాది సంవత్సరానికి సరిపడే సరుకులు ఒక్కసారే ఎందుకు పంపుతున్నారు?

హెల్త్ రిజిష్టర్‌లో అక్టోబర్ 16వ తేదీ నాటికే డయేరియా పేషెంట్లు ఉన్నట్లుగా నమోదు కాబడి ఉంది. వర్షాలు కారణంగా అప్పటికే మెరకముడిదాం చుట్టూ ఉండే కొన్ని గ్రామాలలో డయేరియా ఉన్నట్లుగా ప్రజల నుండి సమాచారం ఉన్నప్పటికీ, ఆ దిశగా దర్యాప్తు ఎందుకు జరపలేదు...?

సరుకుల నాణ్యతను చూడాల్సిన బాధ్యత ఎవరిది...?

కెజిబివి పాఠశాలలకు ఇప్పటికీ మౌలిక వసతుల కొరకు తీవ్రంగా వెంటాడుతున్నాయి. పిహెచ్‌సిలలో నిరంతరం మందుల కొరత, వీటిని పర్యవేక్షించేది ఎవరు....? పాఠశాలల్లో తీవ్రమైన పనిభారం, ఇంగ్లీషు మీడియం, స్టడీ అవర్సు, డెప్యూటీ వార్డెన్ల బాధ్యతలు, డ్రాపవుట్ సర్వేలు ఇవికాక అదనంగా ప్రభుత్వ కార్యక్రమాలతో సతమతమవుతున్నా, ఏ రకమైన భద్రతా సౌకర్యాలు లేకపోయినా జీవనోపాధి కోసం కష్టపడుతున్నారు.

ఉద్యోగ భద్రత లేదు, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవు లేదు, వేతన సెలవు పెంపు అమలు కాలేదు. ఆదివారాలు కూడా డ్యూటీలు చేస్తారు. ప్రత్యేకంగా వార్డెన్సు ఉంటారు. ఇన్ని సమస్యలతో సతమవుతున్న మహిళా టీచర్లు అనే కోణం నుండి కూడా చూసే సందర్భాలు లేవు. కాంట్రాక్ట్ ఉద్యోగులు గనుక ఎటువంటి శిక్షలపైనా అమలుచేయవచ్చు అనే పద్ధతులు మానుకుని కెజిబివి విద్యాభివృద్ధికి దోహదపడే విధంగా చర్యల ఉండాలని కోరుతున్నాము.

## కడప జిల్లా

### పిఆర్‌సి అమలు తేది నుండి పెరిగిన హెచ్‌ఆర్‌ఏ ఇవ్వాలి

యుటియఫ్ పే రివిజన్ కమీషన్ అమలు తేదీ నుండి 14.5% మరియు 20% ప్రాంతాల ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వర్తింపజేయాలని జిల్లా ప్రధానకార్యదర్శి బి.లక్ష్మీరాజ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్

ట్రెజరీ ఉప సంచాలకులను కలసి రెప్రజంటేషన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఆర్‌సి అమలు తేదీ నుండే పెరిగిన హెచ్ఆర్ఏలు వర్తింపచేయాలని జిఓ 48లో స్పష్టమైన ఉత్తర్వులు ఉన్నప్పటికి ఉద్యోగులు, ఉపాధ్యాయుల బిల్లులు మంజూరు చేయనని చెప్పటం సరైనది కాదన్నారు. అలాగే మిగిలిన ప్రాంతాలలో ట్రెజరీ అధికారులు పెరిగిన హెచ్ఆర్ఏ ఇచ్చారని తెలిపారు. రాజంపేట అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ వెంటనే పెరిగిన హెచ్ఆర్ఏ బిల్లులు మంజూరు చేయాలని లేకపోతే రాజంపేట ట్రెజరీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జయరామయ్య, నాయకులు ఎస్.అల్లాబకష్, రాజారెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

## అనంతపురం జిల్లా

**గుంతకల్:**

### ముున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



అనంతపురం జిల్లా గుంతకల్ మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంకై అక్టోబర్ 4న గుంతకల్లు అర్బన్, రూరల్ శాఖల బాధ్యులు గుంతకల్లు మున్సిపల్ కమీషనర్ సత్యనారాయణగౌడ్‌ను కలిసి ప్రాతినిధ్యం చేశారు. ఈ సందర్భంగా గుంతకల్లు మున్సిపల్ ఉపాధ్యాయులకు ప్రావిడెంట్ సౌకర్యము కల్పించాలని, పిఎస్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతులను చేపట్టాలని, పిఎఫ్ అరియర్స్‌ను ఆయా ఉపాధ్యాయుల ఖాతాలలో జమ చేయాలని, ప్రస్తుతము జరుగుతున్న పల్స్ సర్వేలో మున్సిపల్ ఉపాధ్యాయులను ఆ విధుల నుండి తీసివేయాలని, ఎస్ఎస్ఏకె మున్సిపల్ ఉర్దూ యుపి పాఠశాలను మూసివేసిన కారణంగా అక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయులను ఉర్దూ ఉన్నత పాఠశాలకే బదిలీ చేయాలని కోరారు.

వెంటనే కమీషనర్ స్పందిస్తూ పల్స్ సర్వే నుండి ఉపాధ్యాయులను రిలీవ్ చేయడానికి అంగీకరించారు. అలాగే ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలకు మార్చడానికి ఉత్తర్వులిస్తామని, ఇతర సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఎస్‌వివి రమణయ్య, గుంతకల్ అర్బన్ గౌరవాధ్యక్షులు బి.శ్రీనివాసులు, అధ్యక్ష, కార్యదర్శులు శంకరయ్య, రాఘువేంద్ర, రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు చౌదయ్య, మోహన్‌బాబు, రవికుమార్, రవి ప్రసాద్, మల్లికార్జున, రామ మోహన్, శ్రీహరి, లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురం జిల్లా

### ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చేయాలి

**- ఐ.వెంకటేశ్వరరావు**

అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో విద్యా సదస్సు జిల్లా అధ్యక్షులు ఎం.సుధాకర్ అధ్యక్షతన అక్టోబర్ 5న జరిగింది. ప్రధానకార్యదర్శి కె.నాగేంద్ర ఆహ్వానము పలికారు. సుధాకర్ మాట్లాడుతూ జిల్లాలో మన సంఘం అవినీతికి వ్యతి రేకంగా ఉద్యమాలు నిర్మించి, శాస్త్రీయ దృక్పథంతో, విద్యారంగ, ఉపాధ్యాయ రంగ సమస్యలను పరిష్కరిస్తూ వస్తుందని, ఆ ఉద్యమ స్పూర్తితోనే కొంత భవనము కల నేరవేరిందని తెలియజేశారు. పూర్వ అధ్యక్షులు టి.ఇమాంసాహెబ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఒక్క నాయకుని ఈ సందర్భంగా తలచుకోవాలని, వారందరి బాటలో పయనించాలన్నారు.

ముఖ్య అతిథి రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యలో సంస్కరణల పేరుతో ప్రబుత్వ విద్యారంగాన్ని కార్పొరేట్ రంగానికి అప్పజెప్పడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, దీనిని వ్యతిరేకిస్తూ ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్పొరేట్ వ్యవస్థను బలోపేతం చేయు దిశలోనే జాతీయ విద్యా విధానం ముసాయిదాను ప్రవేశ పెట్టిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంపై అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకించాలన్నారు.

ఎమ్మెల్సీ డా॥ ఎం.గేయానంద్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యలో అనేక రకమైన సంస్కరణలు చోటు చేసుకుంటున్నాయి. ఈ సంస్కరణలు ఉపాధ్యా యుల ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా వున్నాయన్నారు. ప్రభుత్వ విద్యకు విఘాతం కలిగించే సంస్కరణలను వ్యతిరేకించే ఉద్యమాలలో మీ వెన్నెంటే వుంటానని తెలియజేశారు.

రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎన్.నరసింహుడు మాట్లాడుతూ విద్యా రంగాన్ని చిన్నాభిన్నము చేయుటను, ఉపాధ్యాయులలో ఐక్యతను దెబ్బ తీయడానికే ప్రభుత్వము కుట్ర పన్నుతుదన్నదని దీనిని మనము ధీటుగా ఎదుర్కోవాలన్నారు. అదే విధంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానమును రద్దుపరచి పాత పెన్షన్ విధానమును కొనసాగించే వరకు మనం ఐక్య పోరాటాలు నిర్మించాలన్నారు. యుటియఫ్ సీనియర్ నాయకులు ఎంఏకె దత్త ప్రసంగిస్తూ నూతన విద్యా విధానం కేంద్రీకరణ, వాణిజ్యీకరణ, మతతత్వీకరణలను అంతర్లీనంగా వున్నాయి. వీటిని ప్రజలకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని అని అన్నారు. నా నాటికి ప్రభుత్వ విద్యను దిగజార్చే విధంగా ప్రభుత్వాలు సంస్కరణలు తెస్తున్నాయన్నారు.

రాష్ట్ర కార్యదర్శి ఎస్.మహమ్మద్ జిలాన్ మాట్లాడుతూ జిల్లాలో మన ఉద్యమం బలోపేతంగా వుందనడానికి నిదర్శనమే ఈ రోజు సొంతభవన నిర్మాణమన్నారు. కడప జిల్లా ప్రధానకార్యదర్శి బి.లక్ష్మి రాజ, కర్నూలు అధ్యక్షులు డి.రామశేషయ్య, ప్రధానకార్యదర్శి కె. సురేష్‌లు అనంతపురం జిల్లా శాఖకు అభినందనలు తెలిపారు.

గౌరవాధ్యక్షులు సికె నాగేంద్రబాబు, కోశాధికారి బి.రామకృష్ణ, సహాధ్యక్షులు ఎస్‌వివి రమణయ్య, జి.ఉషారాణి, జిల్లా కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర కౌన్సిలర్‌లు వి.గోవింద రాజులు, యు.శ్రీనివాసులు వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# యుటియఫ్ బలపర్చిన ఎమ్మెల్సీలను గెలిపించుకుందాం

**విజయనగరం జిల్లా**

### ముమ్మరంగా ఓటర్ల నమోదు కార్యక్రమం

ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఎన్‌రోల్‌మెంట్ (ఓటర్ల నమోదు) కార్యక్రమం యుటియఫ్ ఆధ్వర్యంలో ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మండల కమిటీలు బృందాలుగా పాఠశాలలకు నమోదు ఫారాలను పంపి, పూర్తి చేయించి మండల రెవెన్యూ అధికారులకు అందజేస్తున్నారు. ప్రధానంగా విజయనగరం, జామి, ఎస్.కోట, చీపురపల్లి, గజతినగరం, రామభద్రపురం, సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం, జిఎల్ పురం, తెర్లాం ప్రాంతాలలో ఉపాధ్యాయులు నివాసం ఉన్నందున ఆ ప్రాంతాలలో నమోదు బృందాలుగా చేస్తున్నారు.

మండల కమిటీలు కెజిబివి, గురుకులాలు, ఆదర్శ పాఠశాలల్లో విస్తృతంగా తిరుగుతున్నారు. 8 ప్రాంతాలలో సమావేశాలు జరిపి నమోదు కార్యక్రమానికి ప్రణాళిక రూపొందించుకున్నారు. అభ్యర్థి అజశర్మ 6 ప్రాంతాలలో నమోదు కోసం పాల్గొన్నారు. రామభద్రపురంలో ప్రధానోపాధ్యాయుల సమావేశంలో పాల్గొని నమోదు ప్రాధాన్యతను వివరించారు. జిల్లాలో మిగిలిన సంస్థలకంటే ఉపాధ్యాయుల నమోదు ఎక్కువగా ఉంది. మొత్తం ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల నాయకత్వాలు పాల్గొని నమోదు చేయిస్తూ, అభ్యర్థికి సంబంధించిన బయోడేటాను పరిచయం చేస్తున్నారు.

**ప్రకాశం జిల్లా**

### కనిగిరి ప్రాంత పర్యటన

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం అక్టోబర్ 17న హనుమంతునిపాడు మండలంలోని కస్తూరిభా పాఠశాల, హనుమంతునిపాడు, పెదగొల్లపల్లి, వాలిచర్ల, మహమ్మదాపురం, నందనవనం, చినముప్పళ్ళపాడు, సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు సందర్శించి కనిగిరిలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 18న పిసి పల్లె మండలం పెదఅలవలపాడు, నేరేడుపల్లి, పెదచెర్లోపల్లి ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజి, కస్తూరిభా ఉన్నత పాఠశాల, గుంటుపల్లి, పెదఇర్లపాడు హైస్కూల్ సందర్శించడం జరిగింది. వారివెంట ఎన్.రామచంద్రారెడ్డి, క్రిష్ణమూర్తి వి.మాలకొండారెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, గాయం వెంకటరెడ్డి, నారాయణరెడ్డి, శ్రీను, రవిచంద్రారెడ్డి, ఎస్‌కె.పి.ఎం.గౌస్, వై.వి.రావు, ఖాజారహంతుల్లా, ఉడుముల వెంకటేశ్వర్లు, రత్తయ్య, గురవారెడ్డి, యుద్దం శ్రీను, శ్రీనివాసాచారి, పోతులూరయ్య, గల్లా చెన్నయ్య, రమణారెడ్డి, మోహన్‌బాబు, స్రవంతి, శ్రీదేవి, ఆదిలక్ష్మి తదితరులు పర్యటనలో పాల్గొన్నారు.

### మార్కాపురం ప్రాంత పర్యటన

కనిగిరి నుండి 19వ తేదీ ఉదయం తర్లుపాడు, మార్కాపురం మండలాల పాఠశాలల పర్యటన చేశారు. ముందుగా తర్లుపాడు కస్తూరిభా పాఠశాల, కలుజురులపాడు హైస్కూల్, సోషల్ వెల్ఫేర్ పాఠశాల రాయవరం, మార్కాపురం కస్తూరిభా పాఠశాల, రాయవరం హైస్కూల్, జ్యోతిరావు, బిసి వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల, మార్కాపురం బాలుర పాఠశాల, ఎస్‌వికెపి డిగ్రీ కాలేజి సందర్శించడము జరిగింది. వి.బాలసుబ్రహ్మణ్యం వెంట జిల్లా సహాధ్యక్షులు ఒవి వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీరాములు, ఝూన్సిపాల్, మహంతనాయక్, సురేష్‌రెడ్డి, ఉమామహేశ్వరి, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, వి.వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, వి.సిహెచ్. వెంకటేశ్వరరెడ్డి, శ్యాంప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### యర్రగొండపాలెం ప్రాంత పర్యటన

అక్టోబర్ 20న వి.బాలసుబ్రహ్మణ్యం యర్రగొండపాలెంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజి, ఉన్నత పాఠశాల, కస్తూరిభా ఉన్నత పాఠశాల సందర్శించారు. వారివెంట జిల్లా కార్యదర్శి డి.బంగారయ్య, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఇ.వి.ప్రసాదు, బాబుల్‌నాయక్, క్రిష్ణారావు, రంగనాయకులు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**చిత్తూరు జిల్లా**

**తిరుపతి :**

### ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలను గెలిపించుకుందాం

చిత్తూరు-నెల్లూరు-ప్రకాశం జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉద్యమ అభ్యర్థులను గెలిపించి ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాలని యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పెద్దకాపు లే ఔట్‌లోని యుటియఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా విఠపు బాలసుబ్రహ్మణ్యం, పట్టభద్రుల ఎమ్మెల్సీగా వై.శ్రీనివాసులురెడ్డిలకు యుటియఫ్ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. గతంలో ఈ ఇద్దరితోపాటు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అప్రెంటీస్ విధానం రద్దు, పండిట్, పిఇటిల అప్‌గ్రేడేషన్, క్లస్టర్ స్కూళ్ళ విధానం నిలుపుదలకు, సిపిఎస్ విధానం రద్దుకు, ప్రభుత్వ పాఠశాలలు, విద్యారంగ సమస్యలు, నిరుద్యోగ సమస్య, టిటిడి మరియు ప్రభుత్వ విభాగాలలో ఖాళీ పోస్టుల భర్తీ, మన్నవరం ప్రాజెక్టు (బిహెచ్‌ఇఎల్) పూర్తి స్థాయిలో ఏర్పాటు, కెజిబివి పాఠశాలలు, మోడల్ మరియు మున్సిపల్ పాఠశాల సిబ్బంది మరియు పాఠశాల సమస్యలపైన, ఎయిడెడ్ పాఠశాలల సిబ్బందికి నెలనెల జీతాలపై పోరాటాలు చేసి కొన్నింటిని సాధించారని తెలిపారు. భవిష్యత్‌లో విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల సాధనకు, పట్ట భద్రుల సమస్యలపై పోరాటం చేయగల వీరిని గెలిపించాలని కోరారు.

ఈ సమావేశంలో నాయకులు గుణశేఖర్‌రెడ్డి, ముత్యాలరెడ్డి, చిన్నస్వామి, మోహనమూర్తి, నాగభూషణం, జివి రమణ, నాగేశ్వర్ నాయుడు, సుధాకర్ నాయుడు, నాగరాజు, రామచంద్ర నాయుడు, చంద్రశేఖర్ నాయుడు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

**కడప జిల్లా**

### ఓటరుగా నమోదు కావాలి

కడప పట్టణంలో టీచర్స్, గ్రాడ్యుయేట్ శాసనమండలి ఓటరు నమోదు కోసం కడప యుటియఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 17న కళాశాలలు, మున్సిపల్ హైస్కూల్, జిల్లా పరిషత్ హైస్కూల్స్,

ప్రభుత్వ పాలిటెక్నిక్, గురుకుల పాఠశాల, కళాశాల, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంక్‌లలో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఫామ్ 18 మరియు 19లను యుటియఫ్ ఆధ్వర్యంలో పంపిణీ చేయటం జరిగింది.

గురుకుల పాఠశాలలో జిల్లా ప్రధానకార్యదర్శి బి.లక్ష్మీరాజ మాట్లాడుతూ 2013 అక్టోబర్ నాటికి డిగ్రీ పూర్తిచేసిన వారందరూ గ్రాడ్యుయేషన్ ఓటరు నమోదుకు అర్హులు. అలాగే గత 6 సం॥ల కాలంలో 3 సం॥లు ఉన్నత పాఠశాల కళాశాలల్లో పనిచేసిన వారందరూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అర్హులని తెలిపారు. పాత గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఓటర్ల జాబితా రద్దయినందు వలన కొత్తగా అందరూ ఓటరు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గురుకుల రెసిడెన్సియల్ ఉపాధ్యాయులకు అధ్యాపకులకు పిఆర్‌సి పదవీ విరమణ 60 సం॥లకు పెంపు, హెల్త్‌కార్డులు విధానం అమలు చేయకపోవటం సరికాదన్నారు. బాహ్య మూల్యాంకనం ఉపాధ్యాయులను అవమానించడమేనన్నారు. కంప్యూటర్‌లో నమోదు ఆన్‌లైన్ చేయడం నుండి ఉపాధ్యాయులను మినహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు పి.చంద్రశేఖర్, నాయకులు ఎస్. మస్తాన్, కె.నరసింహారావులు పాల్గొన్నారు.

**డా॥ ఎం.గేయానంద్‌కు ప్రజా సంఘాల మద్ధతు**



డా॥ ఎం.గేయానంద్ అభ్యర్థిత్వానికి మద్ధతుగా పలు ఉపాధ్యాయ, అధ్యాపక, ఉద్యోగుల సమావేశం అక్టోబర్ 25న కడపలో జరిగింది. ఈ సమావేశంలో ఎల్ఐసి డివిజన్ ప్రధానకార్యదర్శి ఏ.రఘునాథ్‌రెడ్డి, యుటియఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.చంద్రశేఖర్, ట్రెజరర్ ఎస్.వి. సుబ్బరాజు, కె.నరసింహారావు, జెవివి బి.రాజశేఖర్‌రావు, తన్నా సురేష్, ఏడి దేవదత్తం, షామీర్‌భాషా, ఆర్‌డిఎఫ్ జిల్లా నాయకులు, మెడికల్ రెప్స్ నాయకులు రామాంజనేయరెడ్డి, బివిఎస్ రాజు, రాష్ట్ర కార్యదర్శి ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ సంఘం, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ నాయకులు కామనూరు శ్రీనివాసులురెడ్డి, ఆర్‌టిసి సిద్ధయ్య, షుగర్ ఫ్యాక్టరీ నాయకులు పి.కృష్ణ, జివిఎస్ రాజు, సిఐటియు, అంగన్‌వాడీ, గ్రామ సేవకులు, యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్, ఉపాధ్యాయ సంఘాలన్నీ పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి డా॥ ఎం.గేయానంద్ గెలుపుకు సంపూర్ణ మద్ధతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. గేయానంద్ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పనిచేశారనన్నారు. ఆయన గెలుపుకోసం బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

## పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఏపిఎంఎస్‌టిఎఫ్ మద్ధతు

2017 మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు మద్ధతు ప్రకటిస్తూ రాష్ట్ర మోడల్ స్కూల్స్ టీచర్స్ ఫెడరేషన్ కార్యవర్గం తీర్మానం చేసింది. అక్టోబర్ 16వ తేదీన యుటియఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఏపిఎంఎస్‌టిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగినది.

చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఉపా ధ్యాయ నియోజకవర్గ అభ్యర్థిగా ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం.

కడప, కర్నూలు, అనంతపురం గ్రాడ్యుయేట్ అభ్యర్థిగా ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్సీ డా॥ ఎం.గేయానంద్.

చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం గ్రాడ్యుయేట్ అభ్యర్థిగా ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్సీ వై.శ్రీనివాసులురెడ్డి.

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ గ్రాడ్యుయేట్ అభ్యర్థిగా ఎన్.అజశర్మ.

వీరి అభ్యర్థిత్వానికి ఏపిఎంఎస్‌టిఎఫ్ మద్ధతు ప్రకటిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగినది. అన్ని నియోజకవర్గాలలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

**విజయనగరం జిల్లా**

## గిరిజన సంక్షేమ పాఠశాలల సిఆర్‌టిల వేతనాలు పెంచాలని ఐటిడిఏ కార్యాలయం వద్ద ఆందోళనలు




గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసి డెన్షియల్ టీచర్ల వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలను పార్వతీ పురం ఐటిడిఏ కార్యాలయం వద్ద నిర్వహించారు.

ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.విజయ గౌరి, ప్రధానకార్యదర్శి ఇ.భాస్కరరావు, యుటియఫ్ నాయకులు ఎస్. మురళీమోహన్, టి.రమేష్, ఎన్.శ్రీరాములు, చిట్టిబాబు, మురళీకృష్ణప్త, రాజగోపాల్‌లు మాట్లాడారు. సిఆర్‌టిలంతా అర్ధనగ్న ప్రదర్శనలు, ఆకలి యాత్రలు నిర్వహించారు.

గిరిజన సంక్షేమ శాఖామంత్రి రావెల కిషోర్‌బాబు ఇచ్చిన హామీని అమలు చేయాలని, సిఆర్‌టిలకు ఉద్యోగ భద్రత కల్పించి, వేతనాన్ని పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 4వేల రూపాయలతో జీవనం ఎలా కొనసాగుతుందని ఆకలి యాత్ర సందర్భంగా మాట్లాడారు. అనంతరం వినతి పత్రాన్ని ఐటిడిఏ డిడికి సమర్పించారు.

## మహిళా టీచర్లకు, బాలికలకు పాఠశాలల్లో టాయిలెట్లు నిర్మించాలి



తూర్పుగోదావరి జిల్లా కాకినాడ యుటియఫ్ హోమ్‌నందు యుటియఫ్ జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు ఎన్.అరుణకుమారి అధ్యక్షతన జిల్లా మహిళా టీచర్ల వర్క్‌షాప్ జరిగింది. అధ్యక్షోపన్యాసంలో అరుణకుమారి మాట్లాడుతూ మహిళలు ఎక్కువగా ఉన్న రంగం ఉపాధ్యాయ రంగం అనీ, అలాగే మహిళా ఉపా ధ్యాయులకు సంఘ నిర్మాణంలో కీలకపాత్ర ఇచ్చిన మాత్రం యుటియఫ్ మాత్రమేనన్నారు. ఈ వర్క్‌షాపుకు యుటియఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు కె.విజయగౌరి హాజరై మాట్లాడుతూ సమాజంలో మార్పురావాలంటే విద్య ద్వారా మాత్రమే సాధ్యమౌతుందని, మన రాష్ట్రంలో సుమారు 78వేల మహిళా టీచర్లు పనిచేస్తున్నారన్నారు. మహిళలలో చైతన్యం తీసుకు రావడంలో యుటియఫ్ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. పాఠశాలలో టాయిలెట్లు లేక, ఒక వేళ ఉన్నా రన్నింగ్ వాటర్ లేక బాలికలు, మహిళా టీచర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురుజాడ వారసులుగా మహిళల సమస్యలపై అవగాహన కలిగి చర్చ జరిపి భవిష్యత్ కర్తవ్యాలను నిర్దేశించుకోవాలని పిలుపునిచ్చారు.

వర్క్‌షాప్‌నందు జిల్లా మహిళా సబ్ కమిటీ కన్వీనర్ మరియు యుటియఫ్ జిల్లా కార్యదర్శి ఎం.విజయగౌరి, మరొక జిల్లా కార్యదర్శి వి.సోనీ, రాష్ట్ర కౌన్సిలర్లు ఇ.శ్రీమణి, యం.కవిత తదితరులు ప్రసంగించారు. మహిళా టీచర్ల నుండి సింధూరి (విఆర్ పురం), క్రిష్ణవేణి (ఐ.పోలవరం), సీతారత్నం (మారేడుపల్లి), దేవి (కాకానాడ రూరల్), దేవి (ప్రత్తిపాడు), లక్ష్మీబాయి (గోకవరం), శాంతి (సామర్లకోట), శారదకుమారి(విఆర్ పురం) మాట్లాడారు. కెఎన్‌బి లక్ష్మి (అంబాజీపేట) ఆహ్వానం పలికిన ఈ వర్క్‌షాపునకు రాష్ట్ర కౌన్సిలర్ ఎన్‌వి రత్న కుమారి వందన సమర్పణ చేశారు. వర్క్‌షాప్‌నందు రాష్ట్ర కౌన్సిలర్ జెడివికె కుమారి, జిల్లా కార్యవర్గ సభ్యులు యం.రంగమహాలక్ష్మి, డి.అన్నపూర్ణ, కె.విజయ కుమారి, పిఎస్ శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉత్తర్వులు

1. కాంట్రాక్టు మరియు ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రతినెల ఒకటవ తేదీకి రెమ్యునరేషన్ చెల్లింపు ఉత్తర్వు
   **జి.ఓ.ఎం.ఎస్.నం.197 ఆర్థిక, తేది.14.10.2016.**
2. ఉద్యోగ నియామకాలకు గరిష్ఠ వయస్సు 2 సం॥ల పెంపుదల ది.30.09.2017 వరకు పొడిగింపు ఉత్తర్వు
   **జిఓ ఎంఎస్ నం. 382 జిఏడి, తేది.17.10.2016.**
3. 2011-12లో స్పెషల్ ఎడ్యుకేటర్స్‌గా పనిచేసిన వారి జీతాల చెల్లింపుకై బడ్జెట్ కేటాయింపులు ఉత్తర్వు
   **జిఓ ఆర్‌టి నం.259 పాఠశాల విద్యాశాఖ; తేది.18.10.2016**
4. పాఠశాల కాంప్లెక్సు సమావేశాల నిర్వహణ ఉత్తర్వు
   **ఎస్‌పిడి, సర్వశిక్షా అభియాన్ ఉత్తర్వు ఆర్‌సి నం.55/ఎస్ఎస్ఎ/2016; తేది.19.10.2016.**
5. మధ్యాహ్న భోజన పథకం రేట్లు పెంపుదల ఉత్తర్వు
   **జిఓ ఆర్‌టి నం.260; తేది.21.10.2016**
6. పాఠశాలల్లో పఠనోత్సవ కార్యక్రమ నిర్వహణ ఉత్తర్వు
   **ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టరు ఉత్తర్వు ఆర్‌సి నం.443/బిఇ/సి&టి/2015; తేది.27.10.2016.**
7. మోడల్ పాఠశాలల్లో పనిచేస్తున్న పిఇటి మరియు కంప్యూటర్ టీచర్ల వేతనము పెంచవలసిందిగా ప్రభుత్వానికి ప్రతిపాదనల లేఖ
   **పాఠశాల విద్య కమీషనర్ లేఖ ఎల్‌ఆర్ నం.172/ఎ1/ఏపి ఎంఎస్/2016; తేది.31.10.2016.**
8. ఉన్నత పాఠశాలల్లో గ్రేడ్-2 భాషా పండితులు, పిఇటి పోస్టులు అప్‌గ్రేడేషన్ ఉత్తర్వు
   **ప్రభుత్వ ప్రధానకార్యదర్శి మెమో నం.10093/సర్వీస్-2/ఎ1/2012; తేది.25.10.2016.**

### పాఠకులకు గమనిక :

తెలుగు మాస పత్రికలలో ఇంగ్లీషులో ప్రభుత్వ ఉత్తర్వులు, ఇంగ్లీషులో వ్యాసాలు వంటివి ప్రచురించ రాదని ఇటీవల పోస్టల్ శాఖ వారు అభ్యంతరం తెలిపారు. అందువలన ప్రభుత్వ ఉత్తర్వుల నంబరు, వివరాలు మాత్రమే ప్రచురించడం జరుగు తున్నది. ప్రభుత్వ ఉత్తర్వులు యథావిధిగా ప్రచురించ డానికి పోస్టల్ డిపార్టుమెంట్ వారికి, రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్ వారికి ప్రతిపాదనలు పంపడం జరిగింది. పోస్టల్ పర్మిషన్ కొరకు కృషి చేయడం జరుగుతున్నది. అసౌకర్యానికి చింతిస్తున్నాం.

– సంపాదకవర్గం